అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 24-1-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 23 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

అడుగడుగునా అడ్డంకులే



అసోంలో రాహుల్ యాత్రకు బీజేపీ అవరోధాలు

- పోలీసులతో ఘర్షణకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు
- కాంగ్రెస్ నేతపై కేసు నమోదుకు హిమంత బిశ్వ శర్మ ఆదేశం



గువహతిలో రాహుల్ యాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు..

వివరాలు 3లో..



బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

శతజయంతి సందర్భంగా అత్యున్నత పురస్కారం

న్యూఢిల్లీ : భారతదేశపు స్వాతంత్ర్య సమరయోధుడు, జననాయక్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌ను భారతరత్న వరించింది. కర్పూరి ఠాకూర్‌కు ఉన్న పాపులారిటీ కారణంగా అతన్ని జననాయక్ అని పిలుస్తారు. బీహార్‌లోని సమస్తిపూర్‌లో జన్మించిన ఆయన ఉపాధ్యాయుడిగా, భారత స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయవేత్తగా సేవలందించారు. ఆయన శత జయంతి సందర్భంగా ఆయనకు అత్యున్నత పురస్కారాన్ని అందిస్తున్నట్టు రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. కర్పూరి ఠాకూర్ 1924 జనవరి 24న బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో జన్మించారు. మంగలి కుటుంబానికి చెందిన ఆయన తండ్రి గోకుల్ ఠాకూర్ రైతు. కర్పూరి ఠాకూర్ తన ప్రాథమిక విద్యను గ్రామంలోనే అభ్యసించారు. ఆ తరువాత పాట్నా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులయ్యారు. విద్యార్థి దశ నుంచే జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కర్పూరి ఠాకూర్ విద్యార్థి దశ నుంచే జాతీయ ఉద్యమంలో చురుకుగా ...13లో

హామీలన్నీ అమలుచేస్తాం

మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్, మంత్రి శ్రీధర్ బాబు

- వచ్చే నెల నుంచి ఉచిత విద్యుత్ :మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శ్రీధర్ బాబు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ది మంచి మ్యానిఫెస్టో అని ప్రజలు ఆదరించారని తెలిపారు. అధికారంలోకి రాగానే ఆ మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు దిశగా అడుగులు వేశామని చెప్పారు. రెండో రోజే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ కవరేజి రూ.10 లక్షలకు పెంపు అమల్లోకి తెచ్చామని గుర్తుచేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు తొందరపాటుతనంతో కూడుకున్నవని విమర్శించారు.

వచ్చే నెల నుంచి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ నెరవేరబోతుందని రోడ్లు, ...13లో

సీఎం సారూ.. బిల్లులివ్వండి

కొత్త సర్కారు ఆదుకుంటుందనే ఆశతో సర్పంచుల ఎదురుచూపు

- పదవీ కాలం దగ్గర పడ్డా ఇంకా పెండింగ్‌లోనే బిల్లులు
- 14 నెలలుగా అందని ఎస్ఎఫ్‌సీ నిధులు
- 20 మంది దాకా ఆత్మహత్య చేసుకున్న వైనం

ఫిబ్రవరి రెండో తేదీతో గడువు ముగింపు

'మా పదవీ కాలం దగ్గర పడుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లక్షలకు లక్షలు అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినం. చేసిన పనులకు బిల్లులు రాక..వడ్డీల భారం భరించలేక..అప్పులోళ్లకు ముఖం చూపలేక నిత్యం చస్తూ బతుకుతున్నం. ఏడాది నుంచి స్టేట్ ఫైనాన్స్ కమిషన్(ఎస్ఎఫ్‌సీ) నిధులు కోసం ఎదురుచూస్తున్నాం. రాష్ట్రంలో ఇప్పటికే 20 మంది దాకా సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నరు. రేవంత్‌రెడ్డి సారూ దండం పెడ్తున్నాం. పదవీ కాలం అయిపోయేసరికి పెండింగ్ బిల్లులు ఇప్పించండి. పార్టీలతో సంబంధం లేకుండా న్యాయం చేస్తే రుణపడి ఉంటాం' రాష్ట్రంలో ఏ సర్పంచిని కదిలించినా వినిపిస్తున్న మాట ఇదే. వివరాలు 3లో



ప్రజారవాణా అస్తవ్యస్తం

- ఎంఎంటీఎస్ రైళ్ల వ్యవస్థను సమీక్షించాలి
- ముఖ్యమంత్రికి సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ లేఖ



వివరాలు 3లో..

దేవాలయ భూముల్లో కాటేజీలు

టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు : ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేవాలయ సందర్శకులకు సౌకర్యాలు కల్పించడంలో భాగంగా ఆలయ భూముల్లో కాటేజీలు నిర్మించి టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన అధ్యక్షతన దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖల బడ్జెట్ అంచనాల ముందస్తు సమీక్ష సమావేశం జరిగింది. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, పర్యావరణ, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆదాయం లేని దేవాలయాలకు ధూప దీప నైవేద్యం కింద ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు. ప్రధానంగా అటవీ శాఖతో కలిసి టెంపుల్ టూరిజాన్ని, ఎకో టూరిజంతో కలిపి టూరిస్ట్ సర్క్యూట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో నాగోబా, మేడారం లాంటి గిరిజన జాతరలకు సంబంధించి దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అటవీ సంపద, వన్య ప్రాణుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏజెన్సీ, అటవీ భూముల్లో గిరిజనులకు ఆర్థిక మేలు జరిగేలా ఆయుర్వేద సంబంధిత మెడిసినల్ ప్లాంటేషన్లను చేపట్టాలనీ, ఆయుష్ శాఖ, ఆయుర్వేద మందుల కంపెనీలతో ...13లో



సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ తదితరులు..

'కేరళ నిరసన కార్యక్రమం'లో పాల్గొననున్న స్టాలిన్



తిరువనంతపురం : ఫిబ్రవరి 8న న్యూఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ కూడా పాల్గొననున్నారు. ఈ మేరకు స్టాలిన్‌కు అధికారికంగా ఆహ్వానం అందింది. కేరళ న్యాయశాఖ మంత్రి పి రాజీవ్ చెన్నైలో స్టాలిన్‌తో సమావేశమై విజయన్ తరపున ఆహ్వానాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేరళ దాఖలు చేసిన పిటీషన్ గురించి స్టాలిన్‌కు మంత్రి రాజీవ్ వివరించారు. కేంద్రం విధించిన ఆర్థిక ఆంక్షలను వ్యతిరేకించాల్సిన అవసరాన్ని స్టాలిన్ సమర్థించినట్టు ఒక అధికారిక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. రాష్ట్రాలపై కేంద్రం ...13లో

ఆ ముగ్గురి పేర్లు ఖరారు..

నామా..రంజిత్.. బోయినపల్లికి గులాబీ బాస్ గ్రీన్ సిగ్నల్

- మిగతా స్థానాలపై పలువురి ఆశలు
- అధినేత నిర్ణయం కోసం ఎదురు చూపులు







నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో రానున్న లోక్‌సభ ఎలక్షన్లలో ఎక్కువ స్థానాలు గెలవాలనే లక్ష్యంతో ఉన్న బీఆర్ఎస్... అందుకనుగుణంగా తన కార్యాచరణను సిద్ధం చేస్తున్నది. ఇటీవల ముగిసిన పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం...క్యాడర్ ఆలోచనలకు అనుగుణంగా ఇప్పటికే పలు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఖమ్మం నుంచి పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి బరిలోకి దింపాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే నిర్ణయించారు. దీంతోపాటు కరీంనగర్ టిక్కెట్టును మాజీ ఎంపీ, తనకు అత్యంత దగ్గరి బంధువైన రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కేటాయించేందుకు గులాబీ బాస్ నిర్ణయించారు. ఇవిపోను మిగతా 14 స్థానాల్లో ఎవర్ని నిలబడతారనే చర్చ ఇప్పుడు కొనసాగుతున్నది.

హైదరాబాద్ ఎంపీ స్థానంలో తమకు దోస్తీ అయిన ఎంఐఎంపై నామమాత్రపు పోటీ పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. మజ్లిస్ తమకు ఫ్రెండ్లీ పార్టీ అంటూ మొన్నటిదాకా కేసీఆర్, కేటీఆర్ ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో అక్కడ ఎంఐఎంను 'చూసీ చూడనట్టు' వదిలేయనున్నారని సమాచారం. అయితే అక్కడి నుంచి తనకు అవకాశమివ్వాలంటూ బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పట్నం కమలాకర్ కోరుతున్నారు. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో తన సామాజిక వర్గమైన మున్నూరు కాపుల ...13లో

ధరణిపై కలెక్టర్లతో నేడు సమావేశం

పెండింగ్ సమస్యలు, మధ్యంతర నివేదికపై చర్చ

- కమిటీకి మంత్రి పొంగులేటి దిశా నిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధరణి సమస్యలపై చర్చించేందుకు బుధవారం సిద్దిపేట, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏలో ధరణి కమిటీ సమావేశం కానుంది. కలెక్టర్ల భేటీలో చర్చించే అంశాలపై మంగళవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ధరణి కమిటీ మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి వారికి పలు సూచనలు చేసినట్టు సమాచారం. రెవెన్యూ లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం 2.31 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 1.8 లక్షల ఎకరాల భూములకు సంబంధించి డిజిటల్ సంతకాల (డీఎస్) కోసం భూ యాజమానులు ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా సాదా బైనామా కోసం 9.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌లో ప్రస్తుతం అవకాశం లేదు. ఇందులోని సమస్యలను కమిటీ రెండు భాగాలుగా విభజించింది. ప్రస్తుతం సర్వే నెంబరు మిస్సింగ్, ఎక్స్‌టెన్షన్ కరెక్షన్ చేయాలంటే ఆ ఫైలు సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సి వస్తోంది. డిజిటల్ పాస్‌బుక్ మొదటి పేజీలో తప్పులు సరిచేయించుకోవాలంటే కలెక్టర్‌ను ఆశ్రయించాలి. ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లను సరిచేయించుకునేందుకు యజమానులు నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తాత్కాలిక సమస్యలను ...13లో

ఆ అధికారం పోలీసులకుందా?

- వ్యక్తులను కట్టేసి కొట్టిన ఘటనను ప్రస్తావిస్తూ సుప్రీం వ్యాఖ్యలు



వివరాలు 13లో

మే 10 నుంచి ఎంసెట్!

త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్

- తర్వాతే కన్వీనర్ల పేర్లు ప్రకటన
- ఉన్నత విద్యామండలి కసరత్తు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మే 10 నుంచి ఎంసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. అందుకనుగుణంగా షెడ్యూల్‌ను రూపొందించింది. అయితే గతేడాది మే 10, 11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. అవే తేదీల్లో ఈ ఏడాది ఎంసెట్ రాతపరీక్షలను ...13లో

మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ సెక్రెటరీ డాక్టర్ ఎ శరత్
- మేడారంలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన



వివరాలు 3లో..



ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించాలి
- అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి అధికారులతో నగర అభివృద్ధిపై మంత్రి సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఖమ్మం నగరాన్ని శానిటేషన్, ప్లానింగ్, టౌన్ ప్లానింగ్ తదితర అన్ని విభాగాల్లో నగరం మోడల్‌గా ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. 4.23 లక్షల జనాభా ఉన్న ఖమ్మం నగరానికి 69.50 ఎంఎల్డీ తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. వేసవిలో నగరంలోని ఏ ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చిన చోట, పట్టాలు పొందిన వారే ఉంటున్నారా లేక అమ్మడం ఇతరత్రా జరిగిందా విచారణ చేసి, చర్యలు తీసుకోవాలన్నారు. లకారం, ఖానాపురం, మున్నేరు, ధంసలాపురంల వద్ద బఫర్ జోన్ డీ మార్కు చేసి, నిర్మాణాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే 25 ఏండ్లలో నగరంలో అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏయే ప్రదేశాల్లో రోడ్ల విస్తరణ ఆవశ్యకత ఉందో పరిశీలన చేసి, నివేదిక ఇవ్వాలన్నారు. సమీక్షలో సుడా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ మార్పులపై చర్చించారు. ఇల్లందు క్రాస్ రోడ్, ముస్తఫానగర్ ప్రాంతాల్లో కమర్షియల్ కేటగిరీలుగా ఉండగా, రెసిడెన్షియల్ కేటగిరీలుగా, ప్రకాష్ నగర్ నుంచి ధంసలాపురం రోడ్, గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి, బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో మున్నేరు నది నుంచి 50 మీటర్ల బఫర్ జోన్‌లకు ఆలోచన చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'గతిశక్తి'తో అద్భుత ఫలితాలు

- జాతీయ మాస్టర్ ప్లాన్ ప్రాంతీయ సమావేశంలో అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ అమలుతో దేశాభివృద్ధిలో అద్భుత మార్పులు సంభవిస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. మౌలాలీలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్‌ఐఎఫ్‌ఎమ్)లో గతశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్‌పై 64వ నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ రెండు రోజుల ప్రాంతీయ సమావేశం మంగళవారం ప్రారంభమైంది. భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ, పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రమోషన్ విభాగం, రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖల ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. దీనిలో ఆయన కీలకోపన్యాసం చేశారు. గతిశక్తి జాతీయ మాస్టర్‌ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లడంలో భారతీయ రైల్వేల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే బోర్డులో బహుళ-క్రమశిక్షణా గతిశక్తి డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసిందనీ, అన్ని డివిజన్లలో ఈ యూనిట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. వేగంగా ప్రాజెక్టుల మంజూరు, పనుల అమలు పర్యవేక్షణ, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేయడంలో ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ బాగా ఉపయోగపడుతున్నదని వివరించారు. సామాజిక, ఆర్థిక పరివర్తన సాధనలో మౌలిక సదుపాయాలపై పెట్టుబడి కీలకాంశమని చెప్పారు. మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ ఏర్పాటు, లాజిస్టిక్స్ ధరలు తగ్గించడం వంటి చర్యలతో పరిశ్రమల్లో పోటీతత్వం మెరుగవుతుందని అభిప్రాయపడ్డారు. సమగ్రత, ప్రాధాన్యత, సర్వోత్తమ సమకాలీకణ, విశ్లేషణా సామర్థ్యం, క్రియాశీల చిత్రీకరణ అంశాలు గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌కు మూలస్తంభాలని విశ్లేషించారు.



గతిశక్తి పోర్టల్‌ను దక్షిణ మధ్య రైల్వే సమగ్రంగా వినియోగించుకుంటున్నదనీ, ప్రస్తుతం 600 కిలోమీటర్ల పొడవుతో విస్తరించి ఉన్న తొమ్మిది ప్రాజెక్టులు ఈ పోర్టల్ ద్వారానే కేటాయించబడినాయని వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి సుమిత దావ్రాతో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్లీ అవార్డులు ప్రదానం

దక్షిణ మధ్య రైల్వేలో ప్రతినెలా ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఇచ్చే 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రత అవార్డులను మంగళవారం ఆ సంస్థ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అందచేశారు. డివిజన్ పరిధిలో విధి నిర్వహణలో అప్రమత్తంగా వుంటూ, అంకితభావంతో విధులు నిర్వహించిన తొమ్మిది మందికి సికింద్రాబాద్ రైలు నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అదనపు జనరల్ మేనేజర్ ఆర్ ధనుంజయులుతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో చేపడుతున్న భద్రతా చర్యల్ని జీఎమ్ సమీక్షించారు.

పౌరసరఫరాల సంస్థ ఉద్యోగుల గ్రూప్

- మెడికల్ క్లెయిమ్ రూ.5 లక్షలకు పెంపు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాల సంస్థలో శాశ్వత ప్రతిపాదికలో పనిచేసే ఉద్యోగుల గ్రూప్ మెడికల్ క్లెయిమ్ రూ.3 లక్షల నుంచి 5 లక్షలకు పెంచినట్టు పౌరసరఫరాల శాఖకమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. మెడికల్ క్లెయిమ్ ధరలను నిర్ణయించడానికి జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్), జనరల్ మేనేజర్ (మార్కెటింగ్), జనరల్ మేనేజర్ (ఫైనాన్స్), డిప్యూటి జనరల్ మేనేజర్ (అడ్మిన్)తో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ ప్రభుత్వరంగ సంస్థల నుంచి సీల్డ్ కొటేషన్స్‌ను ఆహ్వానించింది. మంగళవారం హైదరాబాద్ పౌరసరఫరాల భవన్‌లో చౌహాన్ సమక్షంలో కమిటీ సభ్యులు, ప్రభుత్వరంగ సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో సీల్డ్ కొటేషన్స్‌ను తెరిచారు. న్యూ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీకి అందరికంటే తక్కువగా కోట్ చేసింది.

నేతాజీకి నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు, భారత ప్రజల స్ఫూర్తి కెరటం, మరణం లేని మహా చరిత్రను సొంతం చేసుకున్న భారత జాతి గర్వించ దగ్గ అమరవీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పలువురు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో రోడ్లు, రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితర నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు, నేతాజీ నిస్వార్థ దేశభక్తుడంటూ స్మరించుకున్నారు.

25న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే
- కార్యక్రమ ఏర్పాట్లపై రేవంత్ రెడ్డి సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 25న ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశానికి బూత్ లెవెల్ ఏజెంట్లు పెద్ద ఎత్తున తరలి రావాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లు, ఇతర వివరాలపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌తో సమీక్షించారు. కార్యక్రమానికి సంబంధించి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. 25న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొననున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ లెవెల్ ఏజెంట్లు క్రియాశీలకంగా పనిచేశారు. రాష్ట్రంలో పార్టీని గెలిపించడంలో కీలక భూమిక పోషించారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలకు అనుసరించాల్సిన విధానాలపై సమావేశంలో ఖర్గే దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సంబంధించి ఖర్గే శ్రేణులకు పలు సూచనలు చేయనున్నారు.

కవితా.. నీకు పూలే గురించి మాట్లాడే అర్హత లేదు

- పదేండ్ల నుంచి కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అడగలే! : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీ కవితా!..పూలే గురించి మాట్లాడే అర్హత మీకు లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా మీరే అధికారంలో ఉన్నారనీ, అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు గురించి అప్పుడు మీ నాన్న కేసీఆర్, అన్న కేటీఆర్‌ను ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

తమ సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రగతిభవన్‌ను మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌గా మార్చారని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలో పలుచోట్ల పూలే విగ్రహాలు పెట్టించారని గుర్తుచేశారు. పదేండ్లుగా అంబర్‌పేటలో పూలే పేరుతో ఆడిటోరియం కట్టించాలని వీహెచ్ డిమాండ్ చేస్తున్నా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు పూలే పట్ల ఉన్న చిత్తశుద్ధి ఇది అన్నారు. అలాంటి తమను పట్టుకుని కవిత విమర్శలకు దిగడం తగదని హితవు పలికారు. లిక్కర్ కుంభకోణంలో ఈడీ కేసు తెరపైకి వచ్చినప్పుడల్లా కవిత ఏదో ఒక పల్లవి ఎత్తుకుంటున్నదనీ, తొలిసారీ మహిళా బిల్లును, ఇప్పుడు పూలే విగ్రహం ఏర్పాటు అంశాన్ని వాడుకుంటున్నదని చెప్పారు. గొప్ప వ్యక్తుల పేరుతో రాజకీయాలు చేయడం సబబు కాదని సూచించారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చినాడే తెలంగాణతో ఉన్న పేగుబంధం ఆ పార్టీకి తెగిపోయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందనీ, కేవలం ఒక్క సీటులోనే గట్టి పోటీనిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ సీట్లను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా తామే అధికారంలో ఉన్నామనే భ్రమలో ఇష్టమున్నట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

సమ్మె విజయవంతం : అంగన్‌వాడీ సంఘాల ప్రకటన

అమరావతి : డిసెంబర్ 12వ తేదీ నుండి చేపట్టిన సమ్మె విజయవంతం అయిందని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ సంఘాలు ప్రకటించాయి. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర నాయకులు మంజుల, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడారు. సోమవారం రాత్రి రెండుగంటల పాటు మంత్రులతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయని ప్రకటించారు. యూనియన్లు అడిగిన వాటిలో ఎక్కువ డిమాండ్లు అంగీకరించ డంతో సమ్మెను విరమించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, మంత్రులు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐటియు అనుబంధ సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, చంద్రావతి, ఐఎఫ్‌టి యు నాయకులు భారతి, ఎఐటియుసి నాయకులు సరళ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల వివరాలను వారు వెల్లడించారు.

చర్చల్లో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లు

అంగన్‌వాడీల వేతనాలు జులైలో పెంచుతామని, యూనియన్లకు ప్రభుత్వానికి ఇద్దరికీ ఆమోదయోగ్యమైన వేతనాన్ని పెంచడానికి రాతపూర్వక హామీ. గ్రాట్యూటీకి సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఉద్యోగ విరమణ సమయంలో ఇచ్చే ప్రయోజనాన్ని వర్కర్లకు రూ.50 వేల నుండి రూ.1.20 లక్షలకు, హెల్పర్‌కు రూ.60 వేలు చెల్లించడానికి అంగీకారం. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జిఓ ఇస్తామని అంగీకరించారు. త్వరలో జిఓ ఇవ్వనున్నారు సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. సర్వీసులో ఉండి మరణించిన వారికి అంగన్‌వాడీ బీమా లేదా వైఎస్ఆర్ బీమా అమలు చేస్తామని తెలిపారు. మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇవ్వడానికి అంగీకారం. హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించారు. ప్రమోషన్లకు నిర్దిష్టమైన నిబంధనలు రూపొందిస్తామన్న తదితర డిమాండ్లను అంగీకరించారు.

కేటీఆర్.. కార్యకర్తలు ఇప్పుడు గుర్తుకొచ్చారా?: రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారం కోల్పోయాక కార్యకర్తలు గుర్తొచ్చారా కేటీఆర్? అని బీజేపీ నేత రఘునందన్‌రావు ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారులకు సీట్లు ఇస్తామంటోన్న కేటీఆర్.. మాటను నిలబెట్టుకోవాలన్నారు. శంకరమ్మ విషయంలో తమరు ఇచ్చిన మాట గుర్తుకుందా? అని ప్రశ్నించారు. త్యాగం చేసిన కుటుంబాలకు ఎంపీగా పోటీచేసేందుకు అవకాశమిస్తామని చెప్పే దమ్మూధైర్యం బీఆర్ఎస్‌కు ఉందా? అని నిలదీశారు. పొత్తు కుదరదని మోడీ చెప్పిన రోజే.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తెగదెంపులు అయ్యాయన్నారు. తెలంగాణా సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టారన్నారు. ఎంఐఎంతో నిన్నటి వరకు బీఆర్ఎస్ పొత్తు పెట్టుకున్నదనీ, అదే ఎంఐఎంతో ఇప్పుడు కాంగ్రెస్ దోస్తీ చేస్తోందని విమర్శించారు. కవితకు ఎంపీ సీటు ఇస్తారా? ఇవ్వరా? అసలు కవిత బీఆర్ఎస్‌లోనే ఉందా? అని ప్రశ్నించారు. మొదట శంకరమ్మ, ఎర్రోళ్ల శ్రీనివాస్ లాంటి వాళ్లకు సీట్లు ఇవ్వాలని సూచించారు. అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాసి అసలైన ఉద్యమకారులకు అవకాశం ఇస్తామని కేటీఆర్, హరీశ్‌రావు ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.

అడుగడుగునా అడ్డంకులే

అసోంలో రాహుల్ యాత్రకు బీజేపీ అవరోధాలు

- పోలీసులతో ఘర్షణకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు
- కాంగ్రెస్ నేతపై కేసు నమోదుకు హిమంత బిశ్వ శర్మ ఆదేశం



గౌహతి : అసోంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. యాత్రను అడ్డుకునేందుకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. అసోంలో గురువారం యాత్ర ప్రవేశించినప్పటి నుంచి బీజేపీ కుటిల యత్నాలు చేస్తూనే ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది. తాజాగా రాహుల్ ఐదు వేల మంది కార్యకర్తలతో కలిసి మంగళవారం గౌహతిలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించి కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు కదిలారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. అంతకు ముందు గౌహతి సరిహద్దు వద్ద కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తూ తాము నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించ లేదని చెప్పారు. అంటే దీనర్థం తాము బలహీనులమని కాదని అన్నారు. 'అసోం ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి, ప్రధాని నిబంధనలను ఉల్లంఘించ వచ్చు. కానీ మేం అలాంటి పని ఎన్నడూ చేయం' అని వ్యంగ్యంగా అన్నారు. విద్యార్థులను కలవకుండా తనను అడ్డుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోం ముఖ్యమంత్రి ని ఆదేశించారని ఆరోపించారు. రాహుల్ ఇక్కడికి వస్తాడా లేదా అన్నది ముఖ్యం కాదనీ, తాము ఎవరి మాటలైతే వినాలని విద్యార్థులు కోరుకుంటున్నారో అందుకు అనుమతించడమే ముఖ్యమని అన్నారు. అయితే అసోం పాఠశాలలు, కళాశాలల్లో ఇది జరగడం లేదని చెప్పారు. అంతకుముందు గౌహతి రహదారుల మీదుగా యాత్రను కొనసా గించేందుకు హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. పనిదినాన యాత్రను అనుమతిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపింది. దీనిపై రాహుల్ మండిపడుతూ 'ఇదే రోడ్డుపై భజరంగ్‌దళ్ నడిచింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ర్యాలీ నిర్వహించారు. కానీ నా యాత్రను మాత్రం బారికేడ్లతో అడ్డుకుంటున్నారు' అని అన్నారు.

ప్రజలను రెచ్చగొట్టారని..

మరోవైపు ప్రజలను రెచ్చగొట్టినందుకు రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర పోలీసులను ఆదేశించారు. రెచ్చగొట్టే చర్యలు అస్సామీ సంస్కృతిలో భాగం కాదన్నారు. తమది శాంతియుత రాష్ట్రమని, ఇలాంటి 'నక్సలైట్ ఎత్తుగడలు' అసోం సంస్కృతికి పూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు.

సీఎం సారూ.. బిల్లులివ్వండి

- కొత్త సర్కారు ఆదుకుంటుందనే ఆశతో సర్పంచుల ఎదురుచూపు
- పదవీ కాలం దగ్గర పడ్డా ఇంకా పెండింగ్‌లోనే బిల్లులు
- 14 నెలలుగా అందని ఎస్ఎఫ్‌సీ నిధులు
- 20 మంది దాకా ఆత్మహత్య చేసుకున్న వైనం
- ఫిబ్రవరి రెండో తేదీతో గడువు ముగింపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"ఊరికే(పైకే) పెద్దరికం...అప్పుల గురించి ఎవరికి చెప్పుకోలేని దౌర్భాగ్యం' అన్నట్టు తయారైంది సర్పంచుల పరిస్థితి. పెండింగ్ బిల్లులన్నింటినీ విడుదల చేసేదాకనైనా తమను పదవుల్లో ఉంచాలనే సర్పంచుల వేడుకోలును కొత్త ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందా? ఫిబ్రవరి రెండో తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలనకు ఆదేశిస్తుందా? పదవీ కాలాన్ని పెంచుతుందా? వారిపై దయతలచి రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందా? ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సహకాలు ఈ ప్రభుత్వ హయాంలోనైనా అందుతాయా? ఈ పశ్నలకు సమాధానం కోసం కొంత కాలం వేచిచూడాల్సిందే.

గ్రామ పంచాయతీ కార్యాలయాలు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు, ఇలా అనేక అభివృద్ధి పనులను సర్పంచులు చేశారు. ప్రభుత్వం నిధులిస్తుందనే దీమాతో అప్పులు చేసి మరీ చేపట్టిన పనులకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ నుంచి 14 నెలలుగా నిధులు రావడం లేదు. ఇవే రూ.4,480 కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీలకు అందాల్సిన పెండింగ్ బిల్లులన్నీ కలిపితే రూ.10 వేల కోట్ల దాకా ఉంటాయని సర్పంచులు చెబుతున్నారు. శ్మశాన వాటికలకు సంబంధించిన బిల్లుల్లో 10 శాతాన్ని చెల్లించాల్సి ఉంది. క్రీడా ప్రాంగణాలకు కూడా బిల్లులు అందలేదు. కొత్త పంచాయతీల్లో , కార్యాలయాలు లేని గ్రామాల్లో కొత్త గ్రామ పంచాయతీ కార్యాల యాలు కట్టేందుకు రాష్ట్ర సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోయినా చేతుల నుంచి పెట్టు కుని కొందరు, అప్పులు చేసి మరికొందరు సర్పంచు లు తమ హయాంలో ఊర్లో పంచాయతీ కార్యాలయం కట్టామనే పేరు వస్తుందనే ఉత్సుకతతో ముందడుగు వేసి పనులు పూర్తిచేయించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన జీపీల నిర్మాణాలకు ఇప్పుడు బిల్లులు రాక తలలు పట్టుకుంటున్నారు.'మాది చిన్న గ్రామపంచాయతీ. 1400 జనాభా ఉంటుంది. మా ఊర్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద గ్రామ పంచాయతీ కార్యాలయం కట్టిస్తున్నా. స్లాబు పడింది, గోడలు అయిపోయాయి. పనులు చివరి దశలో ఉన్నాయి. రూ.20 లక్షల దాకా ఖర్చుపెట్టిన. ఇప్పటిదాకా పైసా నిధులు రాలేదు. క్రీడా ప్రాంగణం నిర్మిస్తే రూ.90 వేలు అయ్యాయి. ఆ బిల్లూ రాలేదు. వార్డుమెంబర్లు, కాంట్రాక్టర్లు తమ పైసలు పెట్టి సీసీ రోడ్లు వేయించారు. డ్రెయినేజీ పనులు చేయించారు. వారికీ రూ.10 లక్షలకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మా ఒక్క ఊరికే రూ.30 లక్షల దాకా బకాయిలు ఉన్నాయి' అని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అల్లందేవి చెరువు సర్పంచి, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ తన ఆవేదనను వెళ్లగక్కాడు. ప్రజల ఒత్తిడితో గ్రామాల్లోని వార్డుల్లో వివిధ పథకాల కింద సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు కూడా చేపట్టారు. వాటికీ బిల్లులు ఇవ్వని దుస్థితి. 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు వస్తున్నా గ్రామపంచాయతీ మెయింటనెన్స్, సిబ్బంది జీతాలు, కరెంటు బిల్లుల చెల్లింపు, ఇతరత్రా ఖర్చులు, ఈఎమ్ఐల చెల్లింపులకు కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కూడా అందట్లేదు. రూ. 20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు జీపీలకు ఇస్తామని ప్రకటించిన నిధులనూ గత ప్రభుత్వం ఇవ్వలేదు. ఆ ఫండ్ వస్తుందనే ఆశతో పనులు చేయించిన సర్పంచులు ఇప్పుడు బిల్లులు రాక తిప్పలు పడుతున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సహకాలివ్వలేదు

సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాల అభివృద్ధికి రూ.10 లక్షలు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు ముందడుగు వేసి తమ నిధుల నుంచి అదనంగా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఇస్తామని గొప్పలకు పోయారు. తమ ఊర్లు మరింత అభివృద్ధి చెందుతాయనే ఆశతో చాలా ఊర్లలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అలాంటి గ్రామ పంచాయతీలు రెండు వేలకుపైనే ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి రెండో తేదీతో ముగియనున్నప్పటికీ రూ.10 లక్షల ప్రోత్సహకం ఇప్పటిదాకా ఆ గ్రామాలకు అందలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ నీటిమీది రాతలాగే మిగిలిపోయింది.

కొత్త ప్రభుత్వమైనా పెండింగ్ బిల్లులివ్వాలి...



గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేసిన మాకు కాంగ్రెస్ ప్రభుత్వమైనా పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలి. లేకుంటే వడ్డీల భారంతో సర్పంచుల అప్పులు మరింత పెరిగిపోతాయి. ఏడాది పాటు సర్పంచుల పదవి కాలం పొడిగించాలి. అలాకాని పక్షంలో స్థానిక సంస్థల కు ఎన్నికలు నిర్వహించే దాకా మమ్ముల్నే సర్పంచులుగా కొనసాగించాలి.

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్

రెండు, మూడేండ్లుగా బిల్లులివ్వకపోవడం దారుణం

తమ పాలనలో గ్రామాలను బాగా అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేసిన సర్పంచుల పట్ల గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరిగాలేదు. అధికారులు ఉరుకులుపరుగులు పెట్టించి మరీ పనులు చేయించారు. సొంతంగా, అప్పులు చేసి పనులు చేయించారు. రెండు, మూడేండ్ల గడుస్తున్నా బిల్లులు ఇవ్వకపోవడం దారుణం. సర్పంచులు అప్పులోళ్ల బాధలు ఏగలేక చస్తూ బతుకుతున్నారు. దయచేసి కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా పెండింగ్ బిల్లులను ఇప్పించాలి.



సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

పార్టీ మారుతున్నారంటూ వదంతులు • అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించేందుకే: ఎమ్మెల్యేలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసారు. ఈ భేటీపై సోషల్ మీడియాలో పలు కథనాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కేవలం మర్యాద పూర్వకంగానే కలిసామని వారు వివరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి నిధుల విడుదల, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, గన్‌మెన్ల సంఖ్య కుదింపు తదితర అంశాలపై చర్చించేందుకే రేవంత్‌ను కలిసినట్టు ప్రకటించారు. పార్టీ మారేందుకే సీఎంను కలిశారని వస్తున్న వదంతులను సదరు శాసన సభ్యులు కొట్టి పారేశారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలపైనే సీఎంను కలిసామనీ, అనవసరంగా ఊహగానాలు సృష్టించవద్దని మహిపాల్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఇంతకు మించి ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదనీ, వదంతులను నమ్మొద్దని వారు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీని సీఎం ఎలా కలిశారో తాము అలానే కలిశామని తెలిపారు.

కేసీఆర్ నాయకత్వంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ లోకసభ నియోజక వర్గంలో గులాబీ జెండా ఎగరేస్తామని తెలిపారు.

వికలాంగురాలు నర్మద ప్రమోషన్‌పై

అసత్య ప్రచారం :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాకతీయ యూనివర్సిటీలో సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొందిన వికలాంగురాలైన నర్మదపై కొందరు యూనియన్ లీడర్లు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగులకు వచ్చిన ప్రమోషన్‌ను అడ్డుకోవాలని చూస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీలో యూనియన్ లీడర్లు కొందరు..వాళ్లనుకున్న వ్యక్తులకు ప్రమోషన్ రాలేదనే అక్కసుతో వ్యవహరిస్తున్నరని విమర్శించారు. యూనివర్సిటీ అధికారులపై తప్పుడు ప్రచారం చేయటాన్ని మానుకోవాలని హితవు పలికారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎన్జీవోస్‌కు సూపరిటెండెంట్ ప్రమోషన్ల కోసం విశ్వవిద్యాలయం రిటన్ టెస్ట్ పరీక్ష నిర్వహించిందనీ,వికలాంగురాలైన నర్మద రాత పరీక్షల్లో ఉత్తీర్ణురాలైనప్పటికీ కొందరి కుట్ర ఫలితంగా ఒక సబ్జెక్ట్‌లో తక్కువ మార్కులు చూపించారని తెలిపారు. దీంతో ఎన్‌పీఆర్‌డీ చొరవతో నర్మదకు న్యాయం చేయాల అధికారులను పలు సార్లు కోరినట్టు పేర్కొన్నారు.

వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ వినతి పత్రం ఇవ్వటంతో కమిషన్ యూనివర్సిటీని వివరణ కోరినట్టు తెలిపారు. దీంతో వైస్ ఛాన్సలర్ పరీక్ష పేపర్‌ను రీవాల్యుయేషన్‌కు ఆదేశించినట్టు పేర్కొన్నారు. దీనిలో 59 మార్కులు వచ్చాయనీ, 166 మార్కులతో అందరికంటే మెరిట్‌తో మొదటి స్థానాన్ని సాధించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, వైస్ ఛాన్సలర్ చొరవతో ఆమెకు ప్రమోషన్ వచ్చిందని పేర్కొన్నారు. వాస్తవ విషయాన్ని గమనించకుండా, కొన్ని సంఘాలు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారనీ, దీన్ని మానుకోవాలని సూచించారు.

ప్రజారవాణా అస్తవ్యస్తం

ఎంఎంటీఎస్ రైళ్ల వ్యవస్థను సమీక్షించాలి

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ముఖ్యమంత్రికి లేఖ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో అస్తవ్యస్తంగా మారిన ప్రజారవాణా, ఎంఎంటీఎస్ రైళ్ల వ్యవస్థపై సమీక్ష జరపాలని సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రికి ఈమెయిల్ ద్వారా లేఖ పంపించారు. అత్యంత తక్కువ ఖర్చుతో ప్రయాణించే ఎంఎంటీఎస్ రైళ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, మరమ్మతుల పేరుతో నిరంతరం రైలు సర్వీసులు రద్దవుతుండటంతో ఎంఎంటీఎస్‌పై ప్రయాణికుల విశ్వాసం సడలిపోయిందని తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలు దెబ్బతినడంతో సామాన్య ప్రయాణికులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అత్యంత చౌక ప్రజారవాణా అయిన ఎంఎంటీఎస్‌ను కాపాడాలన్నారు. ఎంఎంటీఎస్ ఫేస్-1లో భాగంగా హైదరాబాద్ లింగంపల్లి, ఫలక్‌నామా లింగంపల్లి వరకు రైళ్లలో నిత్యం లక్షలాదిమంది ప్రయాణించే వారని, అయితే ఇప్పుడు బాగా తగ్గిపోయిందన్నారు. ఎంఎంటీఎస్ ఫేస్-2లో భాగంగా నాలుగు రూట్లలో ఇప్పటికే పనులు పూర్తయ్యాయని, గత ఏడాది ప్రధానమంత్రి ఈ రూట్లలో రైళ్లను ప్రారంభించినప్పటికీ నామమాత్రంగానే నడుపుతున్నారని తెలిపారు. ఫేస్-2లో భాగంగా మేడ్చల్-లింగంపల్లి, మేడ్చల్-హైదరాబాద్ మధ్య ఒకటి రెండు రైళ్లను నడుపుతున్నప్పటికీ వాటిని సరైన సమయంలో నడపకపోవడంతో ప్రయాణికులెవరూ ఈ రైళ్లను ఎక్కడం లేదన్నారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఎంఎంటీఎస్ ఫేజ్ -2 ప్రాజెక్టు పూర్తి చేయడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర వాటా నిధులు కేటాయించకుండా గత రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ.900 కోట్లకు పైగా ఖర్చు చేసి నాలుగు రూట్లు సంపూర్ణంగా పూర్తి చేసినప్పటికీ రైళ్ల సర్వీసులు నడపడంతో రైల్వే శాఖ, కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం వహించాయన్నారు. రైల్వేల ప్రయివేటీకరణలో భాగంగా ఎంఎంటీఎస్‌ను సైతం కేంద్ర ప్రభుత్వం వదిలించుకునే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది మంది పేద, సామాన్య ప్రయాణికులు అత్యంత చౌకగా ప్రయాణించే ఎంఎంటీఎస్ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి మెట్రో రైల్ ప్రాజెక్టుతో పాటు ఎంఎంటీఎస్ వ్యవస్థను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఎంఎంటీఎస్ పనితీరుపై తక్షణమే సమీక్ష జరపాలని, ఫేస్ -2 ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా సీఎంకు విజ్ఞప్తి చేశారు.



తమ్మినేనికి ఎంపీ వద్దిరాజు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఐజీ అస్పత్రి వైద్యులను అడిగి మరింత సమాచారాన్ని తెలుసుకున్నారు.

తమ్మినేని త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని వద్దిరాజు ఆకాంక్షించారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని ఈనెల 16న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది. ఆస్పత్రిని సందర్శించిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి ఉన్నారు. తమ్మినేనికి వైద్యులు మైనర్ ఆపరేషన్ చేశారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ తెలిపారు.

మేడారం జాతర

ఏర్పాట్లు పూర్తి చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డాక్టర్ ఎ శరత్
- మేడారంలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన



నవతెలంగాణ -తాడ్వాయి

మేడారం మహా జాతరలో సందర్శకుల సౌకర్యార్థం చేపట్టిన పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ. శరత్ అధికారులకు సూచించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో చేపడుతున్న పనులను మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ. వెంకట్ నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క భవనం (ఆదివాసీ భవనం)లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. జాతరకు ఇప్పటినుంచే సందర్శకులు వస్తున్నందున పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పూర్తయిన పనులు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, తాగునీరు, టాయిలెట్స్ తదితర అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. స్నానాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సివిల్ పనులు మరో ఏడు రోజుల్లో పూర్తవుతాయని, రద్దీ నిర్వహణపై దృష్టి పెట్టాలని చెప్పారు. జంపన్నవాగులో లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక లెవలింగ్ సక్రమంగా చేయాలని, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర వైద్యం కోసం వీలైనంత ఎక్కువ సంఖ్యలో మినీ అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాలు, దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులకు జాతర మధుర జ్ఞాపకంగా ఉండేలా సౌకర్యాలు ఉండాలని సూచించారు. డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ఎవరికి కేటాయించిన విధులు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు పి శ్రీజ, సి. వేణుగోపాల్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్‌డీ అశోక్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మార్పు పుకార్లు మాత్రమే

- ఎంపీగా అవకాశమిస్తే నా కుమారుడు పోటీ చేస్తాడు
- బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం
- రాజకీయాల నుంచి రిటైర్డ్ అవ్వాలనుకుంటున్నా
- మీడియా చిట్ చాట్‌లో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొద్ది రోజులుగా వస్తున్న పుకార్లకు శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టారు. తాను బీఆర్ఎస్ పార్టీ మారుతున్నాననేది అసత్య ప్రచారమని స్పష్టం చేశారు. మంగళవారం శాసన మండలిలోని తన ఛాంబర్‌లో మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ పార్టీ మారే ప్రసక్తి లేదనీ, ఇదంతా సోషల్ మీడియా దుష్ప్రచారమని చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారంలో లేదనీ, కష్టకాలంలో పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను చూసే ప్రజలు ఓట్లేస్తారనీ, అధిష్టానం ఆదేశిస్తే తన కుమారుడు అమిత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి, నల్లగొండల్లో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీ చేస్తారని తెలిపారు. మూడు నాలుగు రోజుల్లో క్లారిటీ వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి చేసినా మంత్రులు కూడా భారీ తేడాతో ఓడిపోయారనీ, ఓటమికి వ్యక్తులు కారణం కాదని చెప్పారు. కేసీఆర్‌పై ప్రజల్లో వ్యతిరేకత లేదనీ, ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలించాయని తెలిపారు. టికెట్ల కేటాయింపుల్లో అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమనీ, ఎవరికి ఇచ్చినా వారి గెలుపు కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిలో తాను ముందున్నాననీ, రెండు జాతీయ రహదారులు, నల్లగొండ, మిర్యాలగూడలో రెండు కేంద్రీయ విద్యాలయాలతో పాటు పలు ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టానని తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తేవడమంటే రాష్ట్ర హక్కులు కాలరాయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందనీ, సమస్య తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులను పర్యవేక్షణ చేసి, నీటి సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. 43 కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ ఎత్తిపోతల పథకంలో 20 కిలోమీటర్ల ఇన్‌లెట్, 13.5 కిలోమీరట్ల ఔట్‌లెట్ పూర్తి కాగా ఇంకా 9.5 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉందని అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తే నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నందున జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో అధికార పక్షం, ప్రతి పక్షం అనే తేడా లేకుండా అందరిని కలుపుకుని సభ సజావుగా సాగేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. జీరో అవర్, క్వచ్చన్ అవర్ మొదలగు పెండింగ్ ప్రశ్నలకు సమాధానాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానన్నారు . మండలిలో లీడర్ ఆఫ్ హౌస్‌పై వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. 2027 నవంబర్‌లో ఎమ్మెల్సీ పదవి ముగుస్తుందనీ, ఆ తర్వాత రాజకియాల నుంచి తప్పుకోవాలనుకుంటున్నానని తెలిపారు.

సీఎంను కలిసిన కొత్త ఎమ్మెల్సీలు, సలహాదారులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొత్తగా నియామకమైన ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలు జూబ్లీహిల్స్ నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులుగా నియామకమైన షబ్బీర్ అలీ, వేణుగోపాల్ రావు, వేం నరేందర్ రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకమైన మల్లు రవి, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40వేల కోట్లకు పైగా పెట్టుబడుల కోసం ఒప్పందాలు చేసుకోడంపై సీఎంకు వారంతా అభినందనలు తెలిపారు.

బాలిక - భవిత?

నేడు జాతీయ బాలికా దినోత్సవం. 'బేటీ బచావో.. బేటీ పఢావో' మన ప్రధాని నినాదం. పేరు గొప్ప, ఊరు దిబ్బకు ఇంతకుమించిన ఉదాహరణ మరేదీ ఉండదు. ప్రభుత్వ లెక్కలే దీనికి రుజువు. అభివృద్ధిలో ఎంతో ముందంజలో ఉన్నామని ఢంకా బజాయించి చెప్పుకుంటున్నా అమ్మాయిల పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. అమ్మాయంటే అమ్మకు ప్రతి రూపం, సమాజంలో సగం అంటూ గొప్పలు చెప్పుకునే మన దేశంలో ఇప్పటికీ ఆచారాలు, సంప్రదాయాలు వారి తలరాతను నిర్దేశిస్తూనే ఉన్నాయి. నేడు దేశంలో అమ్మాయిల బతుకే ప్రశ్నార్థకమయింది.

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రకారం దాదాపు 2.5 కోట్ల మంది చిన్నారులు ముఖ్యంగా యుక్తవయసులో ఉన్న బాలికలు ఏ ప్రభుత్వ పథకంలోనూ పాలుపంచుకోవడం లేదని తేలింది. అలాగే దేశంలో 15-18 ఏండ్ల వయసు గల కౌమార దశలో ఉన్న బాలికలలో 39.4 శాతం మంది ఏ విద్యా సంస్థకు హాజరు కావడం లేదు. వీరిలో 65 శాతం మంది బాలికలు ఇంటి కార్యకలాపాలు లేదా భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నారు. ఇది నేడు మన దేశంలో బాలికల దుస్థితి.

భారతదేశంలో ఏటా సుమారు కోటి ఇరవై లక్షల మంది బాలికలు జన్మిస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి. కానీ వారిలో పదిహేనేండ్లు వచ్చేసరికి సుమారు ముప్ఫై లక్షల మంది చనిపోతున్నారు. దీనికి బాలికల మీద ఉన్న చిన్న చూపే ప్రధాన కారణం. లింగ సమానత్వం లేనిదే దేశంలో అభివృద్ధి, సామాజిక మార్పు సాధ్యంకాదంటూ ఓ వైపు ప్రచారం చేస్తూనే అమ్మాయిలపై వివక్ష చూపిస్తున్నారు. ఫలితంగా లింగ సంబంధ సూచీలో 2019లో మొత్తం 129 దేశాలకుగాను భారత్‌కు 95 వ స్థానం దక్కింది. లింగ వివక్ష కారణంగా యాభై వేల మంది బాలికలు పుట్టక ముందే మరణిస్తున్నారు.

దేశంలో ప్రతి 1000 మంది మగవారికి సుమారు 940 మందే స్త్రీలు ఉన్నారు. గత జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో ముప్ఫై లక్షల మంది బాలికలకు పదమూడేండ్లలోపే వివాహాలు చేస్తున్నారు. వీరిలో 26.8 శాతం మంది బాలికలకు బలవంతంగా వివాహాలు జరుగుతున్నాయి. చిన్న వయసులో పెండ్లి చేసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. అలాగే వారిపై శారీరక, మానసిక, లైంగిక వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, ఢిల్లీలో బాలికలు ఎక్కువగా లైంగిక దోపిడీకి గురవుతున్నారు. 2022 లో తెలంగాణలో ప్రతిరోజూ ఐదుగురు మైనర్ బాలికలపై లైంగిక దాడులు, ముగ్గురు లైంగిక వేధింపులకు గురవుతున్నారని చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) విడుదల చేసిన 'ఆడపిల్లల కీలక ఆందోళనలపై స్థితి నివేదిక - తెలంగాణ, ఆంధ్రప్రదేశ్' పేర్కొంది. బాగా తెలిసినవారు, నమ్మకమున్న వారే ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.



మరో అతిపెద్ద సమస్య బాలికల అక్రమ రవాణా. పౌరులుగా ఎదగాల్సిన వారు కొన్ని ముఠాల చేతుల్లో బానిసలుగా మారిపోతున్నారు. సమాజాన్ని అర్థం చేసుకునే లోపే వారి జీవితాలు నలిగిపోతున్నాయి. వారి ఆనందాన్ని, ఆశలను కొన్ని శక్తులు చిధిమేస్తున్నాయి. బాలికలను అమ్మడం, విదేశాలకు తరలించడం, మాదకద్రవ్యాల రవాణాలో వాడుకోవడం వంటివి చేస్తున్నారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో ప్రకారం అపహరణకు గురైన బాలికల్లో 28శాతం మంది పద్దెనిమిదేండ్ల లోపు వారే. ఈ అక్రమ రవాణా బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలతో పాటు ఢిల్లీ నుంచి ఎక్కువగా సాగుతోంది. బాలల అక్రమ రవాణాకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రధాన కారణం. పిల్లల భద్రతపైగానీ, వారికి కల్పించాల్సిన సదుపాయాలపైన గానీ దృష్టి పెట్టడంలేదు.

అలాగే అమ్మాయిలు ఎక్కువ శాతం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. రక్తహీనతతో అల్లాడుతున్నారు. 6-13 ఏండ్ల వయసున్న బాలికలు ఆర్థిక సమస్యలతో చదువు మానేస్తున్నారు. ఐదేండ్ల లోపు బాలికలు 38శాతం వివిధ కారణాల వల్ల మనో వైకల్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఇక అక్షరాస్యత శాతం చూస్తే మహిళల అక్షరాస్యత శాతం 68.4 శాతంగా ఉంది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రకారం దాదాపు 2.5 కోట్ల మంది చిన్నారులు ముఖ్యంగా యుక్తవయసులో ఉన్న బాలికలు ఏ ప్రభుత్వ పథకంలోనూ పాలుపంచుకోవడం లేదని తేలింది. అలాగే దేశంలో 15-18 ఏండ్ల వయసు గల కౌమారదశలో ఉన్న బాలికలలో 39.4 శాతం మంది ఏ విద్యా సంస్థకు హాజరు కావడం లేదు. వీరిలో 65 శాతం మంది బాలికలు ఇంటి కార్యకలాపాలు లేదా భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నారు. ఇది నేడు మన దేశంలో బాలికల దుస్థితి.

బాలికల పట్ల పాలకులు ఇంత వివక్ష చూపుతున్నా దేశం పరువును అన్ని రంగాల్లో నిలబెడుతుంది మాత్రం ఆడపిల్లలే. తినడానికి సరైన తిండి లేకపోయినా దేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మేరికోమ్‌లు మన దగ్గర ఎందరో ఉన్నారు. అలాంటి అమ్మాయిలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తే తమ సత్తా చాటుకుంటారు. ఇప్పటికైనా పాలకుల ఆలోచనా విధానం మారాలి. అధికారం కోసం కాకుండా సమాజంలో మార్పు కోసం కృషిచేయాలి. లింగ సమానత్వం కోసం భ్రూణహత్యలు, పౌష్టికాహర లోపాలు, అనారోగ్యం, అవిద్య, బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా వంటి సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో పనిచేయాలి. జాతీయ బాలికా దినోత్సవం అంటే కేవలం ఓ పండుగగా కాకుండా పాలకులు దీన్ని బాధ్యతగా భావించాలి. నినాదాలను కేవలం ఉపన్యాసాలకే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాలి. అప్పుడే బాలికల భవిత బాగుపడుతుంది.

సంపాదకీయం

'అమృతకాలం'లో ఏం జరుగుతుంది?



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545



అమృతం వైదికులకే. ఆధిపత్య అధికార వర్గాలకే. శ్రామికులకు, బలహీనులకు విషామృతమే గతి. భారత స్వాతంత్ర్యం 75వ ఏట ప్రవేశించిన 2021 స్వాతంత్ర్య ఉత్సవాన ప్రధాని అమృతకాల పదం వాడారు. విజయ సాధనకు కొత్త పనుల ప్రారంభానికి నిర్దోష వేళను సూచించే వైదిక జ్యోతిష్య పదమిది. 2022 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి, 2022 స్వాతంత్ర్య దినోత్సవాన ప్రధాని ఈ పదాన్ని పలుమార్లు పలికారు. శ్రేష్ఠ భారత విజయానికి పౌరులు బాధ్యతలు తెలుసుకోవాలని మోడీ నొక్కిచెప్పారు. ముస్లింలు హక్కులు అడగరాదన్నది సంఘ్ తాత్వికత. పౌరులే హక్కులు అడగరాదన్నది మోడీయం. 2022 ఆగస్టు 2047 ఆగస్టు మధ్యకాలం అమృతకాలమని మోడీ వాదన. స్వాతంత్ర్య అమృత మహోత్సవమనీ అన్నారు. సమాజ లక్ష్యాల పూర్తికి అమృతకాలం సువర్ణావకాశమని, అభివృద్ధి దేశం, వలసవాద విముక్తి, వారసత్వ గర్వం, సమైక్యత సమగ్రతలు, బాధ్యతా ప్రాధాన్యత అన్న పంచ పౌరసంకల్పాలను బోధించారు. ఆదినాగు తాడుగా దేవదానవులు పాలసముద్రాన్ని చిలికారు. అసురులు (సారా తాగనివారు) నాగు తల వైపు విషాన్ని భరించారు. సురులు (సారా తాగేవారు) తోక పట్టుకు ఊగారు.

గతపాలనలో ప్రభుత్వ పనే దైవకార్యం అనేవారు. బీజేపీ సుపరిపాలనలో దైవకార్యమే, ఆధిపత్య మత కార్యాలే రాజధర్మాలు, ప్రగతి కార్యాలు. కుంభమేళాలు, నదీ హారతులే ప్రజాసేవలు. ఇతర మతాచారాలు దేశద్రోహాలు. హిందు ఆలయాల నిర్మాణ, ప్రారంభ కార్యక్రమాలల్లోనే ప్రధాని ప్రధాన పూజారిగా పాల్గొంటారు. చర్చీలు, మసీదులు పట్టవు. వైదికాన్ని పెంపొందించే బీజేపీ మాత్రమే 'ఒక దేశం ఒక పార్టీ' సూత్రం కింద ఉంటుంది. ఇతర పార్టీల ఉనికి ఉండదు. సంఘీయులు, మోదీయులు మాత్రమే నీతిపర రాజకీయ కిరీటాలు ధరిస్తారు. భాజపేయ జంధ్యం ధరించినవారు పునీతులవుతారు. ఇతరులను అవినీతిపరులుగా, అక్రమ సంపాదనాపరులుగా సిబిఐ, ఇడి, ఎన్.ఐ.ఎ. నిరూపిస్తాయి.

చంద్రుడు, పారిజాతం, కల్పవృక్షం, కామధేనువు, దేవసారా దేవత, అప్సరసలు, ఐరావతం, లక్ష్మీ, ఉచ్చైశ్వం, పాంచజన్యం, గద, ధనుష, రత్నాలు, ధన్వంతరి, అమృతం సముద్రం నుండి వెలువడ్డాయి. అన్నిటినీ దేవతలు మోసంతో కొట్టేశారు. అమృతం తాగి అమరులయ్యారు. శ్రమదోపిడీ, నిరసన, అణచివేతే రాహుకేతువుల హత్యలు.

మోడీ ప్రభుత్వనూతన విద్యావిధానంలో పలు ప్రజావ్యతిరేకతలతో పాటు విద్యావ్యవస్థను ధార్మిక సంస్థలకు అప్పగించడం ప్రధాన అంశం. సరస్వతీ మందిర్లు, దీనానాథ్ బాత్రా అధీనంలోని సంఘ్ విద్యాభారతి, ప్రజ్ఞాభారతి, 'మోడీ భారతి' బీజేపీ ధార్మిక సంస్థలు. హిందీ రాజ భాష అవుతుంది. వినోదం పేరుతో వైదికమత ప్రచారం పెరుగుతుంది. హిందూయేతరులపై ద్వేషం పెంచే సినిమాలను నిర్మిస్తారు. హిందూయేతరులపై దాడులు, హింస, హత్యలు పెరుగుతాయి. అదాని, అంబానీలే వివిధ రంగాల వాణిజ్యంలో ఉంటారు. జలశక్తి మంత్రిత్వ శాఖ గంగోత్సవం జరిపింది. నదీహారతి, బట్టలు, వస్తువులు నదిలో పారేయడం ఇందులో భాగాలు. కర్నాటక బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో రోజూ పది నిమిషాల ధ్యానం తప్పనిసరి చేసింది. గుజరాత్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి అమలు ప్రక్రియ మొదలుపెట్టింది. ఇది దేశమంతా వ్యాపిస్తుంది. అందులో ఆధిక్య మత భావాలను, సాంప్రదాయాలను మాత్రమే పొందుపరుస్తారు. శాకాహారమే తినాలి. శాఖ, కులమతాంతర వివాహాలు నిషేధించబడతాయి. మనుస్మృతి రాజ్యాంగం, కాషాయజెండా జాతీయ పతాకం, గోవు జాతీయ జంతువు, కమలం జాతీయ పుష్పమవుతాయి. మోడీ జాతిపిత అవుతారు.

75 శాతం పోలీసులు, న్యాయవాదులు కొందరు న్యాయమూర్తులు సంఘ్ భావజాల బానిసలు. సంఘ్ భావజాల సైన్యాధికారులు అందలాలెక్కారు. అలా ఎక్కించడానికి నియమాలను ధిక్కరించారు. మార్చారు. అగ్నిపథ్ ఈ పరిస్థితిని తారుమారు చేస్తుంది. సైన్యంలోకి సంఘ్ భావజాల వ్యక్తులు ఎన్నికవుతారు. వారిలో దిగ్గజాలను కొనసాగిస్తారు. ఇతరులను బజారున పడేస్తారు. వివశులను చేసి ధర్మ, రామ, హనుమాన్ వంటి హిందు సేనలలో, భజరంగదళ్ వంటి సమాంతర సంఘ్ సైనిక సంస్థలలో సభ్యులుగా, శిక్షకులుగా చేర్చుతారు. సమాజ కాషాయీకరణ జరుగుతుంది. మిగిలిన వారు సామాజిక వృద్ధులుగా రిజర్వ్ వైదిక సైన్యంగా మారతారు. హిందువులకు మాత్రమే పౌరసత్వం ఉంటుంది. వలసవచ్చిన హిందువులకూ పౌరసత్వమిస్తారు. వీరికే ఓటు హక్కు, జీవించే హక్కు ఉంటాయి. పుట్టుకతో భారతీయులయినా ఇతర మతస్తులు, ప్రత్యేకించి ముస్లింలు పౌరసత్వం కోల్పోతారు. వారికి ఓటు, జీవించే హక్కులు ఉండవు. వారు శరణార్థి శిబిరాలలో, జైళ్ళలో కుక్కబడతారు. వైదికమతమే ఉంటుంది. ఇతర మతాలన్నీ మాయమౌతాయి. హిందు గుళ్ళను మాత్రమే పునర్నిర్మిస్తారు. కడతారు. ఇదే ప్రగతి సూచీగా ప్రచారం చేస్తారు. హిందుత్వ పూజా సామగ్రి, వస్తుసేవలను వైదికులే అమ్మాలి. ఇతర మతస్తులు అమ్మరాదు. ఇతర మత వస్తుసేవలను వైదికులు అమ్మవచ్చు. హిందు ఆలయాల వద్ద ఇతర మతస్తులు భిక్షమెత్త రాదు. గోమాతలను వైదిక మతవాదులు రోడ్లపై వదిలేయవచ్చు. గోరక్షణాలయాల్లో గడ్డిపెట్టకుండా చంపవచ్చు. ముస్లింలు గోవులను రక్షించినా వారిని చంపుతారు. ముస్లింల ఫ్రిజ్‌లో గోంగూర పచ్చడి కూడా గోమాంసమే. గేటెడ్ కమ్యూనిటీలలో, అపార్టుమెంట్లలో, ఆస్పత్రుల్లో హిందు ఆలయాలనే కడతారు.

గతపాలనలో ప్రభుత్వ పనే దైవకార్యం అనేవారు. బీజేపీ సుపరిపాలనలో దైవకార్యమే, ఆధిపత్య మత కార్యాలే రాజధర్మాలు, ప్రగతి కార్యాలు. కుంభమేళాలు, నదీ హారతులే ప్రజాసేవలు. ఇతర మతాచారాలు దేశద్రోహాలు. హిందు ఆలయాల నిర్మాణ, ప్రారంభ కార్యక్రమాలల్లోనే ప్రధాని ప్రధాన పూజారిగా పాల్గొంటారు. చర్చీలు, మసీదులు పట్టవు. వైదికాన్ని పెంపొందించే బీజేపీ మాత్రమే 'ఒక దేశం ఒక పార్టీ' సూత్రం కింద ఉంటుంది. ఇతర పార్టీల ఉనికి ఉండదు. సంఘీయులు, మోదీయులు మాత్రమే నీతిపర రాజకీయ కిరీటాలు ధరిస్తారు. భాజపేయ జంధ్యం ధరించినవారు పునీతులవుతారు. ఇతరులను అవినీతిపరులుగా, అక్రమ సంపాదనాపరులుగా సిబిఐ, ఇడి, ఎన్.ఐ.ఎ. నిరూపిస్తాయి. ఈ ప్రహసనానికి అవినీతి నిర్మూలన, జాతి సంపద రక్షణ వంటి బిరుదులు ఇస్తారు. ప్రతిపక్షపాలిత రాష్ట్రాలలో, ఒకవేళ ఉంటే, గవర్నర్లు సమాంతర పాలకులవుతారు. చట్టసభల్లో, పదవుల్లో హిందువులే ఉంటారు. అసత్యవాదులు, పగటి వేషగాళ్ళు, పాములాటగాళ్ళు పాలకులుగా స్థిరపడతారు. గాంధీ హంతకులతో సహా హంతకులు, అత్యాచారులు, సంఘ్ నాయకులే దేశభక్తులు. ప్రాయోజితాలకు అర్హులు. కూరగాయల అంగళ్ళు, చిల్లర కొట్లలో కూడా మోడీ బొమ్మలు పెట్టాలి. లేకుంటే కేంద్ర మంత్రులు దండెత్తుతారు. నిధులను ఆపేస్తారు. పాలనలో, చట్ట నిర్మాణంలో రాజ్యాంగ లొసుగులను వాడుకుంటారు. లౌకిక, సామ్యవాదం వంటి పదాల స్థానంలో వైదిక మతం వంటి పదాలకు చోటు కల్పిస్తారు.

కర్నాటక బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో రోజూ పది నిమిషాల ధ్యానం తప్పనిసరి చేసింది. గుజరాత్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి అమలు ప్రక్రియ మొదలుపెట్టింది. ఇది దేశమంతా వ్యాపిస్తుంది. అందులో ఆధిక్య మత భావాలను, సాంప్రదాయాలను మాత్రమే పొందుపరుస్తారు. శాకాహారమే తినాలి. శాఖ, కులమతాంతర వివాహాలు నిషేధించబడతాయి. మనుస్మృతి రాజ్యాంగం, కాషాయజెండా జాతీయ పతాకం, గోవు జాతీయ జంతువు, కమలం జాతీయ పుష్పమవుతాయి. మోడీ జాతిపిత అవుతారు.

చట్టసభల్లో పాలకుల ప్రవచనాలే చట్టాలు. చర్చలు, భిన్నాభిప్రాయాలు, స్త్రీశిశు బలహీనవర్గాల శ్రేయస్సుకు తావుండదు. అమృతకాలం హిందువులకే. బహిరంగ ప్రదేశాల్లో మత నిర్మాణాలను కాపాడాలని 2009లో సుప్రీంకోర్టు ఆదేశించింది. "ఆ మేరకు" 2021లో కర్నాటక ప్రభుత్వం చట్టం చేసింది. ఇతర మతాల ప్రార్థనా స్వేచ్ఛను తొలగించింది. మత మార్పిడి చట్టంలో హిందువులు ఇతర మతాలకు మారరాదు. ఇతరులు హిందువులుగా మారితే అది స్వగృహ ప్రవేశం. స్వయం నిర్ణయ వయోపరిమితితో మోడీ వైదొలగవలసివస్తే అమిత్ ప్రధాని, యోగి గృహ మంత్రి అయ్యే అపాయం ఉంది. ద్వితీయ శ్రేణి వైదిక కేజ్రీలు ప్రత్యామ్నాయాలుగా మారతారు. పొరబాటున ఇతర కూటములు గెలిచినా అవి వైదిక ధర్మ పాలననే, విధానాలనే, చట్టాలనే కొనసాగిస్తాయి. ప్రత్యామ్నాయ పక్షాలు సారూప్య గమ్యాన్ని మరిచి గమన భేదాల్లో, ఐక్యతను అశ్రద్ధ చేసి స్వీయ ఘనతల ప్రచారంలో మునుగుతాయి. అసంతృప్తులను అణగదొక్కుతూ బలహీనపడుతూ ఉంటాయి.

పుట్టుకతో భారతీయులయినా ఇతర మతస్తులు, ప్రత్యేకించి ముస్లింలు పౌరసత్వం కోల్పోతారు. వారికి ఓటు, జీవించే హక్కులు ఉండవు. వారు శరణార్థి శిబిరాలలో, జైళ్ళలో కుక్కబడతారు. వైదికమతమే ఉంటుంది. ఇతర మతాలన్నీ మాయమౌతాయి. హిందు గుళ్ళను మాత్రమే పునర్నిర్మిస్తారు. కడతారు. ఇదే ప్రగతి సూచీగా ప్రచారం చేస్తారు. హిందుత్వ పూజా సామగ్రి, వస్తుసేవలను వైదికులే అమ్మాలి. ఇతర మతస్తులు అమ్మరాదు. ఇతర మత వస్తుసేవలను వైదికులు అమ్మవచ్చు. హిందు ఆలయాల వద్ద ఇతర మతస్తులు భిక్షమెత్తరాదు. గోమాతలను వైదిక మతవాదులు రోడ్లపై వదిలేయవచ్చు. గోరక్షణాలయాల్లో గడ్డిపెట్టకుండా చంపవచ్చు.

అన్నిరంగాల సంస్థల అధిపతులు, అధికారులు సంఘ్ భావజాలురే. రూపాంతర ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌లు స్వమత శకునులుగా, శల్యులుగా మారతారు. నేటి భారతం అప్రకటిత హిందుదేశం. సమాచార సాంకేతికతలు విస్తరించని నాటి ముసోలిని ఫాసిజం, హిట్లర్ నాజీయిజంతో పోల్చితే నేటి భారత నియంత త్రయం నూతన క్యాపిటలిస్టు, కార్పొరేటిస్టు నాజీ-ఫాసిజం చాలా అపాయకరమయింది. ఇది అమృతకాలంలో లభించబోయే విషామృతం. గరళకంఠులుగా మారాలా? విషశరీరులను విసర్జించాలా? రాహుకేతు పోరాటాలు సాగాలా? ఇవి నేటి సవాళ్లు.

మెయిల్ @ నవతెలంగాణ

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలి

రాష్ట్రంలోని ములుగు జిల్లాలో ఫిబ్రవరి 21 తేదీ నుంచి 24 తేదీ వరకు జరగనున్న మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి వచ్చే మహా సంబురాన్ని చూడడానికి కోట్లాదిమంది భక్తులు హాజరవుతారు. కుంభమేళ తర్వాత ఎక్కువ మంది హాజరయ్యే జాతర ఏదైనా ఉందంటే అది మేడారమేనని చెప్పుకోవాలి. నాలుగురోజుల పాటు నిర్వహించనున్న జాతరలో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే ఈ జాతరకు సుమారు ఏడువందల ఏండ్ల చరిత్ర ఉంది. 1940 వరకు చిలకల గుట్ట మీద జరిగే జాతరకు గిరిజనులు మాత్రమే వచ్చే వాళ్లు. కాలక్రమేణా మన రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఈ జాతరకు గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి లక్షల కొద్ది ప్రజలు తండోపతండాలుగా తరలివస్తారు. ఈ జాతరను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1968లోనే రాష్ట్ర పండుగ గా గుర్తించింది.



అయితే మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం 2008 నుంచే కోరుతున్నది. ప్రతి జాతర సమయంలో ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తున్నా కేంద్రం మాత్రం ఎలాంటి నిర్ణయం ప్రకటించడం లేదు. తెలంగాణ ప్రభుత్వం గతంలోనే కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖకు పూర్తి వివరాలతో కూడిన నివేదిక అంద జేసింది. 2020 జాతర సమయంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన అప్పటి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి కూడా వినతులు సమర్పించింది. జాతరకు జాతీయ హోదా వస్తే కేంద్రం నుంచి నిధులు రావడమే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపుతో పాటు పర్యాటక ప్రదేశంగా కూడా అభివృద్ధి చెందే అవకాశముంది. కానీ కేంద్రం సంస్కృతి సంప్రదాయలకు గౌరవిస్తామంటూనే తెలం గాణలో అతి పెద్ద గిరిజన జాతరను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలహాబాద్‌లో జరిగే కుంభమేళా తర్వాత అత్యంత మహా జాతరగా సాగుతున్న ఈ జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయి.

జాతీయ హోదా వస్తే యునెస్కో గుర్తింపునకు అవకాశం ఉంటుంది. కోల్‌కతా దుర్గాపూజ ఎలాగైతే యునెస్కో గుర్తింపు పొందిందో అలాగే చారిత్రక నేపథ్యం కలిగిన మేడారం జాతరకు కూడా యునెస్కో వారసత్వ హోదా పొందే అవకాశం ఉంటుంది. ఎలాంటి విగ్రహాలు గానీ కనీసం గుడి కూడా లేని పలు విశిష్టతలు కలిగిన ఈ జాతర ఇంటాన్జబుల్(కనిపించని) వారసత్వ సంపద కేటగిరీలో యునెస్కో వారసత్వ హోదా లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి.

- పుల్లూరు వేణుగోపాల్, 9701047002

అంపశయ్యపై తెలంగాణ విద్యారంగం



టి. నాగరాజు
9490098292

దేశంలో విద్యారంగం స్థితిగతులపై అధ్యయనం చేసి వివరాలను చెప్పే యాన్యువల్ స్టాటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఆసర్) 2023 రిపోర్ట్‌ను 2024 జనవరి 17న వెల్లడించింది. ఈ సర్వే రిపోర్ట్‌లో తెలంగాణ విద్యారంగంలో ఆందోళనకర విషయాలు వెల్లడించింది. మొత్తం దేశంలో 2023 డిసెంబర్ 15 వరకు 26 రాష్ట్రాలలో 28 జిల్లాల్లో 1664 గ్రామాలలో 30,074 కుటుంబాల నుండి 34,745 మంది విద్యార్థులలో ఈ సర్వే నిర్వహించింది. 14 ఏండ్ల నుండి 16 ఏండ్ల వరకు పాఠశాల స్థాయి,17-18 ఏళ్ల వరకు ఇంటర్ కళాశాల స్థాయి విద్యార్థును ఈ సర్వేలో భాగస్వామ్యం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో 59 గ్రామాలు, 689 గృహాలలో 709 మంది విద్యార్థులను సర్వేలో భాగస్వామ్యం చేశారు. ఈ సర్వే నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు 14-16 వయసున్న వారిలో 42.2శాతం మంది,17-18 వయసున్న వారిలో 50.3శాతం మంది విద్యార్థులు కనీసం మాతృభాష అయిన తెలుగులో రెండవ తరగతి పాఠాలను చదవలేక పోతున్నారని వివరించింది. తెలుగు మాత్రమే కాదు కనీసం అర్థమేటిక్ స్కిల్స్‌లో కూడ 14-16 వయసున్న వారిలో 21.5శాతం 17-18 వయసున్న వారిలో 18శాతం, ఇంగ్లీష్ చదవడంలో 14-16 వయసున్న వారిలో 45శాతం, 17-18 వయసున్న వారిలో 41.4శాతం మంది మాత్రమే సామర్థ్యం కలిగి ఉన్నారని తెలిపింది. ఇది తెలంగాణ విద్యారంగ భవిష్యత్ మరింత ఆందోళన కలిగించే అంశం. అలాగే ఈ రిపోర్టులో మరొక ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే తమ చదువుల కోసం గత ఆరు నెలల కాలంలో నెలలో 15 రోజుల కంటే ఎక్కువ వారి కుటుంబ పనిలోనూ లేదా పార్ట్ టైం లేదా ఫుల్ టైం పనిలో ఉండి చదువుకునేవారు 14-16 ఏళ్ల వయసున్న వారు 47.3శాతం, 17-18 వయసున్నవారు 68.7 శాతం ఉంటే విద్యార్థినిలులే 58.8శాతం మంది చదువుకు దూరంగా ఉండి పని చేస్తూ చదువుకుంటున్నారు. చదువుకుంటూనే 3.5శాతం మంది తక్షణ ఉద్యోగాల కోసం కంప్యూటర్ లాంటి కోచింగ్ కూడా తీసుకుంటున్నారని ఆందోళనకర విషయాలు ఆసర్ నివేదిక వెల్లడించింది.

ఇదే కాదు దక్షిణాది రాష్ట్రాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచడంలో ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు తెలంగాణ రాష్ట్రం చిట్టచివరగా ఉంది. ఈ జాబితాలో విద్యార్థులకు సామర్థ్యాలను పెంచటంలో కేరళ మొదటి స్థానంలో ఉంది. 14-16 వయస్సు వారిలో పాఠశాలలో చేరకుండా ఉన్నవారిలో కేరళలో 0.5శాతం ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 23.1 శాతం ఉంది. 17-18 వయసున్న వారు మధ్యలో చదువు మానివేస్తున్న వారు కేరళలో 18.6శాతం ఉంటే తెలంగాణాలో 40.1శాతం ఉంది. విద్యార్థులకు సామర్థ్యాలను పెంచడంలో కేరళ అగ్రస్థానంలో ఉంటే తలసరి ఆదాయం మిన్నగా ఉంటూ అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ అంటున్న మన రాష్ట్రం అందరికంటే వెనుకబడి ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రానికే తలవంపు. గత పదేండ్లుగా ప్రభుత్వం విద్యపట్ల నిర్లక్ష్యం వహించడమే ఈ దుస్థితికి కారణం. తెలంగాణ విద్యావ్యవస్థ సంక్షోభంలో ఉందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. ఇది ఖమ్మంలాంటి చోట్ల సర్వేలోనే ఈ రకమైన అంశాలు వెల్లడైతే తెలంగాణ రాష్ట్రంలో గిరిజన జిల్లాలు, అటవీప్రాంతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న జిల్లాలలో ఈ పరిస్థితులు మరింత ఆందోళనాకరంగా ఉండే అవకాశాలను అర్థం చేసుకోవచ్చు.

ఖాళీలు నింపరు-నిధులివ్వరు

ఈ సంక్షోభానికి ప్రధాన కారణాల్లో ఒకటి ప్రభుత్వ బడులలో ఖాళీలు నింపకపోవటం. గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్రంలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. నెలనెలా రిటైర్మెంట్ ఖాళీలు ఏర్పడుతున్న ఉపాధ్యాయులను నియమించకుండా ప్రభుత్వం ప్రభుత్వ విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. గత పదేండ్ల కాలంలో విద్యారంగంపై పాలకులు సమీక్ష నిర్వహించలేదు, విద్యార్థుల అభ్యాసన పద్ధతులు పెంచడం, మౌలిక వసతులు కల్పన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. కరోనా కంటే ముందు రాష్ట్రంలో 12 వేల విద్యావాలంటీర్లను నియమించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ,కరోనా సందర్భంగా తొల గించి, మళ్లీ భర్తీ చేయలేదు. తెలుగు మీడియం పాఠశాలలతో పాటు ఇంగ్లీషు మీడీయం అప్ గ్రేడ్ చేస్తూనే, తెలుగు మీడియం ఉపాధ్యాయులే ఇంగ్లీషు మీడియం కూడా బోధించాల్సిన పరిస్థితి మన రాష్ట్రంలో ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో 24,000 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 17,873టీచర్ పోస్టులు భర్తీ చేయాలని చెబుతున్న వాటిని కూడా ఇప్పటికి భర్తీ చేయలేదు. బడులను పర్యవేక్షణ చేసే మండల, జిల్లా విద్యాశాఖ పోస్టులను భర్తీ చేయలేదు, టీచర్ ట్రైనింగ్ సంస్థలో ఉపాధ్యాయులను తయారు చేసే డైట్,బిఇడి కళాశాలలో విధానాలు రూపకల్పన చేసే ఎస్సీఈఆర్టీలో కూడా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. రాష్ట్రంలో 608 మండలాలకు గాను కేవలం 17 మండలాల్లో మాత్రమే రెగ్యులర్ ఎం.ఇ.ఓలు ఉన్నారు, 66 డిప్యూటీ డి.ఇ.ఓ.లకు గాను ఆరుగురు మాత్రమే రెగ్యులర్ ఉన్నారు, 33 జిల్లాలకు కేవలం ఏడుగురు జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రమే ఉన్నారు. ఒక్కో మండల విద్యాశాఖధికారి రెండు నుండి మూడు మండలాలకు ఇంఛార్జి ఎం.ఇ.ఓ.లుగా ఉండడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కరోనా తర్వాత ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులు ఎన్రోల్ పెరిగిన, సార్లు , సౌకర్యాలు లేక మళ్లీ ప్రయివేటు బాట పడుతున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలలో అయినా నాణ్యమైన విద్య అందుతుందా అంటే అక్కడ కూడా సామర్థ్యం పెంచే పక్రియ కాకుండా బట్టి విధానం అమలు చేస్తున్నారని జాతీయ నివేదికలు చెబుతున్నాయి.



తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం -2009 నిర్దేశించిన ప్రమాణాలను 40,597 ప్రభుత్వ పాఠశాలలకు కేవలం ఆరు శాతం మాత్రమే కలిగి ఉన్నాయని నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన భవనాలు, మూత్రశాలలు, ఆటస్థలాలు, కరెంటు సౌకర్యం, ప్రహరీ లేకపోవడం, మధ్యాహ్నం భోజనం నాణ్యంగా అందించకపోవడం, తాగునీరు అందకుండా ఉండే పరిస్థితి ఇంకా వేధిస్తునే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి మారకుండా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించే స్థితిలో ప్రభుత్వం లేదు. గత ప్రభుత్వం 3,497 కోట్ల రూపాయలతో మన ఊరు -మనబడి పథకం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన ఆచరణలో అది సంపూర్ణంగా అమలు కాలేదు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగానికి 2014 నుండి 2023 వరకు క్రమంగా బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. ప్రతి ఏటా తగ్గుతున్న ఈ కేటాయింపుల వల్ల సర్కారు బడులు అంపశయ్యకు దగ్గరవుతున్నాయి. మొదటి బడ్జెట్లో విద్యారంగానికి 10.89 శాతం నిధులు కేటాయిస్తే 2023 రాష్ట్ర బడ్జెట్లో 6.57 శాతానికి నిధులు పడిపోయాయి. ఈ కేటాయిస్తున్న నిధులు కూడా కేవలం జీతాల కోసం తప్ప అభివృద్ధికి ఏ మాత్రం సరిపోవడం లేదు. కనీసం 20 శాతం నిధులైన రాష్ట్రాల స్థాయిలో కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్న తెలంగాణలో మాత్రం ప్రతియేటా నిధులు తగ్గిస్తున్నారు పాలకులు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం - 2009 నిర్దేశించిన ప్రమాణాలను 40,597 ప్రభుత్వ పాఠశాలలకు కేవలం ఆరు శాతం మాత్రమే కలిగి ఉన్నాయని నేషనల్ శాంపిల్ సర్వే లో వెల్లడైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన భవనాలు, మూత్రశాలలు,ఆటస్థలాలు, కరెంటు సౌకర్యం, ప్రహరీ లేకపోవడం, మధ్యాహ్నం భోజనం నాణ్యంగా అందించకపోవడం, తాగునీరు అందకుండా ఉండే పరిస్థితి ఇంకా వేధిస్తునే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి మారకుండా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించే స్థితిలో ప్రభుత్వం లేదు.

విద్యా ప్రమాణాల్లో లోపం

విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచి చదవడం, రాయడంలో సామర్థ్యం పెంచడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయి. విద్యాసామర్థ్యాన్ని పెంచడానికి ఏటా ఒక కార్యక్రమం చేస్తుంది తప్ప వాటిని సమీక్ష చేయకుండానే విద్యా సంవత్సరం ముగుస్తుంది. తెలంగాణలో సగానికి పైగా విద్యార్థులు ప్రయివేట్‌లో చదువుకుంటున్న వారికి కూడా తరగతి సామర్థ్యం అందడం లేదని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. విద్యాసామర్థ్యాలు అందించడానికి వ్యవస్థలు ఉన్న అందులో టీచర్లు తప్ప విద్యా శాఖలో వివిధ స్థాయి అధికారులకు పట్టింపులు, క్షేత్ర స్థాయిలో పర్యటనలు లేవు. క్షేత్రస్థాయికి వెళ్లిన మధ్యాహ్న భోజనం, బాత్రూంలు, పుస్తకాల పంపిణీ పై దృష్టి సారిస్తారు. కానీ విద్యాసామర్థ్యాలు ఎంత సాధించారు? ఎలా సాధించాలి? అనే సమాచారం, పాఠశాలల సందర్శనలో అభ్యాసన ఫలితాలు గురించి పర్యవేక్షణకు సరైన సమాచారం ఉండదు. పాఠశాలల్లో విద్యార్థులకు ఎలా సామర్థ్యాలు పెంచాలో, సరైన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు కూడా ప్రభుత్వం నిర్వహించదు. ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించిన వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించరు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థి అధ్యయన, అభ్యాసన సామర్థ్యం పెంచే కృషి ఎలా అమలు అవుతుదనేది ప్రశ్నార్థకం. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

(నేడు అంతర్జాతీయ విద్యా దినోత్సవం)

బిజినెస్

అమెరికాలో ఉద్యోగాల తెగ్గోతా..

- ఐటి వర్గాల్లో తీవ్ర ఆందోళన
- గతేడాది తొలగింపుల్లో 98 శాతం పెరుగదల
- 2024లోనూ ఉద్వాసనలే..!
- బోనస్‌లకు ఎగనామం



వాషింగ్టన్ : పెట్టుబడిదారి అగ్రదేశం అమెరికాలో ఉద్యోగులకు కనీస భద్రత లేకుండా పోతోంది. గడిచిన రెండేళ్లలో లక్షలాది ఉద్యోగులు రోడ్డున పడగా.. ఈ ఏడాది మరిన్ని ఉద్వాసనాలు కొనసాగనున్నాయని తాజా ఓ రిపోర్ట్ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 'ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్' నివేదిక ప్రకారం.. అమెరికా కంపెనీలు గతేడాది దాదాపు 7,21,677 మంది ఉద్యోగులపై వేటు వేశాయి. 2022లో నమోదయిన 3,63,832 తొలగింపులతో పోలిస్తే ఇది 98 శాతం అధికమని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ వెల్లడించింది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, అమెజాన్ సహా టెక్ రంగంలోని కంపెనీలే దాదాపు 1,68,032 మందిని ఇంటికి పంపించాయని తెలిపింది. ఈ సంఖ్య ఏడాదికేడాదితో పోల్చితే 73 శాతం ఎక్కువ. మరోవైపు 2023లో 34 శాతం యాజమాన్యాలు తమ ఉద్యోగులకు బోనస్‌లను ఎగ్గొట్టాయి.

'ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు ఉద్యోగ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా చిన్న చిన్న స్టార్టప్స్ నుంచి పెద్ద టెక్ కంపెనీల వరకూ ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. దీంతో 2024 ఉద్యోగ మార్కెట్ మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉంది.' అని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్' పేర్కొంది. 'కార్మికుల వ్యయం ఎక్కువ. కాబట్టే ఈ ఏడాది సైతం సంస్థలు పొదుపు చర్యలకు దిగనున్నాయి. 2024 జనవరి నుంచి మార్చితో ముగియనున్న త్రైమాసికంలో భారీగా నియామకాలు తగ్గించి.. మరోవైపు ఉన్న సిబ్బందికి ఎసరు పెట్టే యోచనలో ఉన్నాయి. కోవిడ్-19 వంటి సమయాల్లో ఓ వెలుగు వెలిగిన ఐటి రంగం ప్రస్తుతం కృత్రిమ మేధ టెక్నాలజీతో నేల చూపులు చూస్తోంది. ఆర్థిక మాంద్యం, ప్రాజెక్ట్‌ల లేమి వంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న ఆయా టెక్ కంపెనీలు తమ వ్యయాలను తగ్గించుకునే యోచనలో పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి.' అని' ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ ఛాలెంజర్ అన్నారు.

రిటైల్, తయారీలోనూ వేటు..

గతేడాది 2023లో రిటైల్ కంపెనీలు ఏకంగా 78,840 మంది ఉద్యోగులపై వేటు వేశాయి. ఇంతక్రితం ఏడాది ఉద్వాసనలతో పోల్చితే 274 శాతం పెరిగాయి. 2024లోనూ అదే పరిస్థితి కొనసాగనుందని ఆండీ ఛాలెంజర్ పేర్కొన్నారు. ఆ తర్వాత హెల్త్‌కేర్, ఉత్పత్తుల తయారీ రంగాలు ఉద్వాసనలకు పాల్పడనున్నాయని అంచనా వేశారు. ఆస్పత్రులు సహా ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థల్లో తొలగింపులు 91 శాతం పెరిగి 58,560గా నమోదయ్యాయి. 'అమెరికా ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చితులే ఉద్యోగుల తొలగింపులకు ప్రధాన కారణం. డిమాండ్ సన్నగిల్లి పలు స్టోర్లు మూతపడటం, వ్యాపారాల దివాలా, ఎఐ తదితర అంశాలు ఉద్యోగులపై కత్తివేలాడేలా చేసింది.' అని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ నివేదిక పేర్కొంది.

పోర్టుపోలియో విస్తరణపై రెనల్ట్ దృష్టి



హైదరాబాద్ : భారత్‌లో తమ వ్యాపార వ్యూహాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టామని రెనాల్ట్ ఇండియా ఆపరేషన్స్ సీఈఓ, ఎండి వెంకట్రామ్ మామిళ్లపల్లే అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రెనో వచ్చే 3-5 ఏండ్లలో కొత్త ఆవిష్కరణలకు ప్లాన్ చేస్తుందన్నారు. ఫ్రెంచ్ కార్ల తమ కంపెనీ ప్రస్తుత ఏడాదిలోనూ కొత్తవేరియంట్‌లతో పోర్టు పోలియోను మెరుగుపర్చుకుంటుందని తెలిపారు. రెనో కోసం యూరప్ వెలుపల ఉన్న నాలుగు ప్రధాన కేంద్రాలలో భారతదేశం ఒకటన్నారు.ఈ క్రమంలోనే ఉత్పత్తి పోర్టు పోలియోను విస్తరిస్తోందన్నారు. వచ్చే మూడేళ్లలో ఐదు ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నామన్నారు. కొత్త 2024 శ్రేణితో కైజర్, ట్రైబర్, క్విడ్ మోడల్‌లను బలోపేతం చేయనున్నామన్నారు. వినియోగదారులను పెంచుకునేందుకు 3 మోడళ్లలో 5 కొత్త వేరియంట్‌లను పరిచయం చేస్తున్నామన్నారు. రెనాల్యూషన్ ఇండియా 2024 కింద కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్నామన్నారు.


స్విగ్గీ ప్లాట్‌ఫామ్ రుసుం రెట్టింపు..!

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక స్విగ్గీ త్వరలో తన ప్లాట్‌ఫామ్ రుసుంను రెట్టింపు చేయనుందని సమాచారం. ప్రస్తుతం ఉన్న ఫీజును రూ.5 నుంచి రూ.10కి పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. స్విగ్గీ త్వరలో ఐపిఒకు రానున్నందున నష్టాలను తగ్గించుకోవడానికి తన ప్లాట్‌ఫామ్ ఫీజును రెట్టింపు చేసే యోచనలో ఉందని రిపోర్టులు వస్తున్నాయి.ఉందని ఆంగ్ల మీడియాలో కథనాలు పేర్కొంటున్నాయి. తొలుత ఉచితంగా ప్రారంభించిన ఈ సేవలను 2023 ఏప్రిల్‌లో కొన్ని నగరాల్లో మాత్రమే ఫుడ్ డెలివరీలపై ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలుచేయడం ప్రారంభించింది. ఆ తర్వాత ప్రతి ఆర్డర్‌పై రూ.2 చొప్పున చార్జ్ చేసింది. ఆ తర్వాత దీన్ని రూ.5కు పెంచింది. ప్రస్తుతం రెట్టింపు చేసే యోచనలో ఉంది. స్విగ్గీలో రోజుకు 15 లక్షల నుంచి 25 లక్షల ఫుడ్ ఆర్డర్లు నమోదవుతున్నాయి.

మహీంద్రా నుంచి సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సల్

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సల్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.6.61 లక్షలుగా నిర్ణయించింది. దీన్ని 900 కిలోలు, 750 కిలోల పెలోడ్ సామర్థ్యంతో ఆవిష్కరించింది. ఇది డీజిల్, సీఎన్‌జీ డ్యుయో వేరియంట్‌లో లభ్యమవుతందని తెలిపింది. కొత్త మహీంద్రా సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సెల్ బహుళ ఇంజిన్, ఇంధన ఎంపికలు, ఆధునిక శైలి, అధునాతన భద్రత, సాంకేతికత ఫీచర్లతో డిజైన్ చేశామని ఎంఅండ్ఎం ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినీ కాంత్ గొల్లగుంట తెలిపారు. సుప్రో ఎక్సల్ డీజిల్ లీటర్‌కు 23.6 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు.

కొత్త ప్రాంతంలోకి ఎల్ఐసి ఎంఎఫ్ కార్యాలయం



హైదరాబాద్ : నగరంలోని బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలాయన్ని మరో చోటుకు తరలించినట్లు ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ సంస్థ వెల్లడించింది. సోమాజిగూడలోని రాజ్‌భవన్ రోడ్ వివి వింటేజ్ బౌలేవార్డ్‌కు మార్చినట్లు తెలిపింది. దీన్ని మంగళవారం ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్‌కె ఝా లాంచనంగా ప్రారంభించారు. ఇది తమ వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండనుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా గణంకాల ప్రకారం.. 2023 డిసెంబర్ 31 నాటికి ఈ రంగంలో రూ.50.77 లక్షల కోట్ల ఆస్తులు ఉండగా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి రూ.1.43 లక్షల కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయని తెలిపారు. ఒక్క హైదరాబాద్ నుంచే రూ.1 లక్ష కోట్ల ఎయుఎం ఉంటుందన్నారు.

నేతాజీ స్ఫూర్తితో మతతత్వ రాజకీయాలపై పోరాటం

లౌకిక భారతాన్ని నిర్మించాలి

- కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నేతలు
- హైదరాబాద్‌లో సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుభాష్ చంద్రబోస్ (నేతాజీ) స్ఫూర్తితో మతతత్వ రాజకీయాలపై పోరాటాలను ఉధృతం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ పిలుపు నిచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతూ దేశభక్తియుత భావాలతో లౌకిక భారతదేశ నిర్మాణం కోసం కృషి చేయాలని చెప్పారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పౌరులంతా పోరాడాల్సిన అవసరముందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతతత్వ మనస్తత్వం పోయినప్పుడే మతతత్వం పోతుందని చెప్పారు. మతతత్వాన్ని మట్టుపెట్టే పని భారతీయులందరిదని అన్నారు. దీనికోసం అందరూ మతతత్వ దృక్పథంతో కాకుండా నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరచుకోవాలని కోరారు. దేశంలో మత రాజకీయాలను బీజేపీ నిస్సిగ్గుగా అమలు చేస్తున్నదని విమర్శించారు. మతాన్ని, రామున్ని రాజకీయంలోకి లాగుతూ పబ్బం గడుపుకుంటున్నదని చెప్పారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో బీజేపీ మార్కు రాజకీయం స్పష్టంగా కనిపించిందని ఎద్దేవా చేశారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ గొప్ప పాత్ర పోషించారని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో గొప్ప వ్యక్తిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. గొప్ప విద్యావంతుడుగా, దేశభక్తి భావాలు కలిగిన నాయకునిగా, ధైర్యం త్యాగనిరతి, సాహసం ఎంతో ఉత్తేజమిస్తాయని చెప్పారు. 'మీరు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్రాన్ని తెచ్చి పెడతాను'అంటూ నేతాజీ ఇచ్చిన నినాదం దేశ ప్రజలు, యువతకు ఆదర్శంగా నిలిచాయని వివరించారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ)ని స్థాపించడంతోపాటు, ఆజాద్ హింద్ ఫౌజు అనే బలమైన సంస్థ ద్వారా స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపారని చెప్పారు. స్వాతంత్ర పోరాటంలో గాంధీజీతో సైద్ధాంతికంగా విభేదించి సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకున్నాడని అన్నారు. మతతత్వం, మతోన్మాదం విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించారని వివరించారు. అనేకమార్లు జైలు జీవితం, నిర్బంధాలకు గురయ్యారని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై రాజీలేని పోరాటం చేశారన్నారు. జాతీయోద్యమంలో ఏమాత్రం పాల్గొనని వారు, బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో రాజీపడ్డవారు హిందూత్వవాదులు నేడు సుభాష్ చంద్రబోస్ గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. హిందూత్వ సిద్ధాంతం, ఆరెస్సెస్ విధానాలపైన నేతాజీ తీవ్రమైన విమర్శలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జావిద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, హైదరాబాద్ నగర కార్యదర్శి అధ్యక్షులు లెనిన్ గువేరా, కె అశోక్ రెడ్డి, నాయకులు స్టాలిన్, రమేశ్, కేవీపీఎస్ నాయకులు బాలపీరు, శ్రీలత, డీవైఎఫ్ఐ నాయకులు హస్మి, క్రాంతి, రఘు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో స్వచ్ఛకార్మికులను నియమించండి

- విద్యావాలంటీర్లను తీసుకోవాలి
- ఉచిత విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి టీఎస్‌జీహెచ్ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛకార్మికులను నియమించాలనీ, దీంతో 26,065 మందికి ఉపాధి అవకాశాలు కల్పించొచ్చని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) సూచించింది. విద్యావాలంటీర్లను నియమిస్తే 18 వేల మందికి ఉద్యోగాలను కల్పించొచ్చని వివరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజుగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం వినతిపత్రం సమర్పించారు. మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ దృఢ నిశ్చయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. మూసేసిన పాఠశాలలను పున్ణప్రారంభించాలన్న ప్రభుత్వ ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు. మూసేసిన పాఠశాలలన్నీ విద్యార్థులు లేకపోవడం లేదా ఆయా వాటిలో చేరకపోవడమే కారణమని వివరించారు. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను (పీటీఐ) నియమించడం ద్వారా మరో ఐదు వేల మందికి ఉద్యోగాలొస్తాయని తెలిపారు. 1,817 స్కూల్ కాంప్లెక్స్‌లకు ఒక కంప్యూటర్ ఆపరేటర్ కం క్లర్క్ నియామకాలు చేపట్టాలనీ, సీఆర్పీలు లేని స్కూల్ కాంప్లెక్స్‌లలో వారిని నియమించాలని సూచించారు. గత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 148 మండలాల్లో ఎంఐఎస్, సీసీవో, మెస్సెంజర్, ఐఈఆర్పీలను నియమించాలని కోరారు. వంట, గుడ్డు ధరలను సవరించి మధ్యాహ్న భోజన నిర్వాహకుల బిల్లులను వెంటనే గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనీ, కంప్యూటర్లు, అవసరమైన ఫర్నీచర్‌ను ఇవ్వాలనీ, బోధనేతర సిబ్బందిని నియమించాలని తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వులు నూతన జిల్లా, జోన్లు, మల్టీ జోన్ల వర్గీకరణకు అనుగుణంగా నూతన సర్వీసు నిబంధనలను రూపొందించాలని పేర్కొన్నారు. నూతన పోస్టులు, క్యాడర్లను సృష్టించాలని సూచించారు.

మానవతావాది డాక్టర్ జ్యోతి కన్నుమూత

- పలువురు నేతల నివాళి


(ఫైల్)



విజయవాడ : ఐద్వా వ్యవస్థాపకురాలు నాగెళ్ల రాజేశ్వరమ్మ కుమార్తె, సీపీఐ(ఎం) అభిమాని డాక్టర్ సిరివరపు జ్యోతి (83) మంగళవారం తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కాటూరులోని స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు భర్త ప్రసాద్ ఉన్నారు. తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, జానకిరామయ్య ఆశయ సాధన కోసం తుదిశ్వాస వరకూ కృషి చేశారు. జ్యోతి భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కన్నీటి వీడ్కోలు

జ్యోతి అంత్యక్రియలు సాయంత్రం ఆమె స్వగ్రామం కాటూరులో జరిగాయి. ముందుగా ఆమె స్వగృహం నుంచి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. మహిళా నేతలు డి.రమాదేవి, కాట్రగడ్డ స్వరూపరాణి, పిన్నమనేని విజయ, వీరమాచినేని జ్యోతి, చేబ్రోలు బసవమ్మ, మల్లంపల్లి జయమ్మ, బి.కీర్తి, నిమ్మాది నాగమణి, ఎస్.ప్రశాంతి తదితరులు ఆమె పాడేమోశారు.

ఎస్‌సీఈఆర్టీలో డిప్యూటేషన్ల రద్దు

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ)లో డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌సీఈఆర్టీలో ఫారిన్ సర్వీసులో ఉన్న వారు, రెండేండ్లకు పైగా డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న వారు, ఓడీలో ఉన్న వారికి సంబంధించి వాటిని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. డిప్యూటేషన్ లేదా ఓడీలో ఉన్న వారు రెండేండ్ల కంటే తక్కువుంటే వారు మినహాయించబడతారని స్పష్టం చేశారు. డిప్యూటేషన్‌ను రద్దు చేసిన ఉద్యోగులు వెంటనే వారి సొంత స్థానానికి వెళ్లాలని ఆదేశించారు. తదుపరి ఉద్యోగుల నియామకాల కోసం నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని తెలిపారు. పారదర్శకంగా అర్హులైన వారిని నియమిస్తామని పేర్కొన్నారు. వారి డిప్యూటేషన్ కాలం మూడేండ్లకు మించకుండా నియమిస్తామని వివరించారు. శిక్షణ, కార్యక్రమాలు, మూల్యాంకనం, పరిశోధన వంటి అంశాలకు సంబంధించి వాటిని క్షేత్రస్థాయిలో అమలుకు ముందు ప్రభుత్వ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమాలు, ప్రాజెక్టులకు సంబంధించి నేరుగా పర్యవేక్షణ చేయొద్దని కోరారు. ఆ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఉండే ఎంఈవో, డిప్యూటీఈవో, డీఈవోలు పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. ఎస్‌సీఈఆర్టీ పరిశోధన, వనరులకు సంబంధించిన అంశాలనే చూసుకోవాలనీ, పర్యవేక్షణ దాని బాధ్యత కాదని వివరించారు. వచ్చేనెల ఒకటో తేదీలోగా నివేదికను సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. అయితే ఎస్‌సీఈఆర్టీలో డిప్యూటేషన్‌పై రెండేండ్లకుపైగా పనిచేస్తున్న వారు సుమారు 50 మంది వరకు ఉండొచ్చని తెలుస్తున్నది.

ఏసీబీతో సింగరేణి ఒప్పందం

- మెడికల్ బోర్డు ప్రక్రియలో మోసగాళ్లకు చెక్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి మెడికల్ బోర్డులో అక్రమాలను నిరోధించేందుకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తో ఒప్పందం చేసుకున్నామని సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం తెలిపారు. కొందరు వ్యక్తులు మెడికల్ బోర్డు పేరుతో ఉద్యోగులను మోసం చేస్తున్నారనీ, వాటి ఆటలు కటిస్తామని హెచ్చరించారు. ఎవరూ అలాంటి మోసగాళ్ల బారిన పడొద్దని కోరారు. మంగళవారంనాడాయన ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి మెడికల్ బోర్డు పేరుతో కొందరు వ్యక్తులు ఉద్యోగులను మోసం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. తమ మెడికల్ బోర్డుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అక్రమాలకు ఉద్యోగులే పాల్పడితే వారిని సర్వీస్ నుంచే తొలగిస్తామని హెచ్చ రించారు. సంస్థ విజిలెన్స్ విభాగం కూడా మెడికల్ బోర్డుపై నిఘా ఉంచుతుందన్నారు. సంస్థలోని కార్మికులను అన్‌ఫిట్ చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే, వారి సమాచారాన్ని ఏసీబీ దృష్టికి తీసుకురావాలని కోరారు. పారదర్శకంగా సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

రాముడు అందరివాడు : వీహెచ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీరాముడు అందరివాడనీ, అయితే బీజేపీ ఆ రామున్ని కేవలం రాజకీయాల కోసం వాడుకుంటున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అస్సోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ రాహుల్ గాంధీని రావణుడంటూ వ్యాఖ్యానించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ మాటలు ముఖ్యమంత్రి స్థాయికి తగవని హితవు పలికారు. మణిపూర్‌లో వందల మంది మహిళలు చనిపోతే వెళ్లని మోడీ రాముడా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న భద్రాద్రి ఆలయానికి ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని వీహెచ్ ప్రశ్నించారు.

జార్ఖండ్ సీఎంకు మళ్లీ సమన్లు

రాంచీ : మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. స్టేట్‌మెంటును రికార్డు చేసేందుకు వీలుగా ఈ నెల 27-31 తేదీల మధ్య హాజరు కావాలని సూచించింది. రాంచీలోని 7.16 ఎకరాల భూమిపై యాజమాన్యానికి సంబంధించి ఈ కేసు నమోదైంది. సైన్యానికి చెందిన భూమిని చట్టవిరుద్ధంగా విక్రయించారని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్ట్ చేశారు. సొరేన్‌ను ఈడీ అధికారులు శనివారం ఆయన నివాసంలో ఏడు గంటల పాటు ప్రశ్నించారు. అంతకుముందు ఈడీ ఏడుసార్లు సమన్లు జారీ చేసినప్పటికీ సొరేన్ స్పందించలేదు. ఎనిమిదో సారి సమన్లు జారీ చేసినప్పుడు మాత్రం విచారణకు హాజరయ్యేందుకు అంగీకరించారు. తన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సొరేన్ ఆరోపించారు. 'మీ మద్దతుతో, గిరిజనుల ఆశీర్వాదంతో ఓ ఆదివాసీ వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు. బీజేపీ నాయకులు రాజకీయంగా నన్ను ఏమీ చేయలేరు. అందువల్ల తెరచాటున ఇలాంటివన్నీ చేస్తున్నారు. ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఎవరు ప్రయత్నించినా వారికి భంగపాటు తప్పదు' అని ఆయన విలేకరులతో అన్నారు.

వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణిలో సీఐటీయూ నేతల వినతిపత్రాల సమర్పణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఎంపిహెచ్ఏ ఫిమేల్ (ఏఎన్ఎం) సర్వీసులను క్రమబద్ధీకరించాలనీ, గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరారు.అలాగే గతంలో పెరిగిన జీతభత్యాల బకాయిలను కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు అటానమస్ హోదాను రద్దుచేసి ప్రభుత్వంలో కలపాలని, 010 హెడ్ కింద వేతనాలు, హెల్త్ కార్డులివ్వాలని పేర్కొన్నారు. కాలయాపన చేయకుండా మొత్తం నర్సింగ్ క్యాడర్‌కు వెంటనే పదోన్నతులు కల్పించాలనీ, 317 జీవో అమలు విషయంలో ఉద్యోగుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎఫ్‌డీహెచ్ఎస్ సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలనీ, వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, స్వీపర్ , సెక్యూరిటీ సర్వీస్‌లలో ఉన్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.15,600 అమలు చేయాలని ప్రత్యేకంగా కోరారు. కాంట్రాక్టర్లు రూ.10 వేల నుంచి రూ.11 వేల వరకు మాత్రమే ఇచ్చి దోపిడీ చేస్తున్నారని వివరించారు. కార్మిక చట్టాల ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సౌకర్యాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 17 వేల మంది కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని వినతిపత్రం అందజేశారు. ఇందులో గత పీఆర్సీలో అన్యాయం జరిగిన కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్లు, నాలుగో తరగతి సిబ్బందికి వెంటనే పీఆర్సీ అమలు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, పర్మినెంట్ ఉద్యోగుల కనీస బేసిక్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగులైన ఎంపీహెచ్ఏ ఫిమేల్ ఏఎన్ఎంలకు గత 20 ఏండ్లుగా పదోన్నతులు కల్పించకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తక్షణమే ప్రమోషన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 108లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలని, ఆరోగ్యశ్రీ సిబ్బందికి క్యాడర్ చేంజ్ చేసి పీఆర్సీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జీతబత్యాలు ఇవ్వాలని పేర్కొన్నారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల నుంచి నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఇతర పారామెడికల్ సిబ్బంది హాజరయ్యారు. యూనియన్ హైదరాబాద్ అధ్యక్షులు కుమారస్వామి, రాష్ట్ర నాయకులు భూలక్ష్మి, మరియమ్మ సువర్ణ లత, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించండి
అవినీతిపై విచారణ జరిపించండి
ప్రజావాణిలో ఆస్పత్రి స్వీపర్ ఫిర్యాదు

సుల్తాన్ బజార్ ప్రసూతి ఆస్పత్రిలో పని చేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించడంతో పాటు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి అవినీతిపై విచారణ జరిపించాలని ఆ ఆస్పత్రిలో పని చేస్తున్న స్వీపర్ ఎస్.ఏ.అన్వర్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 1992 నుంచి స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న తాను అందరి మన్ననలు అందుకున్నానని తెలిపారు. అయితే 2018లో సూపరింటెండెంట్‌గా రాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించాక తన ప్రాథమిక హక్కులైన జీతం, ఇంక్రిమెంట్, సరెండర్ లీవులు జీపీఎఫ్ వంటివి ఉద్దేశపూర్వకంగా ఆపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎల్, సీఎల్‌లను తగ్గించి వేధించిందని ఫిర్యాదు చేశారు.

2018 జూలైలో ఆమె బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆస్పత్రిలో అవినీతి తారాస్థాయికి చేరిందనీ, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది ద్వారా పేద రోగుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నదన్న ఆరోపణలతో విజిలెన్స్ విచారణ జరిపిందని గుర్తుచేశారు. ఆపరేషన్ థియేటర్ నుంచి రెగ్యులర్ ఉద్యోగులను పూర్తిగా తొలగించిన ఆమె వైద్యనిబంధనల మేరకు కనీసం ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ లేని పారిశుధ్య కార్మికులను అక్కడ పని చేయిస్తున్నదని తెలిపారు. పేద రోగుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు రెగ్యులర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ప్రయివేటు ఉద్యోగులను ఆమె ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. మెమోలు, ఛార్జ్ మెమోలు రెగ్యులర్‌గా ఇస్తూ ఉద్యోగులకు కనీస గౌరవం లేకుండా చేస్తున్నదని తెలిపారు. ఇదే విషయంపై గతంలో వైద్యారోగ్యశాఖ మాజీ కార్యదర్శి రిజ్వీతో పాటు మాజీ డీఎంఈ డాక్టర్ కె.రమేశ్ రెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని తెలిపారు.

పరిష్కరించకుంటే... కుటుంబమంతా ఆకలిచావులే

ఇప్పటికే తాను ఆర్థికంగా, మానసికంగా చితికిపోయాననీ, తనపై ఆరుగురు ఆధారపడి ఉన్నారనీ, ఈ సమస్యను పరిష్కరించకుంటే కుటుంబమంతా ఆకలిచావులకు గురవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో నుంచి తన పేరును తొలగించారనీ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సూర్యప్రకాశ్, ఇన్‌వార్డ్ సెక్షన్ క్లర్క్ ఎ.ఎస్.కిరణ్ కుమార్ తన దరఖాస్తును తీసుకునేందుకు నిరాకరిస్తున్నారనీ, ఇది తనకు చాలా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,050	-	---
22 క్యారెట్లు	57,800	-	---
కిలో వెండి	76,500	▼	500



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	87
రిటైల్ (లైవ్)	రూ.	109
స్కిన్‌తో	రూ.	158
స్కిన్‌లెస్	రూ.	180

మున్సిపల్స్‌లో అవిశ్వాసాల పర్వం
భువనగిరి, నేరేడుచర్లలో నెగ్గిన తీర్మానాలు

చిమిర్యాల ప్రాథమిక సహకార సంఘంలోనూ..
- పదవులు కోల్పోయిన చైర్మెన్, వైస్ చైర్మెన్స్



నవతెలంగాణ-భువనగిరి/నేరేడుచర్ల

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవిశ్వాస తీర్మానాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాల్టీల్లో అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. అలాగే, కోదాడ మండలం చిమిర్యాల ప్రాథమిక సహకార సంఘంలోనూ అవిశ్వాసం నెగ్గింది. దాంతో చైర్మెన్, వైస్ చైర్మెన్లు పదవులు కోల్పోయారు.

భువనగిరి పురపాలక సంఘం చైర్మెన్ ఏ.ఆంజనేయులు, వైస్ చైర్మెన్ చింతల కృష్ణయ్య అవిశ్వాసంలో పదవులు కోల్పోయారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం భువనగిరి పురపాలక సంఘ కార్యాలయంలో ఆర్డీఓ పి. అమరేందర్ ప్రిసైడింగ్ అధికారిగా అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ మొత్తం 36 మంది కౌన్సిల్ సభ్యులు ఉన్నారు. ఈ సమావేశంలో అవసరమైన కోరం మొత్తం సభ్యులలో 24 మంది హాజరుకావాల్సి ఉండగా, 31 మంది సభ్యులు హాజరయ్యారు. చైర్మెన్ ఏ.ఆంజనేయులు, వైస్ చైర్మెన్ చింతల కృష్ణయ్యకు వ్యతిరేకంగా 31 మంది ఓటేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు 2/3 వంతు సభ్యులు 24 మంది ఓటేసినా సరిపోతుంది. దీంతో చైర్మెన్, వైస్‌చైర్మెన్‌కు వ్యతిరేకంగా పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రకటించారు. భువనగిరి మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాసం నెగ్గడం ద్వారా నియంత, ఏకపక్ష, అగౌరవ పాలనకు తెరపడిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్ కుమార్ అన్నారు. అవిశ్వాస తీర్మానం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగు ఏండ్లుగా భువనగిరి పట్టణం అనేక విధాలుగా నష్టపోయిందన్నారు. నూతన మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లఎంపిక కూడా ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా జరుగుతుందన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి సహకరించిన అఖిల పక్షాల కౌన్సిలర్లు, భువనగిరి ప్రజలు, అధికారులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ చైర్మెన్ చందమల్ల జయబాబుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినటు హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ప్రిసిడెంగ్ ఆఫీసర్‌గా ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ నీలికొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానం సమావేశానికి 13 మంది సభ్యులు హాజరయ్యారు. మొత్తం 16 మంది ఉండగా, వైస్‌చైర్మెన్ చల్లా శ్రీలతరెడ్డి తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, శేరి సుభాష్‌రెడ్డి, చైర్మెన్ చందమల్ల జయబాబు గైర్హాజరయ్యారు. వచ్చిన 13 మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతు పలకడంతో తీర్మానం నెగ్గినట్టు ఆర్డీఓ ప్రకటించారు. బీఆర్ఎస్ విప్ జారీ చేసినప్పటికీ ఆ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు లలితా భరత్, వేమూరి నాగవేణి, తాళ్లూరి సాయిరాం, సీపీఐ(ఎం)కు చెందిన కొదమగుండ్ల సరిత, కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు పలికారు.

కోదాడ మండలంలోని చిమిర్యాల ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ ముత్తవరపు రమేశ్, వైస్ చైర్మెన్ గుడి పుష్పావతిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సొసైటీలో 13 మంది సభ్యులు ఉన్నారు. చైర్మెన్, వైస్‌చైర్మెన్ సమావేశానికి గైర్హాజరయ్యారు. 11 మంది సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల అధికారి అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా 11 మంది సభ్యులు చేతులెత్తి ఆమోదించడంతో అవిశ్వాసం నెగ్గింది.



సాగర్ ఎడమ కాలువకు నీరివ్వండి
- పంటలను కాపాడండి : రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి
- రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ- మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో రైతులు వరి నాట్లు వేసుకున్నారని చెప్పారు. సాగునీరు విడుదల అవుతుందని కొందరు, బోర్లు.. బావుల కింద మరికొందరు రైతులు వరి నాట్లు వేసుకున్నారని, ఇప్పుడు భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు బావులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు లేక వాగులు, చెరువులు కూడా ఎండిపోయాయని, దీంతో సాగు, తాగునీటి కరువు ఏర్పడిందని అన్నారు.

జిల్లాలో 30శాతం మేరకు రైతులు వరి నాట్లు వేసుకున్నారని, పంట పొలాలు పొట్ట దశలకు చేరుకున్నాయని అన్నారు. ఇప్పుడు నీరు అందక పైర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 520 అడుగుల నీటిమట్టం ఉందని, 15 టీఎంసీ నీటిని వాడుకోవడానికి అవకాశం ఉందని, పది రోజులపాటు ఎడమ కాలువ నీటిని విడుదల చేసి చెరువులు కుంటలు నింపి భూగర్భ జలాలను పెంపొందించాలని కోరారు. దాని ఫలితంగా పంట పొలాలు కూడా చేతికి వస్తాయన్నారు. అవసరమైతే కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి నీటిని తెప్పించుకొని పంట పొలాలను కాపాడాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీష్ చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి రవి నాయక్ డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి రేమిడాల పరశురాములు, వినోద్ నాయక్, శశిధర్ రెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, పగిడోజు రామ్మూర్తి, కంచర్ల ఊర్మిల, గోలి వెంకట్ రెడ్డి, పోలేపల్లి గోవింద్ రెడ్డి, సిహెచ్ సైదమ్మ, గాయం వీరారెడ్డి, కోడిరెక్క మల్లయ్య, పాపా నాయక్, పిల్లుట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ, రైల్వేలైన్ సాధనకు ఉద్యమిద్దాం..
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ను పునరుద్ధరించేందుకు సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి అధ్యక్షతన మంగళవారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి స్థానిక యాదవ సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు, విమానాశ్రయ నిర్మాణం కోసం 2024 బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు అందరం కలిసి పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామన్నారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని తీర్మానించారు. ఉద్యమానికి అవసరమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో సీసీఐని తెరిపిస్తామని లబ్ధిపొందిన బీజేపీ అనంతరం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసేసిన పరిశ్రమను తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ ఏండ్లుగా సర్వేలోనే మగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రలో విమానాశ్రయ నిర్మాణానికి అన్ని అనుకూలతలూ ఉన్నాయని, 369 ఎకరాల భూమి కూడా ఉందని గుర్తుచేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా పత్తి పంటకు పేరుగాంచిన జిల్లాలో కాటన్ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలని, గిరిజనులు ఎక్కువగా ఉన్నందున ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వీటిని సాధించడమే ధ్యేయంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. దీనికిగాను ఆదిలాబాద్ అభివృద్ధి సాధన పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడి, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవరెడ్డి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు నంది రామయ్య టీఎన్‌జీఓ నాయకుడు సంద అశోక్, వివిధ ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు బొజ్జ ఆశన్న, లోకారి పోశెట్టి, రూపేష్‌రెడ్డి, కొండ రమేష్, అంబకంటి అశోక్, బి.రాహుల్, జగన్‌సింగ్, మనోజ్ పాల్గొన్నారు.

31 నుంచి సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు

హాజరుకానున్న బీవీ.రాఘవులు, తపన్ సేన్

వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు మహా ప్రదర్శన, బహిరంగ సభ

వెల్లడించిన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హన్మకొండలోని బాలవికాస్‌లో నిర్వహించ నున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. మంగళవారం హన్మకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటిసారి పోరాటాల గడ్డ హన్మకొండలో మొదటిసారి నిర్వహిస్తున్న జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలను జిల్లా కార్మికవర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గడిచిన పదేండ్లలో బీజేపీ అవలంబించిన విధానాలపై సమావేశాల్లో చర్చించనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోతుందని, చేద్దామంటే పని దొరకడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా ప్రభుత్వ రంగం మొత్తం ధ్వంసమైందని విమర్శించారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాల్సిన బీజేపీ.. సంఘ్ పరివార్ సహకారంతో గడిచిన పదేండ్లలో విద్వేష, మత రాజకీయాలను ప్రేరేపిస్తుండటంతో దేశ ప్రగతి అన్ని రంగాల్లో తిరోగమిస్తుందన్నారు. విదేశీ, స్వదేశీ, బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తూ 8 గంటల పని విధానానికి మంగళం పాడి 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. కనీస వేతనాల కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటాలు చేస్తుంటే ప్రధాని మాత్రం పెట్టుబడిదారులకు అనుగుణంగా ఒకరోజు ఫ్లోర్ లెవెల్ వేతనం రూ.178లుగా నిర్ణయించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం, దేశ ప్రజానీకం అనుసరించాల్సిన ఎత్తుగడలను ఈ వర్కింగ్ కమిటీ సమావేశాల్లో చర్చించనున్నట్టు తెలిపారు. వర్కింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా జనవరి 31న వేలాది మందితో కార్మిక మహా ప్రదర్శన, పబ్లిక్ గార్డెన్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, రాగుల రమేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు టి.ఉప్పలయ్య, కాసు మాధవి, గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, జిల్లా ఆఫీస్ బ్యారర్స్ బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి, పుల్ల అశోక్, ఎస్.రజిత తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో నకిలీ ఇక్కత్ చీరలు
- చేనేత షోరూంలలో విజిలెన్స్ దాడులు
- నకిలీ ఇక్కత్ వస్త్రాలు అమ్మితే కఠిన చర్యలు : డిప్యూటీ డైరెక్టర్ స్టేట్ లెవెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం. వెంకటేశం



నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

చేనేత వస్త్రాలకు, ఇక్కత్ చీరలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భూదాన్ పోచంపల్లిలో నకిలీ ఇక్కత్ చీరలు అమ్ముతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం చేనేత షోరూంలలో సోదాలు చేశారు. కొంతమంది వస్త్ర వ్యాపారులు అసలు స్థానంలో.. నకిలీ ఇక్కత్ వస్త్రాలను విక్రయిస్తూ పోచంపల్లి ఇక్కత్ చేనేతకు చెడ్డపేరు తెస్తున్నారంటూ ట్రేడ్ అసోసియేషన్ చేసిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో యాదాద్రి జిల్లా సహాయ సంచాలకులు విద్యాసాగర్, ఏడి జయరాజ్, డివోలు ప్రసాద్, ప్రవీణ్, సంధ్య, ఏడిఓలు అనిల్, సాయి, షకీల్ ఉన్నారు. 28 షాపులను సీజ్ చేసినట్టు తెలిపారు. చేనేతలోని ప్రింటెడ్ మరమగ్గాలపై తయారు చేస్తున్న చేనేత వస్త్రాలను స్వాధీన పరుచుకుని 12 షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. చేనేత పరిరక్షణ చట్టం సెక్షన్ 6 ప్రకారం నోటీసులు జారీ చేశామని వెంకటేశం తెలిపారు. చేనేత షోరూంలలో తనిఖీ చేసే సమయంలో కొంతమంది వ్యాపారులు నకిలీ వస్త్రాలను విక్రయిస్తున్నట్టు తేలిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసే ముందు హ్యాండ్లూమ్ ఇక్కత్ మార్క్, చేనేత సిల్క్ మార్క్ ఇండియా హ్యాండ్లూమ్ బ్రాండ్ కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి
- మంత్రి తుమ్మలను కలిసిన కేంద్ర కార్మిక సంఘాల నాయకులు



నవతెలంగాణ- ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని 106(1)(2) రద్దు చేసి మోటార్ రంగ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎంటీడీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టం మూలంగా లక్షలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఒకవేళ డ్రైవర్‌కు శిక్ష పడితే కుటుంబానికి దూరం కావాల్సి వస్తుందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా కట్టే పరిస్థితే ఉంటే డ్రైవర్‌గా ఉండాల్సిన అవసరం లేదన్నారు. డ్రైవర్ల కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ఈ చట్టంపై పునరాలోచన చేసి రద్దు చేయాలని కోరారు. డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) జిల్లా అధ్యక్షులు సీహెచ్ విప్లవ్ కుమార్, ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షులు రావుల శ్రీను, ఆటో యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీనివాస్, టీఎంటీడీయూ జిల్లా అధ్యక్షులు పేరుగు బిక్షం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- మేడ్చల్ జెడ్పీలో ప్రశ్నల వర్షం
- సమాధానం చెప్పలేకపోయిన అధికారులు
- జెడ్పీటీసీలు, ఎంపీపీల అసహనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికారులపై ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిగిన ప్రశ్నలకు అధికారుల వద్ద సరైన సమాధానం, సమాచారం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన మేడ్చల్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా శాఖలపై నివేదకలు సమర్పించారు. ఈ సమయంలో సభ్యులు ప్రశ్నలు వేశారు.

విద్య, వైద్య, విద్యుత్, గ్రామ పంచాయతీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా సమావేశానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ అధికారులు రఘునాథస్వామి, రమణ మూర్తి సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడ్డారు. పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయని, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీపీలకు నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని నిలదీశారు. జీపీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదని సభ్యులు ప్రశ్నించారు.

పేదల వద్ద ట్యాక్స్ వసూలు చేస్తున్న అధికారులు కమర్షియల్ ట్యాక్స్ ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత ఉందని, పీసీహెచ్‌సీలు సకాలంలో వైద్యం అందించడం లేదని సభ్యులు అన్నారు. వైద్యులు, సిబ్బంది పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయి..? సర్కార్‌కు నివేదించారా..? అని డీఎంఅండ్‌హెచ్‌ఓను నిలదీశారు. వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, ప్రయివేటు హాస్పిటల్స్‌ను అదుపు చేయడంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రశ్నలన్నింటికీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్ యుద్ధం అమెరికాకు వ్యాపారం : లవ్రోవ్



న్యూయార్క్ : ఈ మధ్య కాలంలో అమెరికా ప్రకటనలను చూస్తుంటే ఉక్రెయిన్ యుద్ధాన్ని అమెరికా 'లాభసాటి వ్యాపారం'గా చూస్తున్నట్టు అనిపిస్తోందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి తెలిపారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి అంటోనీ బ్లింకెన్ చేసిన ప్రకటనలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కేటాయించిన నిధుల్లో 90శాతం తిరిగి అమెరికా వ్యాపార వర్గాలకు చేరుతోందని, అది అమెరికా రక్షణ పరిశ్రమ పునాదిని పటిష్టపరుస్తుందని అమెరికా విదేశాంగ కార్యదర్శి అంటోనీ బ్లింకెన్ గత నెలలో అన్నాడు.

ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న నిధులను ప్రధానంగా నూతన ఆయుధాల రూపకల్పనకు వాడుతూ, తమ వద్ద నిల్వవున్న ఆయుధాలను ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తున్నారని 2023 నవంబరులో వాషింగ్టన్ పోస్టు రాసింది. అంటే కాలంచెల్లిన ఆయుధాలను ఉక్రెయిన్‌కు సరఫరా చేసి ఆమోదింపబడిన నిధులను నూతన ఆయుధాలను అభివృద్ధికి ప్రయివేటు కంపెనీలకు కేటాయించటం జరుగుతోందని లవ్రోవ్ తెలిపారు. అంతేకాకుండా ఉక్రెయిన్‌లోని సారవంతమైన భూమిని, లిథియంవంటి ఖనిజాలను అమెరికా కైవశం చేసుకుంటోందని తెలిపారు. ఒకవైపు వేలమంది యుద్ధంలో చనిపోతుంటే యుద్ధాన్ని వ్యాపారంగా చూడటం అమెరికాకు మాత్రమే చెల్లుతుందని లవ్రోవ్ విచారం వ్యక్తంచేశారు.

హమాస్ యోధుల్లో 20శాతం మంది అమరులయ్యారు!

ప్రపంచ గమనం



గాజాలో పోరాడుతున్న హమస్ యోధుల్లో 20శాతం మందినే ఇప్పటివరకు ఇజ్రాయిల్ హతమార్చగలిగిందని అమెరికా గూఢచార వర్గాలు అంచనా వేశాయని వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక రాసింది. అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయిల్ పైన దాడి తర్వాత.. ఇజ్రాయిల్ హమస్‌ను అంతం చేయాలన్న లక్ష్యంతో యుద్ధ చేస్తోంది. హమస్‌లో 25 వేల నుంచి 30 వేలదాకా మిలిటెంట్లు ఉన్నారనీ, వీరితోపాటు అనేక వేలమంది గాజాలో పోలీసులుగా ఉన్నారని అమెరికా ఒక రహస్య నివేదికను తయారుచేసింది. ఇజ్రాయిలీ గూఢచార సమాచారం ఆధారంగా అమెరికా ఈ అంచనా వేసిందని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఐదు-పది వేల మధ్యలో హమస్ మిలిటెంట్లు చనిపోవటంతోపాటుగా, పది లేక పదకొండు వేల హమస్ యోధులు గాయపడ్డారని ఒక అమెరికా అధికారి వాల్ స్ట్రీట్ జర్నల్‌కు చెప్పాడు. చనిపోయిన వారి బాధ్యతలను చేపట్టవలసిన అవసరం ఏర్పడినందున మిగిలిన వాళ్ళకు పనిభారం ఎక్కువైందని జనరల్ జోసెఫ్ వోటెల్ అనే విశ్రాంత సైనికాధికారి అంచనా. 2007నుంచి గాజాను పాలిస్తున్న హమస్ కు అనేక నెలలపాటు ఇజ్రాయిల్ పైన దాడిచేయగలిగిన సాయుధ సామర్ధ్యం ఉంది. ఇజ్రాయిల్ అంచనాల ప్రకారం కూడా హమస్ కు 30వేల మంది మిలిటెంట్ ఫోర్స్ ఉంది. వీరిలో 10వేలమంది హతులయ్యారని, 16వేల మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ అంటోంది. గత మూడు నెలలుగా గాజాపైన అవిశ్రాంతంగా ఇజ్రాయిల్ కురిపిస్తున్న బాంబుల వర్షం హమస్ ను అంతం చేయలేకపోయిందని అమెరికా ఒప్పుకుంటోంది.

ఎస్ఎంసీ ఎన్నికలు నిలిపివేత
- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిర్వహించొద్దు
- డీఈవోలకు విద్యాశాఖ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికలను ప్రభుత్వం నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించొద్దని జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో)కు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఎంసీల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈనెల 20న జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 29న ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్ఎంసీల సభ్యులకు ఎన్నికలుంటాయని ప్రకటించిన సంగతి విదితమే. తాజాగా ఎస్ఎంసీ ఎన్నికలను నిలిపి వేయాలని ఆదేశాలివ్వడం గమనార్హం. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఎస్ఎంఎస్‌లను నియమించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2019, నవంబర్ 30న చివరి సారిగా ఎస్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించింది. వాటి కాలపరిమితి రెండేండ్లు ఉంటుంది. గడువు ముగిసినా ఆ కమిటీలను రెండుసార్లు ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. అయితే గతేడాది డిసెంబర్ 31 వరకు ఎస్ఎంసీల పదవీకాలాన్ని పొడిగించింది. అయితే ప్రస్తుతం ఉన్న ఎస్ఎంసీలను రద్దు చేస్తున్నట్టు శ్రీదేవసేన ప్రకటించారు. ఈ ఆదేశాలను అమలు చేయాలంటూ ఎంఈవో, హెచ్‌ఎంలకు తగిన నిబంధనలు జారీ చేయాలని డీఈవోలను ఆదేశించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇక ఎస్ఎంసీలు లేవు.

అక్కాతమ్ముడు ఆత్మహత్య

నవతెలంగాణ-రాజేంద్రనగర్

వరసకు అక్కా తమ్ముడు అయ్యే ఒక వివాహిత, యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లాకు చెందిన సోమయ్య చామంతి(26) భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు కోసం రాజేంద్రనగర్‌లోని కేశవ్ నగర్ కాలనీలో పదేండ్ల క్రితం వచ్చి ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా, చామంతి దూరపు బంధువు వరసకు తమ్ముడయ్యే సోమశేఖర్ (25) డిగ్రీ పూర్తి చేసి రాజేంద్రనగర్‌లోని తన పెద్ద బావ ఇంట్లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం చామంతి ఇంటికి వచ్చిన సోమశేఖర్ సాయంత్రమైనా వారు ఎవరి రూమ్‌ల నుంచీ బయటకు రాలేదు. పిల్లలు పలుమార్లు అమ్మ అని పిలిచినా తలుపులు తెరవకపోవడంతో స్థానికులు వచ్చి కిటికీలో నుంచి చూడగా వేరువేరు గదుల్లో చామంతి, సోమశేఖర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న దృశ్యం కనిపించింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

షణ్ముఖ కుటుంబానికి

హర్యానా గవర్నర్ పరామర్శ



నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ ప్రభాత్ నగర్ కాలనీలో నివాసముండే ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు షణ్ముఖ ఇటీవల పరమావధించారు. విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మంగళవారం స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తతో కలిసి షణ్ముఖ కుటుంబాన్ని పరామర్శించారు.

రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన బొక్క నర్సింహారెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొలన్ శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూలమాల, శాలువాలతో సన్మా నించి..ప్రత్యేక శుభాకాంక్షలు తెలి పారు. ఆయన వెంట బీజేపీ నాయ కులు ఎం. ప్రభాకర్ రెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి ఉన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్

ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) హైదరాబాద్ నగర 2024 క్యాలెండర్‌ను యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పట్ల నిరంతరం పోరాడుతున్నదన్నారు. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 104 ఉద్యోగులు, అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యల పట్ల నిరంతర పోరాటం చేసి సమ్మెలోకి కూడా వెళ్లగా.. ప్రభుత్వం దిగివచ్చి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీని కూడా నియమించినట్టు గుర్తు చేశారు. ఈ ఏడాదికొత్త ప్రభుత్వం హయాంలోనైనా వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు- రెగ్యులరైజేషన్, వేతనాల పెంపుదల, 104 ఉద్యోగుల వేతనాలు పెంపుదల, వైద్య విధాన పరిషత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలన్నింటి కోసం పని చేయడం యూనియన్ ముందున్న ప్రస్తుత కర్తవ్యం అన్నారు. ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా యూనియన్ పని చేయాలన్నారు. లేదంటే ఉద్యోగుల సమస్యల పట్ల పోరాటానికి సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఫసియుద్దిన్,, రాష్ట్ర ఉపాధ్యక్షులు బలరాం, రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియమ్మ, రాష్ట్ర కోశాధికారి కవిత, నగర అధ్యక్షులు కుమారస్వామి, నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నగర నాయకులు దైవమని, రాజేశ్వరి రమ, 104 ఉద్యోగుల రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన నిధులు నిలిపేయడం దారుణం

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రూ.175 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేస్తే..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఫండ్‌ను నిలిపి వేయడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో 45 కోట్ల రూపాయల నిధులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని అన్నారు. వెంటనే ఆ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

ఎన్నికలకు ముందు కేసీఆర్ రూ.25 కోట్లను జల్‌పల్లి మున్సిపాలిటీకి మంజూరు చేస్తే.. వాటిని నిలిపివేశారని మండిపడ్డారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో పూర్తిగా పేదవారు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రాంత ప్రజలపై అభిమానం ఉంటే, వెంటనే ఆ నిధులను విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్లు, వాటర్ లైన్లు వేస్తున్నట్లు వాటి పురోగతిపై సమీక్షించారు. అవసరం ఉన్న దగ్గర బోర్ల రిపేర్లు కూడా చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలో అధికారులు ప్రజా పాలన దరఖాస్తులపై దృష్టి పెట్టడటంతో..కాలనీల్లో చెత్తా చెదారం నిండిపోయిందని అన్నారు. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు, కౌన్సిలర్ల సహకారంతో స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చాలన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ అబ్దుల్లా సాధి, వైస్ చైర్మన్ ఫర్హా నాజ్, కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'జైపూర్ కాలనీ' ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ - నాగోల్

నాగోలు డివిజన్‌లోని జైపూర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంట్లూరులోని సత్తుపల్లి గ్రామంలో జైపూర్ కాలనీ యువకులకు మంగళవారం జేపీసీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగోలు డివిజన్ బీఆర్ఎస్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శిల్పారెడ్డి, డిపి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామల యాదగిరి, జనరల్ సెక్రెటరీ రాహుల్ పోతాని, నాగోల్ డివిజన్ వార్డ్ మెంబర్ గుమ్మడి వెంకట్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివకుమార్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ కస్తూరి అశోక్, కోయల్ కార్ యాదిలాల్ రవి కులకర్ణి, అసోసియేషన్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ బోర్డులో ఎన్నికలు



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్గుల్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల యంవీయస్సార్, సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యపు సొసైటీ మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ బోర్డులో మంగళవారం ఎన్నికలు జరిగాయి. దీంట్లో పీ.వి.ఆర్. కశ్యప్ చైర్మన్‌గా, రెండు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేసిన డా.కే.పి. శ్రీనివాస్ రావు సెక్రెటరీగా, కోశాధికారిగా జూపూడి సుధాకర్, ఉపాధ్యక్షులుగా డా.కె.సీతారామ్ బాబు, యం.కృష్ణకుమార్, సహాకార్యదర్శులుగా యం.వాసుదేవరావు, ఆర్. పార్థసారథిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్ పీ.వి.ఆర్. కశ్యప్ భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావు మనుమడు(స్వర్గీయ పీవీ రాజేశ్వరరావు కుమారుడు). 16 మంది సొసైటీ సభ్యులు కలిసి కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా మాతృశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.హన్మంతరావు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సొసైటీ సభ్యులు టి.జితేంద్రనాథ్, డా.రాధాకిషన్ రావు, పవన్ కుమార్, కె.ఉమాదేవి, ఏ.వసంత్ కుమార్, కె.హిరణ్మయి, యం.సాగరిక, కె.వెంకటేశ్వరగుప్త, యంబీయస్ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యస్జీయస్ మూర్తీ, డీన్ ప్లేస్మెంట్స్ అండ్ అడ్మిషన్స్ ప్రొ.ప్రసన్నకుమార్, హెచ్ఓడీలు, పిఆర్.ఓ. జనార్దన్‌లు అభినందించారు.

20 దేశాలలో ఐవీఎఫ్ సేవలు



- అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్

నవతెలంగాణ -నాగోల్

ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ వైశ్య ప్రదర్శన 20 దేశాలలో ఎన్నో సేవా కార్యక్రమాలను అందిస్తుందని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, హైస్టే హెూటల్ లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఐవీఎఫ్ తెలంగాణ సౌత్ ఇండియా మేనేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, చైర్మన్ అడ్వైసరి బోర్డ్ సెంట్రల్ కమిటీ న్యూఢిల్లీ గంజి రాజమౌళి గుప్త, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్-ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అంతర్జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో 20 దేశాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ప్రిలిమినరీ పాస్ అయి, ఐఎఎస్ చదువుతున్న పేద ఆర్యవైశ్యులకు ఇప్పటికే 26 మందికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేసినట్టు తెలిపారు. 33 జిల్లాల్లో పేద వైశ్యులకు చదువుకోవడానికి ఆర్థికంగా ఎదగడానికి ఐవీఎఫ్ ముందుంటుందని ఐవీఎఫ్ చైర్మన్ అడ్వైసరి బోర్డ్ సెంట్రల్ కమిటీ న్యూఢిల్లీ గంజి రాజమౌళి గుప్తా అన్నారు. అదేవిధంగా ముషీరాబాద్ వైశ్య హాస్టల్లో పేద, మెరిట్ వైశ్య స్టూడెంట్స్ కోసం ఫ్రీ అకామిడేషన్, ఫుడ్ ఉంటుందన్నారు.

అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ... దేశంలో ఉన్న 16 కోట్ల మంది వైశ్యులందరినీ ఒక తాటిపైకి తీసుకురావడానికి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ముందుంటుందని అన్నారు. వ్యాపార, ఉద్యోగం, రాజకీయం, సేవా పరంగా వైశ్యులందరినీ ముందుకు తీసుకురావడానికి అన్ని పార్టీలలో సముచిత స్థానం కల్పించడానికి ఐవీఎఫ్ ముందుంటుందని వివరించారు. 33 జిల్లాల్లో ఐవీఎఫ్‌ను బలోపేతం చేసేందుకు నాయకులు, యువత సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడప గడపకూ తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో ఐవీఎఫ్ మహిళా విభాగం ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, రాష్ట్ర నాయకులు గంగిశెట్టి రఘు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, తెలంగాణలోని 33 జిల్లాలకు సంబంధించిన అన్ని విభాగాలు, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ, అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, డివిజన్ కమిటీ, మండల కమిటీ, యూత్ కమిటీ మహిళా కమిటీ, సభ్యులు హాజరయ్యారు.

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక బదిలీ

నవతెలంగాణ - చైతన్యపురి



చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జునను ఆకస్మికంగా రాచకొండ సీపీ సుధీర్ బాబు మల్టీజోన్-2కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసులో నిందితుడి నుండి రూ.మూడు లక్షలు లంచం తీసుకుంటూ చైతన్యపురి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే ముగ్గురు కానిస్టేబుల్స్ ఏసీబీకి పట్టుపడ్డారు. ఈ క్రమంలో ఆ ముగ్గురి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ సంఘటనతో కంగుతిన్న పోలీస్ శాఖ వెంటనే ఇన్‌స్పెక్టర్ నాగార్జునను బదిలీ చేశారు. డీఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు గౌడ్‌కు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి



- వ్యక్తిత్వ వికాస నిపుణులు సండ్ర సుధీర్

నవతెలంగాణ - మీర్‌పేట్

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సండ్ర సుధీర్ విద్యార్థులకు సూచించారు. బాలాపూర్ చౌరస్తాలోని శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులకు పరీక్షల సమయం - విద్యార్థుల ఒత్తిడి అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్పతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు అనగానే ఒత్తిడికి గురై ఎన్నో అనారోగ్య, మానసిక సమస్యలకు గురవుతున్నారని అన్నారు. అలా జరగకుండా విద్యార్థులు ముందు నుండే టైమ్ టేబుల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాంట్లో ఎక్కువ సమయం కష్టమైన సబ్జెక్టులకు కేటాయించాలని చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రిపేర్ అయినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. అలా చదివితేనే ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడగలమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యం పెట్టుకొని దానికి అనుగుణంగా టైమ్ టేబుల్ చేసుకొని ముందుకెళ్లినప్పుడు జీవితంలో ఏదైనా సాధించగలమని, విద్యార్థులకు ఉత్తేజాన్ని నింపారని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప తెలిపారు. అనంతరం శ్రీ వాగ్దేవి కాలేజీలో 2022-23 విద్యా సంవత్సరంలో అడ్వాన్స్‌లో 272 ర్యాంకు సాధించిన వి వరుణ్ రాజేష్, 2018 ర్యాంకు సాధించిన రుచికా సింగ్, జేఈఈ మెయిన్స్ లో 613 ర్యాంకు సాధించిన ఉజ్వల్ నరసింహ, ఎంసెట్ 672 ర్యాంకు సాధించిన రాజేష్, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 440/ 437 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచిన కావ్యను, ఎంపీసీ 470/ 466 మార్కులు సాధించి స్టేట్ థర్డ్ ర్యాంకర్స్ గా నిలిచిన బి అనిరుద్ రెడ్డి ఇంకొంతమంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ బి శ్రీనివాస్ రెడ్డి, శ్రీ వాగ్దేవి జూనియర్ కాలేజ్ డైరెక్టర్స్ పోలోజు రవికుమార్, తిప్పర్తి నరసింహారెడ్డి, ఈ అభ్యాస్ అకాడమీ ఫౌండర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ భువనగిరి ఫణి పవన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -నాగోల్

తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనతుల రాజిరెడ్డి, దండు నిరంజన్, లక్ష్మణ్, మహేందర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : సునీల్



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 18వ వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కౌన్సిలర్, టీపీసీసీ కార్యదర్శి కాకుమాను సునీల్ అన్నారు. 18వ వార్డు పరిధిలోని బృందావనం కాలనీలో రూ.9లక్షల 50 వేల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డిల సహకారంతో 18వ వార్డును అభివృద్ధిలో ముందుంచుతానని హామీ ఇచ్చారు. కాలనీలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రభాకర్ రెడ్డి, గోపాల్ రావు, మల్లేష్, వెంకట్ రెడ్డి, అరవింద్, ప్రదీప్, సాగర్, దామోదర్ రావు, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పని చేయాలి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.. సమావేశానికి హాజరు కానీ అధికారులపై కలెక్టర్ రిపోర్టు చేయాలని ఎంపీడీవోకు ఆదేశం.. సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ప్రజల కోసం అధికారులు పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వసభ్య సమావేశాన్ని హయత్ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 23 ఎజెండా అంశాలతో ఎంపీపీ బుర్ర రేఖ అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరై అన్ని శాఖల అధికారుల పని తీరుపై ఆరాతీశారు. శాఖల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు, చెరువులు కుంటలు, శిఖం, ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కబ్జాలపై తగిన చర్యలు తీసుకోవాలని, ఇక నుంచి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా లోపాలు, లూజ్ వైరింగ్, ఇతర కారణంగా విద్యుత్ అంతరాయంతో గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఏదైనా అంతరాయం ఉంటే ముందే తెలియపరచాలని అన్నారు.

> **కూలీలు పనికి రావడం లేదా..! పని కల్పిస్తలేరా..?**
>
> సభలో ఉపాధి హామీ అధికారులు మాట్లాడుతూ మండలంలో 5,547 జాబ్ జార్డులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం18 గ్రామాలకు గాను ఒక్కొక్క గ్రామానికి గాను 8 మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలుపగా ఎమ్మెల్యే జోక్యం చేసుకొని..ఉపాధి హామీ పేదల కోసం తీసుకొచ్చినదని, దీని ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. గ్రామానికి 8 మందికి పని కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. కూలీలు పనికి రావడం లేదా, మీరే వారికి పని కల్పిస్తలేరా అనేది వారంలో రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు.

మీ సేవలో అదనపు పీజ్ తీసుకుంటే చర్యలు..

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మీ సేవా కేంద్రాలలో పీజ్ తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అదనంగా తీసుకుంటే తహసీల్దార్ అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో 6 మాత్రమే మీ సేవా కేంద్రాలు ఉన్నాయని, ఇంకా కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని, అలాగే యువతకు ఉపాధి కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు..

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పారదర్శకంగా పనిచేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. తిరిగి జరిగే సర్వసభ్య సమావేశంలో అదే సమస్య పునరావృతం కావద్దని అధికారులను హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీపీ రేఖ, జడ్పీటీసీ బింగిదాస్ గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో మమతా బాయి, సర్పంచులు ముద్దం స్వరూప వీరస్వామి, వనజ, లావణ్య, రాధ, పారంద సంతోష, అంతటి యశోద, శ్రీనివాస్ రెడ్డి, కరిమెల వెంకటేష్, సుధాకర్ రెడ్డి, కిరణ్ కుమార్, బుర్ర వీరస్వామి, కావలి రంగయ్య, ఎంపీటీసీలు రాచపాక లావణ్య, కేసెట్టి వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్ పాషా, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, విద్యుత్, ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, ఆర్టీసీ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతరానికి మార్గదర్శి నేతాజీ సుభాష్ చంద్రబోస్



నవతెలంగాణ- సంతోష్ నగర్

యువతరానికి స్ఫూర్తిదాత, నవతరానికి మార్గదర్శి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్ చంద్ర బోస్ 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ధర్మేంద్ర మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ జీవితం మొత్తం దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాయోధుడని కొనియాడారు. బోస్ 11 సార్లు జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రస్తుతం పాలకులు పేదలకు ఇస్తున్నటువంటి హామీల అమలుపైన ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ - హస్తినాపురం



హస్తినాపురం డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ కాలనీలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంద జయన్న ఆధ్వర్యంలో మంగళవారం స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, కాలనీ నాయకులు జైపాల్, నరసింహ, కుమార్, శ్రీనివాస్ నరసింహ, లక్ష్మన్న, సవారాన్న, దేవా, చిన్న హుస్సేన్ చెన్నయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com



తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషన్ సొసైటీ పరిధిలో ఉన్న నాచారం ఎక్స్‌రోడ్డు స్కూల్‌లో అడ్మిషన్స్, రిపబ్లిక్ డే ఇన్విటేషన్‌పై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని స్కూల్ ప్రిన్సిపాల్ సౌజన్య, టీచర్స్ మాధవిరెడ్డి, ప్రశాంతి, శారద, జ్యోతి, వినీల, కిరణ్మయి తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. - నవతెలంగాణ,కాప్రా

నేటి తరాలకు మార్గదర్శనం ఇంద్రప్రస్థం నాటకం



నవతెలంగాణ-కల్చరల్

నేటి యువత పరిచయమైన కొద్ది రోజుల్లోనే ప్రేమలో పడటం.. ఆ ప్రేమను పెద్దలు అంగీకరించక పోతే పారి పోవటమో లేదా ఆత్మహత్య చేసుకోవటమే తరచు వింటూ ఉంటాం. ఇంద్రప్రస్థం సాంఘీక నాటకం ఈ సంఘటనల ఆధారంగా నేటి పెద్దలకు, యువతకు మార్గ దర్శనం చేసేలా ప్రదర్శించారు. ఓ తండ్రి తన కొడుకు డబ్బు హోదా కలిగిన అమ్మాయితో ప్రేమలో మునిగితే ఆ అబ్బాయి తండ్రి సంతోష పడలేదు. డబ్బున్న ఆ అమ్మాయి తండ్రి కూడా తన లాంటి తండ్రేనని భావించి వారు ఎదుర్కొనే ఇబ్బందులు చెబుతూ వారిలో క్రమశిక్షణ నేర్పి ఆదర్శవంత తండ్రిగా చెప్పటమే ఈ నాటకం కథాంశం. కాగా ప్రతి నెలా టిక్కెట్ పై నాటక ప్రదర్శనను ఉద్యమంగా నిర్వహిస్తున్న ప్రముఖ నాటక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో గోపి సత్యప్రకాష్ రచించిన ఇంద్రప్రస్థం నాటకం రవీంద్రారెడ్డి దర్శకత్వంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రదర్శించారు.

'మతతత్వం మతోన్మాదం' పై సదస్సు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ ఆఫీసులో స్వాతంత్ర పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి, డాక్టర్ హెూమేజే బాబా వర్ధంతి సందర్భంగా మంగళవారం 'మతతత్వం మతోన్మాదం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి స్ఫూర్తి గ్రూపు బాధ్యులు రాజమల్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ హెూమి జే బాబా చిత్రపటానికి ఈ.నాగయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..సుభాష్ చంద్రబోస్, హెూమిజే బాబా ఇద్దరూ పోరాట యోధులని పేర్కొన్నారు. ఒకరు స్వాతంత్రం కోసం జీవితం అంకితం చేస్తే, మరొకరు దేశ పురోగతికి కృషి చేసిన గొప్ప వ్యక్తులు అని కొనియాడారు. అనంతరం స్ఫూర్తి గ్రూపు బాధ్యులు శ్రీమన్నారాయణ మతం దాని పుట్టుక, సమాజ పరిణామం, వివిధ మతాల గురించి మాట్లాడారు. భావవాదం, భౌతికవాద దృక్పథాలు ఎలా ఏర్పడాయే చెప్పారు. మతాలు పాలకవర్గాలకు ప్రయోజనాలు చేకూర్చాయని తెలిపారు. నేటి పాలకులు మతాలను పరిపాలనలో కలగలుపుతున్నారని చెప్పారు. దీనివల్ల సమాజానికి చాలా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో లౌకికతత్వం బలంగా ఉందని, దాన్ని దెబ్బ తీయటం కోసం నేడు ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలు దేశాన్ని మత ప్రాతిపదిక మీద విచ్ఛినం చేస్తున్నాయని, మతోన్మాదం ప్రజలకు హానికరమని చెప్పారు. ఈ సదస్సులో భాగంగా కోమటి రవి, జయరాజు, నాగయ్య, పి.బి చారి, శివరామ కృష్ణ, శారద ప్రసంగించారు. అనంతరం నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ హెూమీ జేబాబా చిత్రపటాలకు సభికులందరూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, జయప్రకాష్, కేకే ప్రసాద్ బాబు, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, రుక్కయ్య, ఎన్ శ్రీనివాస్, బసవ పున్నయ్య, లక్ష్మయ్య, సోమయాచారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న జరిగే కార్మిక సమ్మెను.. విజయవంతం చేయాలని సమావేశం



నవతెలంగాణ-కాప్రా

ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ కమలానగర్ ఆఫీస్‌లో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు వీఎస్. ప్రకాష్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఐఎఫ్‌టీ యూ జిల్లా అధ్యక్షులు శివబాబు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి. శ్రీనివాసులు తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ కేంద్రంలోని జాతీయ కార్మిక సంఘాలు జాయింట్ ఫ్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 2024 ఫిబ్రవరి 16వ తేదీన కార్మిక సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ..కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తయినా రైతాంగ, కార్మికవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని పేర్కొన్నారు. అచ్చే దిన్ ఆయేగా, విశ్వ గురువు, ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. నిరుదోగ్యులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిందని ఆరోపించారు. విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పించి ప్రతి ఒక్కరి అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తానని ప్రజలను మభ్యపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, యువకులు ఉద్యోగ, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. నిరుద్యోగం నేడు 50 ఏండ్ల కన్నా కనిష్ట స్థాయికి చేరిందన్నారు. కార్మికుల వేతనాలు 20శాతం పడిపోయాయని వాపోయారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పచెప్పుతున్నది ఆవేదన వ్యక్తం చేశారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలో 100శాతం వాటాలను తెగ నమ్ముతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ పాలసీ పేరు ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రయివేటీకరిస్తున్నదని పేర్కొన్నారు. ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేట్ ఇన్సూరెన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతున్నదని చెప్పారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల నడ్డి విరించిందని మండిపడ్డారు. పీఎఫ్, ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తూ 12 గంటల పని విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కాంట్రాక్టు లేబర్ విధానాన్ని అన్ని రంగాల్లో మరింత పెంచి శ్రమ దోపిడీకి గురి చేస్తున్నదని తెలిపారు. నెలకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించేందుకు బీజేపీ ప్రభుత్వం అంగీకరించకపోవడం సిగ్గుచేటన్నారు. పంటకు కనీస మద్దతు ధరను కేటాయించకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సవరణ చట్టంతో విద్యుత్‌ను ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని కోరారు. లౌకిక విలువలను పాతరేసి హిందూ రాజ్య స్థాపనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలతో రామమందిర నిర్మించి ప్రజల మనోభావాలతో రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. శ్రీనివాసు, ఉన్నికృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాలకు ఎలా అనుమతి ఇస్తారు ?

- ఐద్వా ఉప్పల్ కార్యదర్శి పల్లవి



నవతెలంగాణ ఉప్పల్

జన నివాసాల మధ్య వైన్స్ షాప్‌లకు ఎలా అనుమ తులు ఇస్తారని ఐద్వా ఉప్పల్ కార్యదర్శి పల్లవి అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ..నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అలీ కేఫ్ కు వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల చాలా కాలనీలు ఏర్పడ్డాయన్నారు. ఈ కాలనీలలో నివసించే మహిళలు జీవనోపాధి కోసం ఐడీఏ ఉప్పల్, డీ మార్ట్, ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తూ ఉంటారని పేర్కొన్నారు. పొట్టకూటి కోసం పనికి వెళ్లి వచ్చే మహిళలు ఈ దారిలో రావాలంటే భయపడుతున్నారు. వైన్స్‌కు వచ్చే తాగుబోతులతో బాటసారులు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వైన్స్‌ను అక్కడి నుంచి మరో ప్రాంతానికి మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆందోళన లు నిర్వహిస్తామని పేర్కొంటున్నారు.

ఫలించని గోవా టూర్..!

- అవిశ్వాసానికే మెజారిటీ కార్పొరేటర్ల మొగ్గు
- జక్కాకు పదవీ గండం తప్పదా?
- మాజీ మంత్రి బుజ్జగింపులకు.. నై అంటున్న కార్పొరేటర్లు
- మేయర్ అవినీతి అక్రమాలే అవిశ్వాసానికి కారణమా !



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డికి పదవీ గండం వచ్చినట్టేనా అంటే అవుననే చెప్తున్నాయి రాజకీయ సమీకరణాలు. కార్పొరేషన్‌కు చెందిన సొంత పార్టీ కార్పొరేటర్లే మేయర్ జక్కా వెంకట్ రెడ్డిని మేయర్ పీఠం నుంచి దించేందుకుగాను 16 మంది అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేసినట్టు సమాచారం. ఒకవేళ అదే నిజమైతే వారం రోజుల్లో అవిశ్వాస తీర్మానం పై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మేయర్ పదవికి ఎన్నికలు నిర్వహిస్తారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫలించని గోవా టూర్..!

మేయర్ జక్కా వెంకట్ రెడ్డిపై సొంత పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు గతం నుంచే వ్యతిరేకంగా ఉంటూ అసమ్మతి స్వరం వినిపిస్తున్నారు. అయితే వీటన్నింటినీ పక్కన పెడుతూ అప్పటి రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి ఇరు వర్గాలను సమన్వయం చేస్తూ ముందుకు నడిపించారు. రాష్ట్రంలో గతేడాది జరిగిన సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సమీకరణాలు ఒక్కసారిగా మారాయి. దాంతో ముందస్తు చర్యల్లో భాగంగా పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లందరినీ ఈ నెల మొదటి వారంలో మల్లారెడ్డి ఆధ్వర్యంలో గోవా విహార యాత్రకు తరలించి అసమ్మతి కార్పొరేటర్లందరినీ శాంతింపచేశారు. ఇక పరిస్థితి సద్దుమణిగిందనే అందరూ అనుకున్నారు. ఇంతలోనే ఎమైందో ఏమో తెలియదు కానీ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో మేడ్చల్ శాసన సభ్యులు మల్లారెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదని తెలుస్తోంది.

మేయర్ అవినీతి అక్రమాలే అసలు కారణాలు..!

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో 26 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లే ఉన్నారు. ఇందులో మొదటి నుంచి మేయర్ జక్కా వెంకట్ రెడ్డి తీరును వ్యతిరేకిస్తూ అప్పుడప్పుడు అసమ్మతి స్వరం వినిపించడం జరిగింది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌తో ఇంకొందరు కార్పొరేటర్లు జతకట్టి మీడియా ముఖంగానే మేయర్ ఏకపక్ష నిర్ణయాలను, అవినీతి అక్రమాలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. అప్పుడు రాష్ట్రంలో బలమైన పార్టీగా బీఆర్ఎస్ ఉండడం, అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ అండదండలు మేయర్ వెంకట్ రెడ్డికి ఉండడంతో పెద్దగా పట్టించుకోలేదు. కానీ నేడు రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోవడంతో ఇదే అదునుగా భావించిన అసమ్మతి కార్పొరేటర్లు మేయర్ వెంకట్ రెడ్డిపై అవిశ్వాసం పంజా విసిరనట్టు తెలుస్తోంది. మేయర్ అవినీతి భరించలేకనే అందరం ఒక్కటయ్యామని ఒక కార్పొరేటర్ మీడియా ప్రతినిధులతో అన్నారు.

సైలెంట్ మూడ్‌లో మాజీ మంత్రి..

సోషల్ మీడియాలో నిత్యం ట్రెండింగ్‌లో ఉండే మాజీ మంత్రి మల్లారెడ్డి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి తరువాత సైలెంట్ మూడ్‌లోకి వెళ్లి పోయాడు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో అసమ్మతిని శాంతింప చేయడానికిగాను కార్పొరేటర్లతో గోవా టూర్ వెళ్లి వచ్చిన అనంతరం, మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లతో ఏకంగా దుబాయ్ టూర్ వెళ్లాడు. ఇంతలోనే మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 19 మంది కార్పొరేటర్లు ఆ పార్టీ మేయర్ మేకల కావ్యపై అసమ్మతి ప్రదర్శిస్తూ అవిశ్వాసానికి రెడీ అంటూ బాపట్ల టూర్ వెళ్లారు. ఇక బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డికి వ్యతిరేకంగా సుమారు 20 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి రెడీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఇవన్నీ జరుగుతున్నా మాజీ మంత్రి మల్లారెడ్డి తనకేమి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. అసలే ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి, చిరకాల ప్రత్యర్థి రేవంత్ రెడ్డిని దూషించిన మల్లారెడ్డి ఆయన చేసిన అవినీతి అక్రమాలు ఎక్కడ బయటకు వస్తాయోననే భయంతో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ సైలెంట్ మూడ్‌లోకి వెళ్లి పోయాడని పలువురు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో ప్రతిభ కనబరిచిన సత్య శ్రీనివాస మెమోరియల్ స్కూల్ విద్యార్థులు

- బంగారు పతకం సాధించిన హేమశ్రీ,
- కాంస్య పతకం సాధించిన బిందు



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామంలోని సత్య శ్రీనివాస మెమోరియల్ విద్యాలయం విద్యార్థులు హైదరాబాదులోని యూసుఫ్ గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 20వ తేదీన రెండో రాష్ట్రస్థాయి కరాటే కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనరిచిన కె. హేమశ్రీ బంగారు పతకం సాధించగా, బిందు కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా సత్య శ్రీనివాస మెమోరియల్ విద్యాలయ కరస్పాండెంట్ రేవోజ్ శృతి ప్రిన్సిపాల్ రేవోజ్ శ్రీనివాస్ వారిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా కారస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ఈ పోటీలలో రాష్ట్ర స్థాయిలో వంద పాఠశాలలు పాల్గొనగా సత్య శ్రీనివాస మెమోరియల్ విద్యాలయం నుంచి పాల్గొన్న విద్యార్థులు బంగారు, కాంస్య పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ ఎస్.నరేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కాలనీ అధ్యక్షుడిగా చంద్రమోహన్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అగ్రికల్చర్ కాలనీలో ఊహించని విధంగా మొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. ప్రతిసారిలా ఈసారి ఏకగ్రీవంగా కాకుండా ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, ట్రెజరర్‌గా జితేందర్ రెడ్డి ప్యానెల్ భారీ మెజార్టీతో గెలిచింది. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం పని చేస్తామని హామీనిచ్చారు.

విద్య, వైద్యంపై నిర్లక్ష్యం : ఎంపీపీ వైఎస్సార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్య, వైద్య రంగాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదులాబాద్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు నిధుల్లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో డాక్టర్ల కొరత, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత ఉన్నా ఇప్పటి వరకు నియామకం చేపట్టలేదన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినా అధికారుల్లో స్పందన లేదన్నారు. అవినీతి అధికారుల వెనుక బడా నాయకుల హస్తం ఉందన్నారు. అవినీతి అని ఫిర్యాదు చేస్తే చాలు అధికారుల జేబులోకి డబ్బుల వర్షం కురుస్తుందన్నారు. ఏదులాబాద్ కార్యదర్శి రూ.75 లక్షలు దోచుకున్నా.. మళ్లీ పోస్టింగ్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వీటన్నిటిపై సర్వ సభ్య సమావేశంలోనే కలెక్టర్ గౌతమ్‌కి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అవినీతి, అక్రమార్కులను శిక్షించాలని, అధికారులు అవినీతికి పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. ప్రతి సమస్యపై త్వరగా పరిష్కారం జరిగేలా చూడాలని, కరెంటు కోతల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. రానున్న రోజులు విద్యార్థులకు పరీక్షల కాలం అని, కరెంటు కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకి నిధులు మంజూరు చేయాలని సభా ముఖంగా కోరారు.

గౌడవెల్లి ఆదర్శ గ్రామంగా నిలిచింది



- జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ గ్రామంగా నిలిచిందని జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను సర్పంచ్ సురేందర్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామపంచాయతీ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం, పశు వైద్యశాల, పోస్ట్ ఆఫీస్, మీ సేవా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, హరిత నర్సరీలను ప్రారంభించి, సీసీరోడ్డు, గ్రామపంచాయతీ మొదటి అంతస్తు భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, జ్యోతిరావు పూలే, భగత్ సింగ్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన సర్పంచ్ జి.సురేందర్ ముదిరాజ్‌ను జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, ఎంపీడీవో పద్మావతి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఎల్. వినోద్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు గోపాల్, ఉపసర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

- పలుచోట్ల నివాళులర్పించిన రాజకీయ, యువజన, ప్రజా సంఘాల నాయకులు



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మేడ్చల్

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని ఆయన విగ్రహానికి బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకాట ప్రేమదాస్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ జయంతి తప్పా.. వర్ధంతి లేని ఏకైక నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని గుర్తు చేశారు. నేటి యువతకు వారి జీవితం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్ చారి, ఈశ్వర్ కుర్మ, మాజీ సర్పంచ్ విభూతి యాదగిరి, జిల్లా నాయకులు రాఘవరెడ్డి, మహేశ్, విష్ణుకాంత్ పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

స్వాతంత్ర సమరయోధులు సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తీగుళ్ల మురళీగౌడ్, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి తీగుళ్ల దర్శన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గూడూరు మోహన్ రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు పెండం లక్ష్మీనారాయణ, ప్రచార కమిటీ చైర్మెన్ చిర్రబోయిన రాంచందర్ యాదవ్, మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్‌పుత్ భరత్ సింగ్, 15వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు బల్వంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



శామీర్‌పేటలో..

కాప్రాలో..

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా, నాచారం డివిజన్లలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం అమోఘం అన్నారు. నాటి పాలకులు బోస్‌ను ఎన్నిసార్లు లొంగతీసుకోవాలని చూసినా లొంగకుండా, బెదరకుండా రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కాప్రాలో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్సీని అభినందించిన శిరీష సత్తూర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నూతనంగా శాసనమండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ని అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు, కాంగ్రెస్ మహిళ నాయకురాలు శిరీష సత్తూర్ దంపతులు (డాక్టర్ సత్తూరు నవీన్ కుమార్) మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్ప గుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శిరీష సత్తూర్ మాట్లాడుతూ, మహే ష్ కుమార్ గౌడ్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన ఎలాంటి పదవులు ఆశించని మనిషి అని, పార్టీలోని ప్రతీ ఒక్కరికి అందుబాటులో ఉండే మహేష్ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలు తీర్చే దిశగా కష్టపడతారని పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడం పార్టీలోని ప్రతీ ఒక్కరికి ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలియజేశారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జోనల్ కమిషనర్ అభినవ అభిలాష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని వివిధ విభాగాల అధికారులను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభినవ అభిలాష్ ఆదేశించారు. మంగళవారం గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టిలోకి తీసుకురావాలని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైతు బజార్‌పై అవగాహన





నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రైతులు పడే కష్టాల గురించి తెలుసుకొని రైతుల పండించే పంటలకు అమ్ముకోవడానికి ప్రభుత్వం రైతు బజార్లు ఏర్పాటు చేసింది. వాస్తవానికి రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర ఉందా లేదా? నిజానికి లేదనే చెప్పుకోవాలి. ఎందుకంటే రైతు పండించిన పంట మధ్యవర్తుల వారి సొంత నిర్ణయానికి ఖరీదు చేస్తారు. మధ్యవర్తుల నుంచి వ్యాపారులు అవి కొని మార్కెట్లో అమ్ముతున్నారు. దీనివల్ల వ్యాపారులకు కూడా సరైన ధర లేక పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక రైతుల అనేక కష్టాలు పడుతున్నారు. దీని గురించి విద్యార్థులకు రైతు వేషధారణలో మంగళవారం వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్‌లో రైతు బజార్ ఏర్పాటు చేసి రైతుల పండించే ప్రతి ఒక్కటి విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మారు. దీనివల్ల రైతుల సాధక బాధకాలు లాభనష్టాలు గురించి మరి వారి కష్టాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైతులు పడే కష్టాలు గురించి అతివృష్టి, అనావృష్టి గురించి దళారులు పొందే లాభాలు గురించి క్షుణంగా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కరస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయుల బందం విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బి. లింగస్వామి



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపల్ కార్మికుల సమస్యలు చాలా సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బి. లింగస్వామి కోరారు. మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ దుండిగల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారికి ప్రతినెలా సబ్బులు, కొబ్బరి నూనెలు, ఆరోగ్య పరికరాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రమాదంలో కార్మికులు మరణిస్తే రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ. 30 వేలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా వయసు మీరిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ. పది లక్షలు ,వారసులు లేని వారికి 15 లక్షలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, పెన్షన్లు, ఇల్లు లేని వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కార్మికులకు రావలసినటువంటి బట్టలు, సబ్బులు, నూనెలు, చెప్పులు, ఆరోగ్య పరికరాలు వచ్చే విధంగా చేస్తానని తెలిపారు. సంబంధిత అధికారులతో కార్మికుల ముందే మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్యం, నరసింహ, ఎల్లయ్య సురేందర్, పెంటేష్, మధు, రవి, జగన్, జయేందర్ , అమృత, బాలమణి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశం ప్రశాంతం

- వైద్య, ఆరోగ్యశాఖపై ప్రశ్నల వర్షం
- గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయని సభ్యుల ఆగ్రహం
- గ్రామ సెక్రెటరీల పనితీరుపై అసహనం





నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాతంగా జరిగింది. జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది సుధీర్‌రెడ్డి అధ్యక్షతన మేడ్చల్‌లో మంగళవారం జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివద్ధి, వ్యవసాయ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ అంశాలపై సంబంధిత అధికారులు సమావేశంలో ప్రజాప్రతినిధులకు స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానాలిచ్చి... అందుకు సంబంధించి పూర్తి వివరాలను తెలిపారు. సమావేశానికి హాజరైన ఎంపీపీలు, జెడ్పీటీసీలు డీఎంఅండ్‌హెచ్, డీపీఓ, విద్యుత్‌శాఖ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా మీటింగ్‌కు ఎందుకు వచ్చారని వారిని నిలదీశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించగా.. గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయని డీపీఓ రమణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సెక్రెటరీలు వసూళ్లు చేస్తున్నారని, కట్టడి చేయాలని, మేజర్ గ్రామ పంచాయతీలకు అనుభవం ఉన్న సెక్రెటరీలను నియమించాలని కోరారు. మేడ్చల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో స్థానికులకు 10శాతం ఇవ్వాలని ఉన్నా.. అలా జరగలేదని మూడుచింతలపల్లి జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పాతబస్తీ, హైదరాబాద్‌కు చెందిన లబ్దిదారులకే 90శాతం ఇండ్లు కేటాయించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ ప్రాంతం, నియోజకవర్గంలో నిర్మించిన ఇండ్లకు స్థానికులకు కేటాయించిన తర్వాత మిగిలినవి ఇతరులకు కేటాయించాలని కోరారు. గ్రామ పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. జీపీ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, తెలిపారు. ఏదులాబాద్ గ్రామ సెక్రెటరీ అవినీతికి పాల్పడినా మళ్లీ పోస్టింగ్ ఇచ్చారని డీపీఓ రమణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమర్షియల్ ట్యాక్స్ సరిగా వసూలు చేస్తే వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని వారు అభిప్రాయపడ్డారు.

వైద్య, ఆరోగ్యశాఖపై ప్రశ్నల వర్షం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖపై జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రశ్నల వర్షం కురిపించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ రఘునాథస్వామి వద్ద సమాధానం లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వైద్యులు సకాలంలో డ్యూటీకి రావడం లేదని, ఘట్‌కేసర్‌లోని హాస్పిటల్స్ పని తీరు సరిగా లేదని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి నిలదీశారు. పల్లె దవాఖానాల్లో డాక్టర్ల కొరత ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. శామీర్‌పేటలోని పీహెచ్‌సీ అస్తవ్యస్తంగా ఉందని స్థానిక ఎంపీపీ ఎల్లూబాయి తెలిపారు. వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, డీఎంఅండ్‌హెచ్‌ఓ అన్ని హాస్పిటల్స్‌ను తనిఖీ చేయాలని కోరారు. రూ.లక్షలు వసూలు చేస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు, ఎక్విప్‌మెంట్ లేక, ఇటు ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.లక్షలు బిల్లులు చెల్లించలేక పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాచారం లేదని జవాబు ఇవ్వడం సరికాదని, సమావేశానికి వచ్చేటప్పుడు సరైన సమాచారంతో రావాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు సభ్యులు సూచించారు.

కృష్ణారెడ్డికి అభినందనలు

జిల్లా మహిళా, శిశుసంక్షేమ, వికలాంగుల, వృయోవృద్దుల సంక్షేమ అధికారి కృష్ణారెడ్డిని ఎంపీపీలు, జెడ్పీటీసీలు అభినందించారు. శాఖ పనితీరుపై స్పష్టంగా నివేదిక సమర్పించడంతో సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన కొన్ని సందేహాలను సంక్షేమశాఖ అధికారి కృష్ణారెడ్డి నివృత్తి చేశారు.

జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలి : జెడ్పీ చైర్మెన్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం వల్ల ఎంతో అభివృద్ధి చెందిందని, మరింత అభివద్ధి జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివద్ధి పథంలో ఉందన్నారు. అధికారుల కృషి, ప్రజాప్రతినిధుల సమన్వయం ఇందుకు కారణం అన్నారు. జిల్లాను మరింత అభివద్ధి చేసేందుకు ఇదే తరహాలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సంక్షేమ పథకాలు : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జెడ్పీ సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర సభ్యులు పలు సమస్యలను లేవనెత్తగా కలెక్టర్ వారికి అవసరమైన వివరాలు, సమాచారాన్ని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరిస్తానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో అధికారులు బాగా విధులు నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో మరింత బాగా పని చేయాలని సూచించారు. జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఆయా బిల్లుల వసూళ్ళు సక్రమంగా జరగడం లేదని, ఈ విషయంలో అవసరమైన సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. ట్యాక్సులు తప్పకుండా వసూలు చేయాలని, ట్యాక్సులు సరిగ్గా వసూలు చేస్తేనే అభివృద్ధి పనులకు ఆస్కారముంటుందని, ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ప్రభుత్వ పాలసీ ప్రకారం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నివేదికలు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఇండ్లు చాలా వరకు కేటాయించామని, వాటిలో తప్పులున్నాయని సభ్యులు తెలిపారని, తప్పులు ఉన్నాయా..? లేదా..? అనే వివరాలను తెలుసుకుంటామని తెలిపారు. ఇంకా నిర్మాణం పూర్తి కాని ఇండ్లను పూర్తి చేసి అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేశ్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా శాఖ అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ప్రజాప్రతినిధుల సన్మానం

జెడ్పీ సమావేశానికి మొట్టమొదటిసారిగా హాజరైన జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ వెంకటేశ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు శాలువా, పుష్పగుచ్చాలతో సన్మానించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత.. మరలా నిర్మాణం

- చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ పరిధిలోగల మొండికుంట సర్వే నెంబర్ 244 ఎఫ్‌టీఎల్ నాలుగు ఎకరాల20 గుంటల విస్తీర్ణం గల స్థలంలో కొద్ది రోజుల క్రితం కొంత భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టి కాంపౌండ్ నిర్మించగా విషయం తెలుసుకున్న ఇరిగేషన్, రెవెన్యూ ఆర్ఐ అధికారుల నేతృత్వంలో ఎఫ్‌టీఎల్ స్థలమని నిర్ధారించి కూల్చివేయడం జరిగింది. అయితే ఇటీవల మరల అదే ఎఫ్ టి ఎల్ స్థలంలో అక్రమణదారుడు కొత్తగా కాంపౌండ్ నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ విషయం దుండిగల్ తాసిల్దార్ సూచరిత దృష్టికి రావడంతో మొండికుంట ఎఫ్‌టీఎల్ లో మరలా మరలా కబ్జాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకో నున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్‌లోని కట్ట మైసమ్మ దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి, శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మంగళవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో- ఆపరేటివ్ చైర్మెన్ మన్నె రాజు, గాజుల రామారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, సూరారం సీఐ వెంక టేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వెంకట్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ పుప్పాల భాస్కర్, దేవాలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, రాఘవరెడ్డి, సాయి గౌడ్, గణేష్, లక్ష్మారెడ్డి, మల్లేష్, భాస్కర్, మహిపాల్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి లీకేజీల నియంత్రణకు తగిన చర్యలు

- కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్ మెట్

తాగునీటి లీకేజీల నియంత్రణ కు తగిన చర్యలు తీసుకుంటామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీని వాస్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కిష్టమ్మ ఎన్ క్లేవ్ న్యూ ఎంఈఎస్ కాలనీ వద్ద కొన్ని రోజులుగా 1100 డయా వాటర్ పైపులైన్ లీకేజ్ అవుతున్నది. ఈ సమస్యను కాలనీ వాసులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దాంతో కార్పొరేటర్ మంగళవారం అధికారులతో కలిసి కాలనీకి వెళ్ళారు. పైపు లైను లీకేజీ నియంత్రణ పనులను ఆమె పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారి బిక్కులాల్, స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, వీఎన్ రాజు,ప్రేమ్ కుమార్, గిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఏడేండ్ల జైలు శిక్ష



నిందితుడు సత్యనారాయణ

నవతెలంగాణ-బాలానగర్

భార్య మృతికి కారణమైన భర్తకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి కోర్టు ఏడేండ్ల జైలు శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట వెంకటేశ్వర్ నగర్ కు చెందిన సత్యనారాయణ అదే కాలనీకి చెందిన స్వప్నకు 2011లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెండ్లి సమయంలో రూ. 80,000, 3 తులాల బంగారు బడి బాసన్లు ఇచ్చారు. దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. చిన్న అబ్బాయికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. సత్యనారాయణ కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చే వేతనం మొత్తం తాగడానికి ఖర్చు పెట్టేవాడు. భార్యతో పదేపదే గొడవ పడేవాడు. అయితే స్వప్న తన భర్త పెడుతున్న హింసను తట్టుకోలేక 2016లో జులై 2న రాత్రి బాత్రూంలోకి వెళ్లి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. రాజేష్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ శ్రీనివాసులు, ఏసీపీ నంద్యాల నరసింహారెడ్డిలు చార్జిషీట్ ఫైల్ చేశారు. సాక్ష్యాధా రాలు పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి కోర్టు అడిషనల్ థర్డ్ డిస్టిక్ జడ్జ్ కళ్యాణ్ చక్రవర్తి మంగళవారం నిందితుడు సత్యనారాయణకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5000 జరిమానా విధించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

బొల్లారం సబ్‌స్టేషన్ 11 కేవీ బాలాజీ ఫీడర్‌లో మరమ్మత్తులు, విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు స్టెర్లింగ్ హెూమ్స్, బాలాజీ ఎన్‌క్లేవ్, ప్రణీత్ జెమ్స్, ప్రణీత్ నేచర్ బౌంటీ, ఖాజీపల్లి రోడ్, స్ప్రింగ్‌వుడ్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి.సాయి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అంతరాయానికి సహకరించాలని కోరారు.

డిపి పల్లి, గండిమైసమ్మ 11 కె.వి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు, విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 10.00గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు గండిమైసమ్మ క్రాస్ రోడ్, ప్రగతి స్కూల్, రాజరాజేశ్వరి కాలనీ, జీ నైన్ కాలనీలలో, అలాగే డిపి పల్లి ఎస్ఎస్1 నుంచి 11కె.వి ఐడిపి కేబుల్ ఫీడర్ ఫీడింగ్ కారణంగా మధ్యాహ్నం 2:00 గంటల నుండి 4:00 గంటల వరకు వెర్టెక్స్ వేద అపార్ట్‌మెంట్స్, మిర్చి డెవలపర్స్, అక్షయ డెవలపర్స్,గురుకుల పాఠశాల,విశ్వసాయి టౌన్‌షిప్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏఈ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

సమిష్టిగా గెలిపించారు... మరింతగా అభివృద్ధి చేసుకుందాం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కృతజ్ఞత యాత్ర

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్‌లోని రాజీవ్ గాంధీ నగర్, స్కందానగర్, శివాలయ నగర్, మస్తానా బిల్డర్స్ నందు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మంగళవారం 11వ రోజు కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలంతా తమ ఓటు సరైన నాయకుడికి వేసినప్పుడు మాత్రమే అభివృద్ధి చెందుతుందని తనను నమ్మి అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలపడానికి ఈ కృతజ్ఞత యాత్ర చేపట్టామన్నారు. తనకు ఇంతటి అఖండ విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎప్పుడూ రుణ పడి ఉంటానన్నారు. రాజీవ్ గాంధీ నగర్‌లో శ్రీనివాస్, అజయ్, విజయ్, వెంకటేష్, రాజు, నరసింహ, శివాల య నగర్‌లో, మహేశ్వర్ రెడ్డి, షానాజ్ బేగం, గోపాల్ నాయక్, కిరణ్ కుమార్, చందా నగర్‌లో ఆంజనేయులు తదితరులు మస్తానా బిల్డర్స్ నుంచి బాలేష్, జానకిరామ్, యాది రెడ్డి, వెంకటేష్ తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు ఫెరోజ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



జగద్గిరిగుట్ట పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పద్మశాలీ కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర (2024) క్యాలెండర్‌ను రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి వెంకటరామిరెడ్డి నగర్‌లో రంగారెడ్డి నగర్ ,జగద్గిరిగుట్ట డివిజన్‌ల కార్పొరేటర్లు బి.విజయ శేఖర్ గౌడ్,కొలుకుల జగన్, పద్మశాలి సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు బేతి గోపాల్, వివిధ ప్రాంతాల కులస్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు ఏర్వ శంకరయ్య ,జగద్గిరిగుట్ట పద్మశాలి సంఘం అధ్యక్షులు భోగ రాజేష్, కుత్బుల్లాపూర్ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు మునిపల్లి జనార్ధన్, టి.నరసింగరావు, సలహాదారులు గూడూరి లక్ష్మీనరసిం హులు, పల్లె దత్తాత్రేయ, కార్యనిర్వాహక అధ్యక్షులు మాయకోటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రుస్తుంపేట రవీంద్రబాబు, బోడగట్టు రాము, ఏనుగంటి శ్రీనివాస్,జల్ద లక్ష్మీనాథ్, బాలునేత, తదితరులు పాల్గొన్నారు.

మహా యోధుడు సుభాష్ చంద్రబోస్ : ఎమ్మెల్యే

స్వేచ్ఛ ఎవరో ఇస్తే తీసుకునేది కాదని మనకు మనమే తీసుకో వాలని స్వాతంత్ర స్ఫూర్తి చాటిన మహా యోధుడు సుభాష్ చంద్ర బోస్ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డి నగర్‌లో సంక్షేమ సంఘం అధ్యక్షులు సతీష్ గట్టోజి ఆధ్వర్యంలో నిర్వహిం చిన సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలకు స్థానిక కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్, జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్‌లతో కలిసి ఆయన హాజరై సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాటా్ లడుతూ స్వాతంత్ర ఉద్యమంలో తెల్ల దొరలను గడగడలాడించిన ఉక్కుమనిషి సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. భారత స్వాతంత్రాన్ని తార స్థాయికి చేర్చిన మహనీయుల అడుగుజాడల్లో నడవాలని.. అప్పుడే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, మాజీ వార్డు సభ్యులు నాయక్ వాడి లక్ష్మణ్ గౌడ్, సీనియర్ నాయకులు జల్దా లక్ష్మీనాథ్, భాస్కర్ రెడ్డి, మహమ్మద్ రషీద్ నాయకులు హఫీజ్, సాధక్, మోహన్ రెడ్డి, ఆషం, మల్లేష్ చారి, అక్బర్, వేణు, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, మౌనిక, చంద్రకళ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



పటిష్ట ప్రణాళికలతో ముందుకు వెళ్లాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఐడీఎల్ చెరువు పరిశీలన

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పటిష్ట ప్రణాళికలు తో ముందుకు వెళ్లాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఐడిఎల్ చెరువు వద్ద అధికారులతో ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా నాలా అభివృద్ధి కోసం ఇక్కడున్న ప్రాంత వాసులకు ముఖ్యంగా స్వాన్ లేక్ అపార్ట్ మెంట్ వాసులు, ఇతర బస్తి



వాసులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఏదైనా ఇబ్బంది ఉన్న ఎడల తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టే వారికి నాలాల కోసం తగిన సూచనలు ఇవ్వాలని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బాబురావు. ఇరిగేషన్ ఈఈ నారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి ఉమా దేవి, ఈఈ సత్యనారాయణ , డీఈ ఆనంద్, జలమండలి, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సమావేశం

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్‌తో మున్సిపల్ కార్యాలయంలో ఆయనతో పాటు కార్పొరేటర్లు సమావేశమయ్యారు. ముందుగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలాలు అభివృద్ధి చేసి రిటర్నింగ్ వాల్స్ నిర్మించాలన్నారు. పార్కులు, గ్రేవీ యార్డులు రోడ్లకు సంబంధించి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా సత్వరమే నిధులు మంజూరు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ప్రభుత్వం ఏదైనా అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజల కోసమే తాము న్నామనే భరోసా కల్పించాలన్నారు. దీంతో జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి పండాల సతీష్ గౌడ్, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబూరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు పాల్గొన్నారు.

10

నవతెలంగాణ

హైదరాబాద్

బుధవారం | జనవరి 24, 2024 | www.navatelangana.com

అర్ధరాత్రి షాపులు నడుపుతున్న వారిపై కేసులు..

● ఇద్దరిని జైలుకు తరలింపు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

అర్ధరాత్రి 12 తర్వాత షాపులు నడుపుతున్న వారిపై అబిడ్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మంగళవారం అబిడ్స్ ఇన్ స్పెక్టర్ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రుల్లో ఇష్టానుసారంగా షాపులు నడుపుతుతున్న ఇద్దరిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరు పరచామన్నారు. కోర్టు వీరిలో ఎంఎ నయీంకు రెండు రోజులు, సాయి నాథ్ కు కోర్టు 5 రోజుల సాధారణ జైలు శిక్ష విధించిందని తెలిపారు. అర్ధరాత్రి షాపులు నడిపితే చట్టపరంగా కేసు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. వ్యాపారులు సమయపాలన పాటించాలని సూచించారు.

నాలాగా ఎవరూ మోసపోకండి : స్వప్న చౌదరి



నవతెలంగాణ-బంజారా హిల్స్

బిగ్‌బాస్‌తో పాటు టీవీలలో ప్రసారమవుతున్న షోలలో అవకాశమిస్తామని మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్వప్న చౌదరి అన్నారు. మంగళ వారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది రాజేష్‌తో కలిసి మాట్లాడారు. రాజు అనే వ్యక్తి తనకు బిగ్ బాస్ షోలో అవకాశం ఇస్తానని తన వద్ద నుంచి విడతలవారీగా రూ.2.50 లక్షలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై తాను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు రాజు పై కేసు నమోదు అయిందన్నారు. ఇలా ఎందరో వివిధ షోల కోసం ఆస్తులు అమ్ముకొని అప్పులు చేసి డబ్బులు ఇచ్చి మోసపోతున్నారన్నారు. తనలా ఎవరూ మోసపోవద్దన్నారు. షోలకు వెళ్లాలని అనుకునేవారు నేరుగా ఆయా కార్యక్రమాల నిర్వాహకులను నేరుగా కలవాలని సూచించారు.

'ఆశాలకు గత నెల పారితోషికాలు వెంటనే ఇవ్వాలి'

● హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని ఆశాలకు 2023 డిసెంబర్ పారితోషికాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ, సౌత్ కమిటీలు డిమాండ్ చేశాయి. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సికింద్రాబాద్‌లోని హరిహరకళా భవన్‌లో ఉన్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జె.వెంకటికి వినతిపత్రం అందజేశారు. బకాయి వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని డీఎంఅండ్‌హెచ్‌ఓ హామీనిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్, సౌత్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మీనా, ఎం.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశాలకు వెంటనే పెండింగ్ పారితోషికాలు చెల్లించాలన్నారు. డిసెంబర్ నెల పారితోషికాలు నేటికీ చెల్లించకపోవడంతో ఇంటి కిరాయిలు, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక, తినడానికి, కొనడానికి డబ్బుల్లేక ఆశాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెలంతా పని చేసి పారితోషికం కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. వెంటనే పారితోషికం చెల్లించాలని, ప్రతి నెలా 2వ తేదీలోపు పారితోషికాలను చెల్లించేలా చూడాలని కోరారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.యాదమ్మ, ఎం.అనిత, భాగ్యలక్ష్మి, రాణి, అనురాధ, రాధిక, రీటా, సారాబాయి, బసంతి, తదితరులు పాల్గొన్నారు.



సీవరేజీ ఇన్ ఫ్లోను పరిశీలించిన జలమండలి ఎండీ



మిరాలం ఎస్టీపీకి వెళ్లి ఆరా

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి మిరాలం ఎస్టీపీని పరిశీలించారు. సోమవారం రెండు ఎస్టీపీలను సందర్శించిన ఎండీ మంగళవారం మిరాలం ఎస్టీపీకి వెళ్లారు. మొదట గా ఎస్టీపీ ఇన్ లెట్ వద్ద సీవరేజీ ఇన్ ఫ్లోను పరిశీలించారు. ఏయే ప్రాంతాల నుంచి మురుగు నీరు వస్తుందో తెలుసుకున్నారు. మిరాలం ట్యాంకు పరివాహక ప్రాంతాల గురించి ఆరా తీశారు. ఎస్బీఆర్‌లో మురుగు నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. రోజూ నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించడం, రోజూ ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో గణాంకాలు లాగ్ బుక్స్‌లో నమోదు చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా. ఎం. సత్య నారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీ ఎం సుద ర్శన్, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంప్రదాయబద్ధంగా వధూవరుల వివాహం జరిపిస్తాం

● గౌడ్ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మెన్ హరినాథ్ గౌడ్ ● గౌడ మ్యారేజ్ బ్యూరో నూతన లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

సాంప్రదాయబద్ధంగా అన్ని హంగులతో వధూవరుల వివాహం జరిపిస్తామని గౌడ్ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ హరినాథ్ గౌడ్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ్ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ నూతన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ హరినాథ్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులలో అన్ని రకాలుగా అర్హులైన వధూవరులను పరిచయం చేయడానికి గౌడ్ మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ మ్యారేజీ బ్యూరో ద్వారా సాంప్రదాయ బద్ధంగా వధూవరుల వివాహం జరిపిస్తామని తెలిపారు. మ్యారేజీ బ్యూరో నడిపించే వారిని కార్మికులుగా గుర్తించి కార్మికులు ఘనంగా జరుపుకునే మేడే రోజున మ్యారేజీ బ్యూరో డేగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వివాహాలు చేసే మేము కూడా కార్మికుల వలే అహర్నిశలు కష్టపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల మాదిరిగా ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. గౌడ్ కులస్తులు ఎవరైనా ఈ మ్యారేజ్ బ్యూరో ని సంప్రదించవచ్చని తమకు తగిన వధూవరులను పరిచయం చేస్తామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో పలువురు మ్యారేజ్ బ్యూరో సభ్యులు పాల్గొన్నారు

చదునైన ముఖం గల జాతి శునకాలను కొనుగోలు చేయవద్దు

● పీపుల్ ఫర్ ద ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్ (పెటా) ఇండియా డివేన్స్ హౌస్ సొసైటీ మద్దతు దారుల పిలుపు

● పగ్ దుస్తులు ఆక్సిజన్ మాస్కులు ధరించి హైదరాబాద్ వాసులకు వినతి

నవతెలంగాణ-ముషీరాబాద్

చదునైన ముఖం గల జాతి శునకాలు జీవించడం కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటాయని వాటిని కొనుగోలు చేయవద్దని పీపుల్ ఫర్ ద ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్ (పేట) ఇండియా డివేన్స్ హౌస్ సొసైటీ మద్దతు దారుల పిలుపునిచ్చారు. పేట సొసైటీ మద్దతు దారులు పగ్ వంటి విదేశీ బ్రాచై సెఫాలిక్ కుక్కలు (పొట్టి పుర్రె చదునైన ముఖం ఉన్నవి) శ్వాసకోత సమస్యకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడతాయని వాటిని ఎప్పుడూ కొనుగోలు చేయవద్దని మంగళవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద వినూత్న రీతిలో కుక్కల దుస్తులు, ఆక్సిజన్ మాస్కులు ధరించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పేట ఇండియ ప్రచార సమన్వయకర్త ఉత్కర్ష గార్గ్ మాట్లాడుతూ వోడాఫోన్ వాణిజ్య ప్రకటనల ద్వారా ప్రాచుర్యం పొందిన పగ్‌లు, ఫ్రెంచ్, ఇంగ్లీష్ బుల్‌డాగ్‌లు, పెకింగీస్, బోస్టన్ టెర్రియర్స్, బాక్సర్‌లు, కావలీర్ ,కింగ్ చార్లెస్ ,స్పానియల్స్, షిహ్ ట్జుస్, వంటి ఇతర శ్వాస సంబంధిత జాతుల శునకాలు (బీఐబీ) బ్రాచైసెఫాలిక్ సిండ్రోమ్ అని పిలవబడే వేదన కలిగించే కొన్నిసార్లు ప్రాణాంతకమైన స్థితితో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా బాధపడుతుంటాయని తెలిపారు. ఇటువంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేసి పెంచవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ జాతి శునకాలను పెంపకాన్ని నిషేధించాలని కుక్కల పెంపకం మార్కెటింగ్ నియామలి 2017ను సవరించాలని పశుసంవర్ధక పాడి పరిశ్రమ శాఖను అభ్యర్థించామని తెలిపారు. నార్వేలో చదునైన ముఖం గల కుక్కల పెంపకం పై ఆంక్షలు విధించ బడ్డాయని వివరించారు. ఈ జాతి కుక్కల సంతానో త్పత్తిని నిషేధించి చదునైన ముఖం గల కుక్కల పెంపకం పై ఆశలు విధించడం ఎంతో ముఖ్యం అన్నారు. నిరంతరం శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడే ఇటువంటి విదేశీశునకాలను ఎట్టి పరిస్థితుల్లో పెంచకుండా వాటిని కష్టపెట్టకుండా వాటి సంతానోత్పత్తిని నిషేధించి వాటిని నరకం నుంచి కాపాడాలని కోరారు.



డిజిటల్ మార్కెట్‌తో వ్యాపారం అభివృద్ధి

● తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియా ఇంటర్ ప్రైజెస్ ద్వారా విద్యార్థినిలకు అడ్వాన్స్ ఇంటర్ పై న్యూ షిప్ స్కిల్ డెవలప్మెంట్, డిజిటల్ మార్కెటింగ్ సాధనాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కోఠి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత పాల్గొని మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం చాలా సులభమన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువమందికి మన వ్యాపారాన్ని చేరవేయొచ్చని తెలిపారు. ఎవరికైతే అవసరం ఉంటుందో నేరుగా వారి దగ్గరికి మనం వ్యాపారాన్ని వారికి అందేటట్లు చేయవచ్చన్నారు. వినియోగదారులకు చాలా ఎఫెక్టివ్ మనం మన విషయాన్నీ చెప్పవచ్చునన్నారు. ఈ డిజిటల్ మార్కెటింగ్ ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. నిమ్స్ మే వారు మా మహిళా విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టడం మాకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. ఇటువంటి ఉపాధి శిక్షణ కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని మేము కోరుకుంటున్నామన్నారు. టీ-లైఫ్ ప్రతినిధి దీపికరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు నేటి యుగంలో అన్ని రంగాల్లో ముందుకు వస్తుండడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. మహిళల కోసం మా టీ- లైఫ్ ద్వారా వారికి ఎంటర్ప్యూర్షిప్ రంగంలో అన్ని రకాల సహకారాలు అందిస్తామన్నారు. వ్యాపార రంగంలో భవిష్యత్తు అవసరాలకి ఏ విధమైనటువంటి సహాయ సహకారాలు కావాలన్నా మేము అందిస్తామని చెప్పారు. ఈ డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ కార్యక్రమం మీ వ్యాపార అభివృద్ధికి భవిష్యత్తుకి ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విశ్వవిద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతి రెడ్డి, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వారజరాణి, ప్రొఫెసర్ డాక్టర్ భవాని, టీ -లైఫ్ ప్రతినిధి దీపికా రెడ్డి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి

● హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్



నవతెలంగాణ-అంబర్‌పేట

దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. మంగళవారం కోఠి డిహెచ్ కార్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దంత వైద్యుల సేవలు వారి సమస్యలపై సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించి వారి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా మెరుగైన సేవలందించాలని సూచించారు . అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దంత వైద్యుల సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరలోనే పదోన్నుతులపై ప్రభుత్వంపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ వినా రామకృష్ణ, డాక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వానికి శిల్పం ప్రధానం..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సామాజిక చైతన్యం కవిత్వానికి ముఖ్యమని ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములు అన్నారు. నిరంతర సాధనతో శిల్ప నైపుణ్యాన్ని సముపార్జించుకొని కవిత్వానికి పదును పెట్టుకోవాలని నవకవులకు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవులు, విమర్శకులు, పరిశోధకుల ప్రసంగపరంపర 'నేను నా రచనలు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మంగళవారం ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సభలో కందుకూరి శ్రీరాములు మాట్లాడుతూ బాల్యంలో ఇందూరు భారతి సభ్యుడు బెడిదె రాజేశ్వర్ సాహిత్యా భిరుచిని కలిగించారని, కవిత్వంలో ముందడుగు వేసే విధంగా డాక్టర్ నందిని సిద్ధారెడ్డి ప్రోత్సహించారని, డాక్టర్ సి.నారాయణ రెడ్డి తమ పాఠాలతో పరవశింప చేసి సాహిత్యంపై అభినివేశం పెంచారని, మొక్కకు నీరు పోసినట్టు తనలోని కవిత్వాన్ని కే.శివారెడ్డి వికసింప చేశారని గుర్తు చేసుకున్నారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాం చేస్తూ సిద్దిపేట జిల్లా రావు రూకలలో 1951వ సంవత్సరంలో జన్మించిన కందుకూరి శ్రీరాములు ఆధునిక తెలుగు కవుల్లో అగ్రశ్రేణికి చెందిన వారని, పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ కందుకూరి శ్రీరాములు తెలుగు అధ్యాపకునిగా విద్యార్థుల్లో సాహిత్యాభిరుచి పెంపొందిస్తూనే తనదైన సృజన శక్తితో 10 కవితా సంపుటాలు వెలువరించారని, విమర్శకులుగా రాణించారని తెలిపారు. ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ. సిల్మానాయక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ విజయవంతం చేయాలి

టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్), జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని లలిత కళాతోరణంలో టీఎన్జీవోస్ యూనియన్ డైరీ, క్యాలెండర్-2024 ఆవిష్కరణోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథులుగా తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ, టీజేఎస్ అధినేత కోదండరామ్, అద్దంకి దయాకర్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగు లతో పాటు జిల్లా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున్న పాల్గొని విజయ వంతం చేయాలని డాక్టర్ ముజీబ్ విజ్ఞప్తి చేశారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్య పీఆర్‌ఓగా బీసీ నాయకుడు రాజ్ కుమార్ నియామకం

నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య పీఆర్ఓగా బీసీ యువజన సంఘం కన్వీనర్ రాజ్ కుమార్‌ను ఎంపీ కృష్ణయ్య నియమించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఎన్నో పోరాటాలలో పాలుపంచుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాజ్‌కుమార్ నిజాయితీ నిబద్ధత చూసి ప్రజలకు సేవ చేసే గుణం అల వర్చుకునే విధానం ద్వారా ఆకర్షితులైన కృష్ణయ్య తన ప్రత్యేక పీఆర్ఓగా ఎన్నుకొని ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తనకు తెలియజేయాల్సిందిగా కోరారు.



కాంగ్రెస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్

నిందితుడి అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పార్టీ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించిన నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపిన వివరాల మేంకు రాజస్థాన్, జైపూర్‌కు చెందిన సురేంద్ర చౌదరి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించు కున్నాడు. గతేడాది విరాళాల సేకరణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా భావించిన నిందితుడు సులువుగా డబ్బులు సంపా దించాలని కాంగ్రెస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించాడు. ఈ వెబ్‌సైట్ ద్వారా కొందరి నుంచి విరాళాలు సేకరిం చాడు. విషయాన్ని గుర్తించిన పార్టీ నేతలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు రాజస్థాన్ నుంచి మోసం జరిగినట్టు గుర్తించారు. జైపూర్‌కు వెళ్లిన సీసీఎస్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

కొడుకు టికెట్టు కోసం దిగజారుతున్న ఎమ్మెల్యే

● ఎన్నికల్లో డబ్బులు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు

● ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. కొడుకు టికెట్ కోసం ఆయన ఎంతకైనా దిగజారి మాట్లాడుతారని విమర్శించారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పార్లమెంట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, అయోధ్య అక్షింతలపై మల్లారెడ్డి అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడుని దేవుడు అన్న తర్వాత పదవి పోయిందని, ఇప్పుడు కేసీఆర్‌ను దేవుడు అన్న తర్వాత కూడా పదవి పోయిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం రూ.లక్షల కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్లు, పల్లె ప్రకతి వనాలు, గ్రామ పంచాయతీకి నిధులు ఇలా అనేక నిధులు మంజూరు చేసిందన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివద్ధి చెందిందన్నారు. అవగా హన లేక మల్లారెడ్డి మాట్లాడే జోకర్, బ్రోకర్ మాటలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో మల్లారెడ్డి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ఇంకా వెయ్యికి పైగా రోడ్లు వేయాల్సి ఉందన్నారు. కండ్లకొయ్యలో కేటీఆర్‌తో శంకుస్థాపన చేసిన ఐటీ హబ్ ఏమైందని ప్రశ్నించారు. పార్లమెంటు టికెట్ కోసం సొంత ఎజెండా కోసం మాట్లాడుతున్నట్టు ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. మేడ్చల్ నియోజకవర్గం ప్రజలను దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, గహలక్ష్మి, ఇతర సంక్షేమ పథకాలతో మభ్యపెట్టి మోసం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో వార్డు మెంబర్ మల్లేష్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు బసవరాజు గౌడ్, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు శివ నాయక్, పోచారం ప్రధాన కార్యదర్శి గుండె నరేష్, కష్ణ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, దినేష్, తదితరులు పాల్గొన్నారు.



ఫీల్ ఖాన వైశ్య భవన్ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య లో బాలరామ్‌లాల్ల విగ్రహం ప్రతిష్ఠించిన సందర్భంగా పిల్ ఖానాలోని సీతారామ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రజాఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, టీడీపీ నాయకులు దినేష్, శ్రీరామ్ తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



గోల్నాక వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు సంతోష్ జనవాడే ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా 108 దీపోత్సవాలతో దీపాలంకరణ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా వీరశైవ లింగాయత్ సమాజం యువజన అధ్యక్షుడు ఆలూరి ఈశ్వర ప్రసాద్, రాష్ట్ర బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సమాజం అధ్యక్షుడు కోటె గుండప్ప, లోకేష్ పాటిల్, శ్రావణ్ కుమార్, మహేష్ జనవాడే, కే సునీల్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



భద్రాచలం రాములవారిని దర్శించుకున్నా ప్రముఖ సంఘ సేవకురాలు ఎర్రం పూర్ణ శాంతి గుప్తా తదితరులు

నవతెలంగాణ-అంబర్‌పేట

గుండెపోటుతో డీసీపీ కుమారుడు మృతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

డీసీపీ వెంకటేశ్వర్లు కుమారుడు చంద్రతేజ్(20) గుండెపోటుతో మృతి చెందాడు. చంద్రతేజ్‌కు సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చంద్రతేజ్ మృతి చెందాడు. చంద్రతేజ్ ఓ ప్రయివేటు కాలేజీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్న వయసులోనే చంద్రతేజ్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని వారి స్వగ్రామం నల్లగొండ జిల్లాకు తరలించారు.

ఘనంగా హన్మంతుని విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వెంకటాపురం డివిజన్ పరిధిలోని కొత్తబస్తి క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మించిన హన్మంతుని విగ్రహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు ప్రారంభించారు. 29 ఫిట్ల ఎత్తు ఉన్న ఈ విగ్రహాన్ని ఆయన, తన సొంత డబ్బులతో నిర్మించారు. గత సంవత్సరం జనవరి 29 వ తేదీన పూజ చేసి ప్రారంభించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహా ప్రాణ ప్రతిష్ట జరిగిన శుభ సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ చేశారు. విగ్రహ ప్రతిష్ట కాగానే కమిటీ సభ్యులు హనుమాన్ విగ్రహానికి గజమాల వేసి శ్రీ రాముని కీర్తనలు చేసి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, 133 డివిజన్ మచ్చ బొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేం దర్ నాథ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, 133 ,134 ,135 డివిజన్ ల కాంగ్రెస్ నాయ కులు, సీనియర్ నాయకులు అశోక్, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా..!

- టెన్త్ సిలబస్, వార్షిక పరీక్షల నేపథ్యంలో నిర్ణయం
- ఇప్పటికే ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసిన విద్యాశాఖ



(ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-సిటీబ్యూరో

పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు నూతన ఎస్ఎంసీ ఎన్నికలకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని జిల్లా అధికారులకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మార్చిలో పదో తరగతి వార్షిక పరీక్షలు ఉండడంతో ఎస్ఎంసీ ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్నది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

సర్కారు బడుల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి ప్రగతి, అభివృద్ధి, పర్యవేక్షణ కోసం పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రతీ రెండేండ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. గత కమిటీ పదవీ కాలం 2021 డిసెంబర్‌లో ముగిసినా.. కరోనా ప్రభావం కారణంగా ఎన్నికలు జరపలేదు. ఇప్పటి వరకు పాత కమిటీలే కొనసాగాయి. దాదాపు నాలుగేండ్ల తర్వాత నూతన కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వం నాలుగేండ్లుగా ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలు నిర్వహించడంపై దృష్టి సారించింది. ఈ మేరకు కొద్దిరోజుల క్రితమే ప్రభుత్వ, లోకల్‌బాడీ, ఎయిడెడ్, టీఎస్ ఆదర్శ, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 20న పాఠశాలల వారీగా యాజమాన్య కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీసు బోర్డులపై కూడా ప్రదర్శించారు. 22, 23వ తేదీల్లో జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ, 24న విద్యార్థుల తల్లిదండ్రుల ఓటరు తుది జాబితా ప్రకటించడంతో పాటు 29న ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అయితే ఒకవైపు పూర్తికాని పదోతరగతి సిలబస్, వార్షిక పరీక్షల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహిస్తే విద్యార్థుల చదువులకు ఆటంకం కలగడంతో పాటు గందగోళ పరిస్థితి నెలకొంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఎస్ఎంసీ ఎన్నికలను వాయిదా వేస్తూ తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అంశాన్ని త్వరలోనే ప్రకటిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

హాష్ ఆయిల్ ముఠా గుట్టురట్టు



- నలుగురు నిందితులు అరెస్ట్, ఒకరు పరారీ.
- రెండు లీటర్ల ఆయిల్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గుట్టు చప్పుడు కాకుండా హాష్ ఆయిల్ గంజాయి విక్రయిస్తున్న నిందితుల ముఠా బాలనగర్ ఎస్ఓటి పోలీసులు వలపన్ని గుట్టు రట్టు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం షాపూర్ నగర్ లోని బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసీపీ. టీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. బాలరాజు తన కుటుంబంతో శ్రీకాకుళం జిల్లా నుంచి వలస వచ్చి మూసాపేట్‌లో నివాసముంటున్నాడు. బాలరాజు స్నేహితులైన సతీష్, నగేష్‌తో కలిసి గుట్టు చప్పుడు కాకుండా సనత్ నగర్, ఫతేనగర్ ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాలలో గంజాయి ఆయిల్‌ను విక్రయిస్తున్నాడు.పక్కా సమాచారం అందుకున్న బాలానగర్, సనత్ నగర్ ఎస్ఓటి పోలీసులు రెక్కీ నిర్వహించి నిందితులను ఫతేనగర్ వద్ద వలపన్ని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తమదైన శైలిలో విచారించారు. వారి వద్ద నుండి 12 లక్షలకు పైగా విలువచేసే హాష్ ఆయిల్ రెండు లీటర్లు బాటిల్స్ (చిన్న చిన్న బాటిల్స్) మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి బాలరాజు తో పాటు మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో నిందితుడు నాగార్జున పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాలరాజు సొంత ఊరు శ్రీకాకుళం సంక్రాంతికి వెళ్లి అక్కడ నుంచి గంజాయి ఆయిల్ తీసుకువచ్చినట్టు పోలీసులు వివరించారు. బాలరాజు పలు కేసుల్లో పాత నేరస్తుడని తెలిపారు. పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్న ఎస్ఓటి ఇన్స్పెక్టర్లను, పోలీసు సిబ్బందిని డిసిపి ప్రత్యేకంగా అభినందించారు. మరో నిందితుడుని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ జోన్ ఏసీపీ గంగారం పోలీసు ఉన్నతాధికారులు, ఎస్ఓటి సిబ్బంది పాల్గొన్నారు.



కుషాయిగూడ కోర్టులో సుభాష్ చంద్రబోస్ జయంతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడ కోర్టులో మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన న్యాయవాదులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ భారతజాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము యాదవ్, ఉపాధ్యక్షులు కిరీట్ రెడ్డి, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



దశల వారీగా సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవా రం ఆయన నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి తో కలిసి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ లలో పర్యటించారు. యాప్రాల్ స్వర్ణాంధ్ర కాలనీ ఫేజ్-2, మహాలక్ష్మిపురి కాలనీ, జెజెనగర్, సీబీఎన్ కాలనీలలో ఆయన పాదయాత్ర చేసి ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న స్థానిక సమస్య లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు తనకు చెప్పిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఎఈ సృజన, బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, నాయకులు జీకే హన్మంతరావు, రావుల అంజయ్య, శివ, శ్రీనివాస్ రావు, వసంత్, రమేష్, శ్యామ్, మధుసు ధన్ రెడ్డి, నవీన్, శోభ, పరిమళ, ప్రమీల తదిత రులు పాల్గొన్నారు.



స్వాతంత్ర సమరయోధుల్లో ముఖ్యల్లో ఒకరు సుబాష్ చంద్రబోస్

- జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

స్వాతంత్ర సమరయోధుల్లో ముఖ్యంగా చెప్పుకునే పేరుల్లో సుబాష్ చంద్రబోస్ ఒక రని కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన కంటేస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం కేపీహెచ్ బీ 5వ ఫేజ్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి ప్రేమ కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకోవాలంటే అహింస ఒక్కటే మార్గం కాదు, పోరాటాలు కూడా చేయాలి అంటూ గాంధీకి వ్యతిరేకంగా పోరుబాట పట్టి మిస్టరీగా చనిపోయిన నేతాజీ పుట్టినరోజు ఈ రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు కొల్లా శంకర్, అన్నపురెడ్డి వెంకటస్వామి ,వసుపులేటి ప్రసాద్, సుబ్బు, సురేష్ ,సమ్మెట నరేంద్ర, మధు, కిరణ్ ,శేఖర్ ,హర్ష శ్రీనివాస్ రావు, నాగయ్య, వీర మహిళ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు .

శివపురి కాలనీలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శివపురి కాలనీ లోని సోమవారం కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ కార్యాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, వేద పఠనం చేశారు. ఈ సందర్భంగా అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణ ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని భక్తులు డిజిటల్ స్క్రీన్ పై వీక్షించారు. కార్పొరే టర్ మాట్లాడుతూ... అయోధ్యలోని రామ మందిరంలో చారిత్రాత్మక ఘట్టం నేడు ఆవిష్కృత మైందన్నారు. కార్యక్రమంలో స్థానిక వ్యాపారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | జనవరి 24 2024 | www.navatelangana.com

'యువగళంతో నవశకానికి పునాదులు వేసిన లోకేష్'

ఓయూలో లోకేష్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కొడుకు నారా లోకేష్ తాత తగ్గ మను వడని, తం డ్రికి తగ్గ తనయుడని జాతీయ చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసో సియేషన్ అధ్యక్షుడు తలారి శ్రీనివా సరావు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి సమ న్వయకర్త నారా లోకేష్ జన్మదిన వేడుకల కార్యక్రమం సందర్భంగా కేక్ కట్ చేసి ఆహార పదా ర్థాలు, ఓయూలో స్కావెంజర్స్‌కు బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపీ, సతీష్ గౌడ్, సతీష్, వేణు, రాము, విరేశ్ ,నాగరాజు,రాజు, వంశీకృష్ణ , వీరబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

యాదాద్రి శ్రీలక్ష్మినర్సింహా స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు మంగళవారం యాదాద్రి శ్రీ లక్ష్మినర్సింహా స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శించుకున్న వారిలో మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మెన్ నాగరాజు యాదవ్, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, నాయ కులు పోలీస్ గోవింద్ రెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

దేశం కొత్తదనాన్ని కోరుకుంటుంది



- మామిళ్లపల్లె వెంకట్రామ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

దేశం ఆధునీకతను కోరుకుంటుందని, 'రెనో ఇం డియా' కోసం యూరప్‌లో ఉన్న నాలుగు ప్రధాన కేంద్రా లలో భారతదేశం ముఖ్యమైందని ఉత్పత్తి పోర్ట్ పోలి యోను విస్తరించేందుకు వచ్చే మూడేండ్లలో ఐదు ఉత్పత్తులు ప్రారంభించనున్నట్లు ఆపరేషన్స్ కంట్రీ సీఈఓ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మామిళ్లపల్లె వెంకట్రామ్ తెలి పారు. మంగళవారం బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హెూటల్ లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. హెడ్ సెల్స్ నెట్ వర్క్ ఇండియా శంషోద్దిన్ షాహల్‌తో కలిసి 3మోడళ్లలో 5 కొత్త డిజైన్లతో కూడిన ఆటో మేటిక్ కార్లను మంగళ వారం ఆవిష్కరించారు. అనం తరం ఆయన మాట్లాడు తూ 2024లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నంతో రూపొం దించిన నూతన మోడల్స్ కైజర్, ట్రైబర్, క్విడ్ కస్టమర్ బేస్‌ని విస్తరించేందుకు 3 మో డళ్లలో 5కొత్త డిజైన్లనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్లోబల్ ప్రీఓన్డ్ కార్ బిజినెస్ రెన్యూను భారతదేశంలో ప్రారంభించి రెనా ల్యూషన్ ఇండియా 2024 కింద, భారతీయ మార్కెట్‌లో గణనీయమైన స్థిరత్వాన్ని సంపాదించినం దు కు రెనో ఇండియా సంతోషిస్తోందని తెలియజేశారు.

గాడి తప్పిన గ్రౌండ్ నిర్వహణ

- దుమ్ము ధూళితో గ్రౌండ్‌లో ఇబ్బంది పడుతున్న వాకర్స్
- ఇక సెలవు రోజుల్లో వాకింగ్..అంటే జంకుతున్న వాకర్స్
- కనీస వసతులు కరువు.. నిరుపయోగంగా మారిన క్రీడాగదులు





నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్ పరిధిలోని లాలపెట్‌లోగల ప్రొ.జయశంకర్ స్టేడియాన్ని పట్టిం చుకునే నాధుడు కరువయ్యారని, కనీసం ఇటువైపు కన్నెత్తి చూసే క్రీడాధికారులు కరవయినట్లు, గ్రౌండ్‌ను పర్యవేక్షించే అధికారుల పట్టింపు లేక పలు సమ స్యలకు నిలయంగా స్టేడియం మారిందని పలువురు స్థానికులు తెలిపారు.దీనితో నిత్యం ఇక్కడికి వచ్చి వాక ర్స్, క్రీడాకారులు, వృద్ధులు తదితరులు అనా రోగ్యం తో బాధ పడు తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ క్రీడాధికా రులు, సికింద్రా బాద్ క్రీడా విభాగానికి సబంధించిన సిబ్బంది కనీసం పట్టించుకో పోవడంతో గ్రౌండ్ సమస్యలకు కేరాఫ్‌గా మారింది.ఈ గ్రౌండ్‌లో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగానే స్థానికులు, చు ట్టుపక్కల ప్రజలు, వృద్ధులు వాకింగ్‌తో పాటుగా ఇక్కడే ఉన్న ఓపెన్‌జీమ్‌కువస్తారు. అయితే సెలవు రోజుల్లో ఇటు గ్రౌండ్‌లో వాకింగ్ చేయాలన్న, అటు ఓపెన్ జీమ్‌కు రావాలన్న బెంబేలెత్తి పోతున్నారు పలువురు వాకర్లు, జాగింగ్ చేసే వారు.స్థానికంగా, చుట్టుపక్కల ఉన్న విద్యార్థులు, చిన్నారులు ఉదయం నుంచి సా యంత్రం వరకు క్రికెట్ ఆడుతున్న సందర్భంగా పలుమార్లు వాక ర్స్‌కు బాల్‌తగిలి ప్రమాదల నుండి తృటిలో తప్పి ంచుకున్నారు. దీనితోవారు క్రికెటర్స్‌తో వాగ్వాదం చోటుచేసు కుంది. పదుల సం ఖ్యలో ఇక్కడ జట్లుగా క్రికెట్ ఆడు తున్న వేళా బాల్స్ ఎటు నుండి వచ్చి తగులుతుందో అన్న భయభ్రాంతులకు గురై అటు వాకింగ్‌కు ఇటు ఓపెన్ జీమ్‌కు వచ్చే వారు గత్యంతరం లేక సెలవు రోజుల్లో గ్రౌండ్‌కు రావడం మానేస్తున్నారన్నారు.

సమస్యలకు కేరాఫ్‌గా మారిన గ్రౌండ్

ఇక గ్రౌండ్ పూర్తిస్థాయిలో దుమ్ము దుమ్ముగా మారి దుమ్ము లేస్తుంది. ఇక గ్రౌండ్‌లో అనేక చోట్లా విద్యుత్ బోర్డ్స్ ఉడి ప్రమా దంగా ఉన్నాయి. మరుగుదొడ్లు దుర్వాసన సమస్య తదితర ఇబ్బ ందులతో బాధపడుతున్నట్లు తెలిపారు. గ్రౌండ్ వరండలో గోడ కూలిపోగా, ఇక్కడ ఉన్న స్టోర్ రూమ్స్‌కి డోర్స్ ఊడిపోయి ఇక్కడే కొందరు మూత్రవిసర్జన చేయడం చాలా ఇబ్బందికరంగా ఉం టుందన్నారు. రాత్రిపూట కొందరు గ్రౌండ్‌లో మద్యం సేవిస్తున్నట్లు స్థానికులు చెపుతున్నారు.ఇక గ్రామసింహాలుగుంపులు (కుక్క కలు),గుంపులుగా సంచరిస్తూ వృద్ధులు, చిన్నారులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న వృద్ధులు తమకి కేటాయించిన రూమ్ తెరవడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కరాటే శిక్షణకు ఒక రూమ్ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్న ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీమ్‌లో ఉన్న నాలుగు బెంచీలు ఇరిగిపోగా అక్కడ పరికరాలు కొన్ని మరమ్మతులు చేసే నాధుడు కరువయ్యారు. జిమ్, జిమ న్నాస్టిక్స్ ,షెటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడా కారులు నెల నెల ఫీజులు చెల్లిస్తున్న కనీస సౌకర్యాలు కల్పించడం స్పోర్ట్స్ విభాగం వైఫల్యం వల్ల





క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే గ్రౌండ్‌లో గత 3 సంవ త్సరాల నుండి స్విమింగ్ పుల్ నిర్మాణ పనులు జరుగుతు న్నాయి. సదరు కాంట్రాక్టు పుణ్యమా అంటూ గ్రౌండ్‌లో పలుచోట్ల సైజు రాళ్లు, కంకర, ఇసుక , గ్రౌండ్‌లో ఎక్కడ పడితే అక్కడ పలు చోట్ల పోయడంతో గ్రౌండ్ కుచించుకు పోయి వాకర్స్‌కు ఇబ్బందు లుఎదుర్కొంటున్నారు.ఇక ఇక్కడ సెక్యూరిటీ గార్డ్స్ ఉన్న స్టేడి యం లోపల జరగాల్సిన కార్య క్రమాలు అన్ని జరుగుతున్నా యని గ్రౌండ్‌కి వచ్చే వారు ఆరోపి స్తున్నారు. గత కొన్ని సంవ త్సరాలుగా ఇక్కడ ఉంటున్న స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాత్రం కనీసం గ్రౌండ్ వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కొన్ని గదులలో జీహెచ్ ఎంసీకి సంబంధించిన క్రీడా వస్తువులు, మరికొన్ని గదులలో స్విమ్మింగ్‌పూల్ కోసం వర్క్ చేస్తున్న కార్మికులు ఉంటున్నారన్నారు.

ఓయూలో బోధనేతర ఉద్యోగుల క్రీడలు



నవతెలంగాణ-ఓయూ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం నుండి ఓయూలో గ్రౌండ్‌లో మూడు భోదనేతర ఉద్యోగ సం ఘాల ఆధ్వర్యంలో వివిధ క్రీడలు ముమ్మరంగా జరుగు తున్నాయని ప్రొఫెసర్లు తెలిపారు.ఈ సందర్భంగా మం గళవారం క్రీడాకారులను ఓయూ సైన్సు కళశాల ప్రిన్సిపాల్ ప్రొ.బోయిళ్ళ వీరయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ. రాజేష్ కుమార్‌లు టాస్ వేసి క్రీడాకా రులను పరిచయం చేసుకుని ప్రోత్సాహించారు. నాయకుడు బియ్యాన్ని జ్ఞానే శ్వర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మహిళ ,పురుష ఉద్యోగులకు వేరుగా వేరుగా క్రికెట్, షటిల్, క్యారమ్స్, టెన్నికాయిట్, వాలీబాల్ పోటీలు ఓయూలో సైన్సు, టెక్నాలజీ కాలేజ్ లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు రాంగోలి, త్రో బాల్, పురుషులకు వాలీబాల్, క్యారమ్స్ తదితరల క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రవి, నాగరాజ రావు, విజయ్ కుమార్, శివ శంకర్, అక్బర్ బేగ్ ,భూమ య్య, శంకర్ నాయక్, పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 79 ద్వారా లబ్ది చేకూర్చే ప్రయత్నం చేయండి

- అర్హులైనవారికి కారుణ్య నియామక ఉద్యోగాలు చేపట్టాలి
- మంత్రులకు పలువురు అభ్యర్థుల విజ్ఞప్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

అర్హతనుబట్టి కారుణ్య నియామకాలను భర్తీ చేయాలని, జీవో నెంబర్ 79ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చే ప్రయత్నం చేయాలని, పలువురు అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ జిల్లా కు చెందిన దాదాపు 60 మంది అభ్యర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దాదాపు ఆరు సంవత్సరాల నుంచి తాము ఉద్యో గాల కోసం ఎదురుచూస్తున్నామని, ప్రభుత్వం జీఓ నెంబర్ 79 ద్వారా 1266 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్ గ్రేడ్ చేసి వివిధ కలశాకలకు చెందిన కారుణ్య నియామకాల ఉద్యోగులను భర్తీ చేసిందని, తమకు మాత్రం అటువంటి అవకాశం ఇవ్వకుండా స్థానిక సంస్థల అభ్యర్థులనే నెపంతో అవకాశం కల్పించకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తపరిచారు. గత ప్రభుత్వం పక్షపాత వైఖరిలో రాష్ట్రంలోని 7జిల్లాలకు చెందిన జిల్లా పరి షత్ అభ్యర్థులకు మాత్రం ఉద్యోగాలు ఇచ్చి మిగిలిన వారికి అన్యాయం జరిగి ందని, ఈ ప్రభుతమైన తమకు న్యాయం చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. మంగళవారం పలువురు అభ్యర్థులు సోమవారం ప్రజావాణి లో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కలిసి తమ సమస్య లను పరిష్కరించి న్యాయం చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు నిర్మాణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు



నవతెలంగాణ-ఓయూ

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నూతన హైకోర్టు నిర్మాణ నిర్ణ యం వ్యవసాయ యూ నివర్సి టీలో నిర్మించడాన్ని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు తీవ్రంగా వ్యతిరేకిం చారు. ఈ సంధ్బంగా వా రు విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ ఉన్నత విద్యాను అందిం చే విశ్వవిద్యాలయాలకు అనుగు ణగా నిర్ణయాలు ఉండాలని, కానీ ఆ విశ్వవిద్యాలయాల భూములను పాల కుల స్వలాభం కోసం ధారాదత్తం చేయ డాన్ని తీవ్రంగా వ్యతిరకిస్తున్నామని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో అరుదైన మెడిసిన్‌కు సంబంధించి కొన్ని మొక్కలు ఉన్నాయని, వాటిని ధ్వం సం చేసి, వ్యవసాయం మీద పరిశోధనలు జరగకుండా కుట్ర చేసే ప్రయత్నంను తీవ్రంగా వ్యతిరే కించారు బీఆర్ ఎస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంగా నూతన హైకోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకించడం లేదు, యూనివర్సిటీలో భూ ములను నిర్లక్ష్యంగా లాక్కొని హైకోర్టు కడుతాం అనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఆ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేని యెడల యావత్ తెలంగాణ విద్యార్థి లోకాన్ని జాగృతం చేసి ఆందోళనలు, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని తుంగబాలు హెచ్చరించారు.

31లోగా ఈకేవైసీ నమోదు తప్పనిసరి

- ఆహార కార్డుదారులకు అధికారి విజ్ఞప్తి



నవతెలంగాణ-బేగంపేట్

డివిజన్ పరిధిలోని ఆహార భద్రత కార్డుదారులు ఈ నెల 31వ తేదీలోగా సమీపంలోని చౌకధరల దుకాణా లకు వెళ్లి బయోమెట్రిక్ మిషన్ మీద వేలిముద్రలు వేసి తమ కేవైసీని నమో దు చేసుకోవాలని సర్కిల్ 8 సివిల్ సప్లై అధికారి జ్యోతి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బేగం పేట్‌లోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గత ఏడా ది సెప్టెంబర్ 23 నుంచి సర్కిల్-8 పరిధి లోని రేషన్ షాపుల్లో కేవైసీ నమోదు ప్రక్రియ ఈనెల 31 తేదీలోపు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. సర్కిల్-8 పరిధిలోని67 షాపుల్లో ఉన్నాయని రేషన్ తీసుకునేవారు తప్పని సరిగా కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

పురాతన కట్టడాన్ని సందర్శించిన మోతె శ్రీలత శోభన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

పురాతనమైన నిజాం హయాంలో కట్టిన లాలాపేట్ కమాన్‌ను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి టీఎస్ఎస్‌పీడీసీఎల్, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మట్లాడుతూ. శిథిలా వస్థలో ఉన్న లాలాపేట్ కమాన్‌కు మరమ్మతులు చేయలని జీహెచ్ఎంసీ సంబంధిత అధికా రులకు అదేశాలు జారీ చేశారు. కమాన్‌కు అనుకొని ఉన్న వృక్షాలు, కొమ్మవేర్ల వల్ల లాలాపేట్ కమాన్ కూలిపోయే స్థితికి చేరుకుందని, తక్ష ణమే చెట్ల కొమ్మలను తొలగించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 11కెవి విద్యుత్ లైన్లు వెళ్తున్నం దున అధికారులు కూడా సహకరించాలని అందుకు అవస రమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పురాతన కట్టడాలను కాపాడుకోవడం మన అందరి బాధ్యతగా భావించాలని డిప్యూటీ మేయర్ కోరారు. ఈ కార్యక్ర మంలో టీపీఎస్ఎస్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్‌రాజేష్, జీహెచ్ఎంసీ అర్బికల్చర్ విభాగ తార్నాక ఇంచార్జ్ సింధుజ, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేష్, ఎంటమాలజీ విభాగం రాజశేఖర్, బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి



- విద్యా కాషాయీకరణ, విద్యా ప్రయివేటీకరణ కోసమే నూతన విద్యా విధానం
- ప్రొ. ఖాసీం, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-ఓయూ

రాజ్యాంగ మౌళిక సూత్రాలకు సూత్రాలకు వ్యతిరే కంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020 లోపాల పుట్టని, ప్రజలందరూ దీనిని తిరస్కరించాలని ఓయూ తెలుగు విభాగం హెడ్ ప్రొ.ఖాసీం విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వ ర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సం తకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా హాజరైన ప్రొ. ఖాసీం మాట్లాడుతూ ప్రభుత్వ విద్య ను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 తీసుకొచ్చారని ప్రొఫెసర్ కాసీం విమర్శించారు. విద్యా కార్పొరేటికరణ, కాషాయికరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని ఆయన అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగ సమస్యలను గాలికి వదిలేసాయని, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థులు సమ రశీల ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మణి కంఠ రెడ్డి,ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, గ్యార క్రాంతి, నెల్లి సత్య, యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, నాయకులు ఉదయ్, లెనిన్, శివ, చైతన్య, అన్వర్, వంశీ, చిన్నా, గోపి, హరీష్, అరుణ్ , శ్రీకాంత్, అశ్విన్ , మధు పాల్గొన్నారు.

ఘనంగా ఓయూ ఎంబీఏ విభాగం స్వర్ణోత్సవాలు



- సమాజానికి మంచి విద్యార్థులను అందజేయాలి
- ప్రొ.ఆర్.లింబాద్రి

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగం(ఎంబిఏ), స్వర్ణోత్సవాలు మంగళవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభించారు. గత యాభై ఏండ్లలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం వేలాది విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పిందని, సమా జానికి మెరికల్లాంటి నిపుణులను అందజేసిందని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి అన్నారు. అంకిత భావానికి, నైపుణ్యానికి వేదికగా నిలిందన్నారు. బిజినెస్ మేనేజ్మెంట్ రంగంలో ఓయూకు బలమైన ప్రపంచ స్థాయి పూర్వ విద్యార్థుల సమూహం ఏర్పడిందని ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ప్రొ.వి. వెంకటరమణ అన్నారు. ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.బిజినెస్ మేనేజ్మెంట్ రంగంలో ఓయూ ప్రత్యే కతను వివరించారు. ఎంబిఏ గ్రాడ్యుయేట్‌లకు ప్రపంచ అవకాశాలను, పరి శ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల డిమాండ్లను తీర్చడానికి విభిన్న, లోతైన స్పెషలై జేషన్ల అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. పి.వెంక టయ్య,హెడ్ ప్రొ. డి.శ్రీరాములు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్‌పర్సన్ ప్రొ. స్మిత సాంబ్రాణి, ప్రొ. వై.జహంగీర్, ప్రొ. సంపత్ కుమార్, ప్రొ. జి. విద్యాసాగర్ రావు, ప్రొ. వి. సమున్నత, ప్రొ. జి. నరేష్ రెడ్డి, డాక్టర్ జి. విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

ఓయూలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-ఓయూ

దావోస్ కేంద్రంగా జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీగా పెట్టుబడులు తీసుకొచ్చిన సందర్భంగా మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజి ఎదుట ఓయూ జేఏసి రాష్ట్ర చైర్మన్, టీపీసీసీ నాయకులు కొప్పుల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొప్పుల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రేవంత్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలం గాణ రాష్ట్ర భవిష్యత్ కోసం దార్శనికత కలిగిన రేవంత్‌రెడ్డి ,వారిపై రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు నమ్మకం ఉందని, పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు, బంజారా జనసం ఘం అధ్యక్షులు బిక్షపతి నాయక్, నాయకులు పూసల రమేష్, మండ్ల రవి, బంజారా భేరి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నామునాయక్, యువజన విభాగం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో సుభాష్ చంద్రబోస్ జయంతి





నవతెలంగాణ-కంటోన్మెంట్

న్యూబోయినపల్లి నేతాజీనగర్ మంగళవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడు కలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోర్డు మాజీ ఉపాధ్య క్షు డు జంపన్న ప్రతాప్ నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జంపన ప్రతాప్ మాట్లాడు తూ స్థానిక బస్తీవాసుల కోరిక మేరకు 25 ఏండ్ల క్రితం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ విగ్రహం ఏర్పాటు చేశామని, అప్పటి నుండి ప్రతి ఏడు నేతాజీని స్మరిస్తూ బస్తీవాసులను భాగస్వాములను చేస్తూ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయ కులు ముప్పిడి మధుకర్, బస్తీవాసులు వెంకట్, సిద్ధు, నాగేష్, ముకేశ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన దత్తాత్రేయ

కార్పొరేటర్ దీపికనరేష్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆల్ఫా హెూటల్ ఎదురుగా ఉన్న నేతాజీ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ సీనియర్ నేతలు రాజశేఖర్ రెడ్డి , రవీందర్ అశోక్ కుమార్, సర్వేషు, సురేష్, అంజన్, మురళి నరేందర్ తరుణ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్‌బీ అధ్వర్యంలో చంద్రబోస్ జయంతి


నవతెలంగాణ-ఓయూ

నేతాజీ జయంతిని దేశ్ ప్రేమ్ దివస్‌గా ప్రకటిం చాల ని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాకీమ్‌నవీద్ డిమా ండ్ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాకీ మ్‌నవీద్ మాట్లాడుతూ భారత దేశ స్వాతం త్రం ఉద్యమంలో నేతాజీ అలుపెరగని పోరాటా లను చేసిన ఘన చరిత్ర నేతాజీదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కోశాధికారి రోహిత్, ముబీన్, అరవింద్, మనోజ్ ,నితిన్ పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంక టేశ్వరా కాలనీ డివిజన్ సకలజనుల స్ఫూర్తి దాయకుడు రాముడు అని, అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సం దర్భ ంగా బంజారా హిల్స్ సుఖ్ దేవ్ నగర్ రోడ్ నెంబర్ 4 హనుమాన్ రామాలయం లో రామచంద్రుల విగ్రహాలకూ పలువురు భక్తు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికి అన్నదానం చేశారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



'మనలో సగం మంది వెనకే ఉంటే సంపూర్ణ విజయం సాధించలేం. ప్రపంచ వ్యాప్తంగా సోదరీమణులు ధైర్యంగా ముందుకొచ్చేలా మనం చెయ్యాలి. వారంతట వారు శక్తిని సంపాదించుకునేలా చెయ్యాలి. తమ శక్తి సామర్థ్యాలను వారు తెలుసుకునేలా చెయ్యాలి' అంటారు మలాలా యూసఫ్‌జాయ్. మన దేశంలో ఆడపిల్ల పుట్టింది అంటే మహాలక్ష్మీ పుట్టింది అంటారు. ఆడపిల్లలేని ఇల్లు శూన్యంగానూ, వేలితిగానూ ఉంటుంది అంటారు. ఆడపిల్ల ఇంటికి మహారాణి అంటూ గొప్పగా చెబుతుంటారు. కానీ అటువంటి ఆడపిల్లను నేడు అనేక రకాలుగా వివక్షకు గురి చేస్తున్నారు. కట్టుబాట్లతో జీవితంలో ఎదగడానికి అనేక అవరోధాలని కలిగిస్తున్నారు. అసలు ఆడపిల్ల అంటే ఎందుకు అంత చిన్నచూపు చూస్తున్నారో... ఆడపిల్లను ఎలా కాపాడుకోవాలో 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా తెలుసుకుందాం...

ఆడపిల్లను కాపాడుకుందాం...

ప్రతి ఏడాది జనవరి 24న 'జాతీయ బాలికా దినోత్సవం' జరుపుకుంటున్నాం. మన సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేలా, బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జరుపుతున్నదే ఈ దినోత్సవం. కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రతి సారి ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కలిగిస్తూ దేశంలో బాలికలను ముందుకు నడిపించేందుకు గట్టిగా ప్రయత్నిస్తోందని ప్రచారాలు చేస్తున్నారు. అయితే ఇదంతా నిజమేనా అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కచ్చితంగా వస్తుంది. నేడు అమ్మాయిలపై జరుగుతున్న దాడులు, హింసనే ఈ అనుమానానికి ప్రధాన కారణం.

వివక్ష పోవాలనీ...

జాతీయ బాలికల దినోత్సవం మొట్టమొదట 2008లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ఈరోజు ప్రాధాన్యత ఉద్దేశం ఏమిటంటే సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ ఆధారిత వివక్ష గురించి అవగాహన కల్పించడం, బాలికల పట్ల వైఖరిలో మార్పు తీసుకురావడం, బాలికల పరిస్థితు లను మెరుగుపరచడం. ముఖ్యంగా బాలికల పట్ల ఉన్న వివక్ష పోవాలని, వారి హక్కుల గురించి, తీసుకోవలసిన ఆహారం గురించి, విద్యను అభ్యసించి ఎటువంటి పరిస్థితులు ఎదురైన తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వాతంత్రంతో జీవితంలో ఎంత ధైర్యంగా ముందుకు వెళ్ళవచ్చో అనే అంశాలపై అవగాహన కల్పించే కృషి చేస్తున్నారు.

ఆడపిల్లలను కాపాడుకోవాలి

కానీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లు గడిచినా కడుపులో బిడ్డ పడగానే ఆడపిల్ల అయితే వెంటనే అబార్షన్ చేయించుకుంటున్న వారిని ఎందరినో చూస్తున్నాం. ముందుగా వీటిపై అవగాహన కల్పించాలి. ఆడపిల్లకు సరైన రక్షణ కల్పించి, మానసికంగా ధైర్యవంతురాలిని చేసిన నాడు ఆమె ఎన్నో విజయాలను సాధించగలదు. ముందు వివక్ష అనేది ఇంటి నుండే రూపు మాపాలి. తల్లిదండ్రులు ఆడపిల్లకు ప్రోత్సాహాన్ని ఇస్తూ, వారు కోరుకున్న రంగంలో ఎదగడానికి అండగా నిలబడాలి. అలా కాకుండా 'నీకెందుకు ఈ చదువులు, ఆడపిల్లవు ఉద్యోగం ఎందుకు, పెండ్లి చేసి పంపిస్తాం, మా బాధ్యత తీరిపోతుంది' అని అంటున్న వారిని నేటికీ చూస్తునే ఉన్నాం. ఇంట్లో కొడుకు వుంటే 'వాడికేంటి మగ పిల్లాడు, రేపు మమ్మల్ని చూసేది వాడే' అనే మాటలు కూడా మన చెవిన పడుతూనే ఉన్నాయి. ఇలాంటి మాటలు మానేసిన నాడు సమాజంలో ఆడపిల్లకు గౌరవం పెరుగుతుంది.

నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

దురదృష్టం ఏమిటంటే మన నరనరాల్లో ఆడపిల్ల పట్ల వివక్ష జీర్ణించుకుపోయింది. తరతరాలుగా ఆడపిల్లలను ఒక యంత్రంగానే చూస్తున్నారు. ఇంటి పని, వంట పని చేయడం కొరకే తప్ప, వారికి ఒక మనసు ఉంటుందని, దానికి కొన్ని కోరికలు ఉంటాయని, వాటిని అర్థం చేసుకునే బాధ్యత సమాజానికి లేకపోవడం శోచనీయం. కాలం మారింది. పరిస్థితులు కొంత వరకు మారాయి. నేటి తరంలో మరింత మార్పు రావాలి. దాన్ని దృష్టిలో పెట్టుకొని బాలికలపై నిర్లక్ష్య వైఖరి విడనాడాలి. కాలానికి అనుగుణంగా ఆడపిల్లని ఎదగనివ్వాలి. తిరుగులేని శక్తులుగా వారు అవతరిం చేలా చేయూతనివ్వాలి. ఉత్తమ సమాజాన్ని చూడాలన్నా, మంచి భవిష్యత్తు కనిపించాలన్నా, రేపటి రోజులు బాగుండాలన్నా, మనం చేయవలసింది బాలికలకు ప్రోత్సహించడం. వారి బంగారు భవిష్యత్తుకై అవకాశాలు కల్పించడం.

తన సత్తా చూపగలదు

ఆడపిల్ల మమతకు మారుపేరు. తన ఓర్పుతో కఠిన హృదయాలను కరిగించగలదు. అవకాశం ఇస్తే ప్రపంచాన్ని పాలించగలదు. తన సత్తా ఏమిటో చూపగలదు. కాబట్టి ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం. ఆడపిల్ల ఇంటికి, దేశానికి గర్వకారణం. అమ్మాయి అంటే అమ్మకు కొనసాగింపు. నాన్నను కంటికి రెప్పలా చూసుకొనే మరో అమ్మే అమ్మాయి. తల్లికి తన తల్లిలా సహకరించేదే అమ్మాయి. తోడబుట్టిన వాడికి తల్లిలా తోడుండేదే అమ్మాయి. అమ్మాయి అంటే కాబోయే అమ్మ. అందుకే కొడుకులు ఎంతమంది ఉన్నా, ఒక్క కూతురన్నా ఉంటేనే ఆ ఇంటికి కళ.


జాతీయ బాలికా దినోత్సవ లక్ష్యాలు

లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం: జాతీయ బాలికా దినోత్సవం లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, బాలికలపై వివక్ష చూపే లింగ మూస పద్ధతులను సవాలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

సాధికారత కల్పించడం: విద్య, నైపుణ్యాలతో వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి అవకాశాలు కల్పించి బాలికల సాధికారతను ఈ రోజు నొక్కి చెబుతుంది.

హక్కులను పరిరక్షించడం: బాలికల హక్కుల గురించి అవగాహన పెంచి జాతీయ బాలికా శిశు దినోత్సవం లింగ ఆధారిత హింస, బాల్య వివాహాలతో పాటు ఇతర సమస్యల నుండి వారిని రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది.

- పాలపర్తి సంధ్యారాణి





చివర్లు చిట్లకుండా...

జుట్టుకు సరైన పోషణ అందించడం కూడా చాలా ముఖ్యం. జుట్టు పొడవుగా ఉన్నా, పొట్టిగా ఉన్నా సహజంగా వేధించే సమస్య చివర్లు చిట్లడం. చివర్లు చిట్లిపోతే చాలు.. ఓ అందం ఉండదు. ఈ సమస్యను నివారించాలంటే...

- ముందు చివర్లు చిట్లిపోయిన భాగాన్ని కత్తిరించేయాలి.
- సమస్య మళ్లీ పెరగకుండా ఉండేందుకు కొన్ని ప్యాక్‌లు వేయాలి.
- గుడ్డు సొనలో మూడు చెంచాల ఆలివ్‌నూనె, చెంచా తేనె కలపాలి. దీన్ని కుదుళ్ల నుంచి జుట్టు చివర్ల వరకూ రాసుకుని సున్నితంగా మర్దన చేయాలి. అరగంటయ్యాక గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి.
- జుట్టు పొడవును బట్టి బొప్పాయి గుజ్జును తీసుకుని దీనికి సమానంగా పెరుగు కలిపి ఈ మిశ్రమాన్ని తలంతా రాసి కనీసం పది నిమిషాలు మర్దన చేయాలి. పదిహేను నిమిషాలయ్యాక గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేసుకోవాలి.
- బాదంనూనె, ఆలివ్‌నూనె, ఆముదాన్ని సమపాళ్లలో తీసుకుని మూడింటినీ కలిపి తలంతా పట్టించి మర్దన చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటిలో ముంచిన టవల్‌ను తలకు చుట్టుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఇలా వారంలో రెండుసార్లు చేయాలి.
- రెండు చెంచాల తేనె, రెండు చెంచాల పెరుగు, ఒక నిమ్మకాయ రసాన్ని తీసుకుని మూడింటినీ బాగా కలపాలి. దీన్ని జుట్టు చివర్లవరకూ వచ్చేలా రాసుకుని పదిహేను నిమిషాలు ఆరనిచ్చి, తరువాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేయాలి.
- బజార్లో మయోనైజ్ అని దొరుకుతుంది. పావుకప్పు తీసుకుని, అందులో చెంచా చొప్పున కొబ్బరి నూనె, ఆలివ్‌నూనె, తేనె వేసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు రాసుకుని అరగంట ఆగి కడిగేసుకోవాలి. ఇలా ప్రతి పదిహేను రోజులకోసారి చేస్తుంటే జుట్టు పట్టుకుచ్చులా మెరుస్తుంది.



దేవాలయ భూముల్లో కాటేజీలు

(మొదటిపేజీ తరువాయి)

మార్కెటింగ్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన దేవుడి మాన్యాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో తెలంగాణా భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. వన్యప్రాణుల దాడుల్లో ఎవరైనా మరణిస్తే పరిహారాన్ని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలను తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. దేవాదాయ, అటవీ శాఖలకు బడ్జెట్ నిధులను ఉదారంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ కమీషనర్ అనిల్ కుమార్, అటవీశాఖ ప్రిన్సిపాల్ సీసీఎఫ్ డోబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖపై సమీక్ష

అదనపు ఆదాయం వచ్చేలా వినూత్న మార్గాలను అన్వేషించాలని రవాణా శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వంపై ప్రజల్లో అంచనాలు ఎక్కువగా ఉన్నాయని, మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. మంగళవారంనాడాయన ప్రీ బడ్జెట్ ప్రతిపాదనలపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి కార్యక్రమం అమలులో ఆర్టీసీని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని చెప్పారు. రవాణా శాఖ పనితీరును మెరుగుపరచలాలనీ, అంతర్గత ఆదాయం, సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి ఆశించిన లేనందున, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాల్సి ఉందన్నారు.

ఆర్టీసీ పనితీరును ఆయన ప్రశంసించారు. మెట్రోరైలు తరహాలో ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు వివిధ నమూనాలతో అధ్యయనం చేయాలని సూచించారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరును మెరుగుపర్చాలనీ, చేతివృత్తుల వారి నైపుణ్యాలను పెంచేందుకు అధ్యయనం చేయాలని చెప్పారు. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంతో కొత్త బస్సులను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడిందనీ, అలాగే సంస్థలోరిక్రూట్‌మెంట్లు కూడా చేపట్టాల్సి ఉందని సమావేశంలో పాల్గొన్న రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం సంవత్సరానికి 300 మందికి ఓవర్సీస్ స్కాలర్ షిప్ మంజూరు చేస్తున్నారనీ, ఆ సంఖ్యను మరింత పెంచాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మే 10 నుంచి ఎంసెట్!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇతర ప్రవేశ పరీక్షలు ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్, పీజీఈసెట్, పీఈసెట్‌పైనా ఉన్నత విద్యామండలి కసరత్తును పూర్తి చేసింది. ఒకటి రెండు రోజుల్లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి ఆమోదం తీసుకుని తర్వాత ప్రవేశ పరీక్షల రాతపరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశమున్నది. అనంతరం వాటి కన్వీనర్ల పేర్లను ఉన్నత విద్యామండలి ఖరారు చేస్తుంది. గతేడాది ఎంసెట్ కన్వీనర్ డీన్ కుమార్, పీజీఈసెట్ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ శ్రీరాంవెంకటేశ్, లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి, ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ, ఐసెట్ కన్వీనర్ పి వరలక్ష్మి, పీఈసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్ వ్యవహరించారు. వారిలో లాసెట్, ఎడ్‌సెట్ కన్వీనర్లు ఉద్యోగ విరమణ పొందడంతో వారి స్థానంలో కొత్త వారిని ఉన్నత విద్యామండలి నియమించింది. మిగిలిన సెట్స్ పాత వారినే కన్వీనర్లుగా కొనసాగించే అవకాశమున్నది. అయితే ఈ ఏడాది ఎంసెట్ పేరు మారనుంది. మెడికల్ సీట్లను నీట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఎంసెట్ ద్వారా ఫార్మసీ సీట్లు భర్తీ అవుతున్నాయి. అందుకే ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ వచ్చేలా ఈఏపీ సెట్‌గా మార్చే అవకాశమున్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి ఇప్పటికే ప్రభుత్వానికి పంపించింది. ఆ ఉత్తర్వులు త్వరలోనే విడుదలవుతాయని తెలిసింది.

హామీలన్నీ అమలుచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వంద రోజుల్లో హామీలను అమలు చేసి తీరుతామని చెప్పారు. కేసీఆర్ నిర్వాకంతో రాష్ట్రం గుల్ల కావడంతో హామీల అమల్లో కాస్త జాప్యం జరుగుతున్నదన్నారు. నిరుద్యోగ భృతి మొదలు డబుల్ బెడ్ రూం ఇండ్ల వరకు హామీలను బీఆర్‌ఎస్ విస్మరించిందని విమర్శించారు. అలాంటి బీఆర్‌ఎస్ ప్రజలను రెచ్చగొడుతున్నదనీ, అదే పని గతంలో కాంగ్రెస్ చేసి ఉంటే కేసీఆర్ ఫాం హౌజ్ దాటకపోయే వారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదనీ, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జైలుకు పోవడం ఖాయమని హెచ్చరించారు. కాళేశ్వరంతో పాటు అన్ని అక్రమాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర కాంగ్రెస్ మ్యానిఫెస్టో సహకారం తీసుకుంటాం : ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మెన్ ప్రవీణ్ చక్రవర్తి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మంచి మ్యానిఫెస్టోను అందించడంతో దాన్ని రాష్ట్ర ప్రజలు విశ్వసించారని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మెన్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. మ్యానిఫెస్టో అంటే ప్రజలకు దగ్గరగా, అమలుకు నోచుకునే విధంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పబ్లిక్ ఫ్రెండ్లీగా, క్రోనీ క్యాపిటల్‌కు దూరంగా ప్రజావసరాలకు దగ్గరగా ఉండాలని చెప్పారు.

ఏఐసీసీ మ్యానిఫెస్టో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం నేతృత్వంలో రూపొందుతున్నదని తెలిపారు. దీని కోసం తెలంగాణ కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సహకారం తీసుకుంటామని చెప్పారు. ప్రతి రాష్ట్రం వెళ్లి ప్రజలు, నిపుణుల నుంచి సూచనలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్యంలో మ్యానిఫెస్టో ఒక ముఖ్యమైన సాధనమని చెప్పారు.

పౌర సమాజ నిపుణులు, సామాన్య ప్రజలతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సమావేశంలో పలు విషయాలపై చర్చించినట్టు తెలిపారు. ఈ చర్చల నుంచి ఒకట్రెండు సూచనలు ఏఐసీసీ మ్యానిఫెస్టోలో వెళతాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, మన్సూర్ అలీ ఖాన్, ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాంసాహారం సరఫరా చేయొద్దు

- ప్రాణ ప్రతిష్ట రోజు జొమాటోకు బీజేపీ పాలిత రాష్ట్రాల హుకుం

న్యూఢిల్లీ : అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట జరిగిన సోమవారం నాడు వినియోగదారులకు మాంసాహారం సరఫరా చేయవద్దంటూ బీజేపీ ఏలుబడిలోని ఐదు రాష్ట్రాల ప్రభుత్వాలు జొమాటోకు హుకుం జారీ చేశాయి. ఉత్తరప్రదేశ్, అసోం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అధికారులు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారని జొమాటో తెలిపింది. ఈ నిర్ణయంపై సామాజిక మాధ్యమాలలో విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజల ఆహార అలవాట్లను నిర్దేశించడమేమిటని నెటిజన్లు మండిపడ్డారు. తమకు నచ్చిన ఆహారాన్ని తీసుకునేందుకు ప్రజలకు ఉన్న హక్కుపై ఆంక్షలు విధించారని, మెజారిటీ ప్రజల సెంటిమెంటును గౌరవించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని విమర్శించారు. కాగా బీజేపీ పాలనలో ఉన్న అనేక రాష్ట్రాల్లో ప్రాణ ప్రతిష్ట రోజు మద్యం, మాంసం అమ్మకాలపై నిషేధం విధించారు. మాంసం దుకాణాలను మూసేయాలని ఆదేశించారు. ఇదిలావుండగా స్విగ్గీ కూడా తన అనుబంధ రెస్టారెంట్లకు ఓ సందేశాన్ని పంపింది. మాంసం, చేపలు, మద్యం అమ్మకాలపై సోమవారం రాష్ట్ర వ్యాప్త నిషేధం విధించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలియజేసిందని పేర్కొంది.



'ఈ ఆదేశాలకు అనుగుణంగా మీ మెనూ నుండి అన్ని రకాల మాంసాహార పదార్థాలను తొలగిస్తోంది. ఈ మెనూ తిరిగి మంగళవారం నుండి వినియోగంలోకి వస్తుంది' అని వివరించింది. హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా వినియోగదారులకు మాంసాహార పదార్థాలు అందించలేదు.

ఆ అధికారం పోలీసులకుందా?

న్యూఢిల్లీ : గార్బా ఉత్సవానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో 2022లో గుజరాత్‌లోని ఖెడా జిల్లాలో నలుగురు పోలీసులు ఒక స్తంభానికి ముస్లింలను కట్టివేసి బహిరంగంగా కొరడా దెబ్బలు కొట్టిన సంఘటనను సుప్రీం కోర్టు మంగళవారం పేర్కొంటూ అందుకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. 'మనుష్యులను స్తంభానికి కట్టేసి, కొట్టే అధికారం వారికి వుందా' అని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించి చట్టంలో ఏదైనా అధికారం వుందా అని జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రశ్నించారు.

పైగా దాన్నంతా వీడియోలు కూడా తీసుకున్నారని మరో న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా మధ్యలో జోక్యం చేసుకుంటూ వ్యాఖ్యానించారు. కోర్టును ధిక్కరించినందుకు తమకు 14 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ అక్టోబరులో గుజరాత్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ పోలీసు అధికారులు సుప్రీం కోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. వారిపై హైకోర్టులో తీసుకున్న కోర్టు ధిక్కార చర్యల అమలుపై బెంచ్ స్టే విధించింది.

పోలీసుల దూషణలు, కస్టడీలోని వారి పట్ల హింసాత్మకంగా వ్యవహరించడమన్నది కోర్టు ధిక్కార చర్యల కిందకు వస్తాయని 1996లో డి.కె.బసు తీర్పులో సుప్రీం పేర్కొంది. పోలీసులు, చట్టాన్ని అమలు చేసే ఇతర అధికారులు ఒక వ్యక్తిని వేధించి, దూషించడం నుంచి రక్షణ కల్పించడానికి సమాజంలో వ్యక్తమవుతున్న తీవ్ర ఆందోళనను ఆ తీర్పు ప్రముఖంగా ప్రస్తావించింది.

పోలీసుల తరపు వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దావె మాట్లాడుతూ, తమ క్లయింట్లు ఉద్దేశ్యపూర్వకంగా కోర్టును ధిక్కరించలేదని చెప్పారు. అయితే వారి వాదనలతో జస్టిస్ గవాయ్, సందీప్ మెహతాలు ఏకీభవించలేదు.

చట్టం గురించి తెలియకపోవడమనేది ఇప్పుడు చట్టంలో రక్షణగా మారిందా అని బెంచ్ ప్రశ్నించింది. డి.కె.బసు కేసులో చట్టం ఏం చెప్పిందన్నది ప్రతి పోలీసు అధికారి తెలుసుకోవాలని, అది వారి విధి అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న..

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 26 నెలలు జైలు జీవితం గడిపారు. జైలు నుంచి విడుదలయ్యాక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1952లో కర్పూరీ ఠాకూర్ మొదటిసారిగా బీహార్ శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. సోషలిస్టు పార్టీ టిక్కెట్‌పై తాజ్‌పురి అసెంబ్లీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత వరుసగా నాలుగు సార్లు శాసన సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1967లో బీహార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరోసారి 1970లో కర్పూరీ ఠాకూర్ బీహార్ ముఖ్యమంత్రి అయ్యారు. పేదలు, దళితుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. కర్పూరీ ఠాకూర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీహార్‌లో తొలిసారిగా లాభాపేక్షలేని భూములపై రెవెన్యూ పన్నును రద్దు చేశారు.

ధరణిపై కలెక్టర్లతో నేడు సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి, వాటి పరిష్కారం తదితర వివరాలతో మధ్యంతర నివేధిక ఇవ్వాలని మంత్రి వారికి సూచించినట్టు తెలుస్తోంది. కలెక్టర్ల సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఆ కమిటీ కన్వినర్ సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ఎమ్మార్వో, ఆర్డీవో విచారణలు, వారి పరిధిలో పరిష్కారం అయ్యే అంశాలు, న్యాయ సంబంధమైన వివాదాలు, నిజామాబాద్ భూ భారతి స్టేటస్ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమస్యలపై కమిటీ లోతుగా అధ్యయనం చేసి ఈ నెలాఖరు వరకు మధ్యంతర నివేదిక ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఆ ముగ్గురి పేర్లు ఖరారు..

(మొదటిపేజీ తరువాయి)

ఓట్లు రెండు లక్షలున్నాయనీ, ఇది పార్టీకి కలిసొస్తుందంటూ ఆయన చెబుతున్నారు. ఇక సికింద్రాబాద్ స్థానం నుంచి టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మెన్, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇదే విషయాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలతోపాటు గతంలో తాను బీజేపీలో ఉన్నప్పుడు కూడా సికింద్రాబాద్ ఎంపీ స్థానంలో పని చేశాననీ, ఇప్పుడు అది తనకు కలిసొస్తుందని ఆయన చెబుతున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలతో తనకున్న సంబంధాలు బీఆర్‌ఎస్‌కు అదనపు బలంగా మారుతాయని ఆయన అంచనా వేస్తున్నారు. అందువల్ల తనకు టిక్కెట్ ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. అయితే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కుమారుడు సాయికిరణ్ రూపంలో ఆయనకు తీవ్ర పోటీ ఎదురవుతోందని తెలంగాణ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక నల్లగొండ, భువనగిరి స్థానాలకు విపరీతమైన పోటీ నెలకొంది. నల్లగొండ నుంచి తన కుమారుడు అమిత్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వాలంటూ శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరుతున్న సంగతి తెలిసిందే. సీనియర్ నేతలు తేరా చిన్నపరెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి కూడా ఆ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, క్యామ మల్లేశ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు గౌడ్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. వీటితోపాటు మిగతా స్థానాలకు కేసీఆర్ ఎవరెవరిని అభ్యర్థులుగా ఖరారు చేస్తారో వేచి చూడాలి.

'కేరళ నిరసన కార్యక్రమం'లో పాల్గొననున్న స్టాలిన్

(మొదటిపేజీ తరువాయి)

విధించిన ఆర్థిక ఆంక్షలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 8న ఢిల్లీలో విజయన్, అతని మంత్రివర్గ సహచరులు, ఇతర ప్రజాప్రతినిధులు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.



వరల్డ్ నం.1, సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్ 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేట తుది అంకానికి చేరుకుంటుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్స్ సింగిల్స్‌లో అలవోక విజయాలతో సెమీఫైనల్స్‌కు చేరుకున్న జకోవిచ్.. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఏకంగా 48వ సారి ఈ ఘనత సాధించాడు. మహిళల సింగిల్స్‌లో సబలెంక, కొకొ గాఫ్ సైతం సెమీఫైనల్లో ప్రవేశించారు.

సెమీస్‌లో జకోవిచ్

- క్వార్టర్స్‌లో ఫ్రిట్జ్‌పై గెలుపు
- రూబ్లెవ్‌పై జానిక్ సిన్నర్ పైచేయి
- కొకొ గాఫ్, సబలెంక సైతం అడుగు
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)

గ్రాండ్‌స్లామ్ ఓపెన్ శకంలో దిగ్గజం మార్గరెట్ కోర్టు 24 టైటిళ్ల రికార్డును అధిగమించేందుకు నొవాక్ జకోవిచ్ (సెర్బియా) రంగం సిద్ధం చేస్తున్నాడు. మంగళవారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ అలవోక విజయం నమోదు చేశాడు. 7-6(7-3), 4-6, 6-2, 6-3తో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై విజయం సాధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్స్‌కు చేరుకోవటం జకోవిచ్‌కు ఇది 48వ సారి కావటం విశేషం. మరో క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్ ఆండ్రీ రూబ్లెవ్‌పై జానిక్ సిన్నర్ 6-4, 7-6(7-5), 6-3తో విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ సర్క్యూట్‌లో అరినా సబలెంక, కొకొ గాఫ్‌లు సెమీఫైనల్లో సమరానికి సై అంటున్నారు.

ఎదురులేదు

టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్‌కు క్వార్టర్స్‌లో ప్రతిఘటన ఎదురు కాలేదు. 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ ఓ సెట్‌లో గెలుపొంది ఊరట చెందాడు. 3 గంటల 45 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో జకోవిచ్ 20 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరిశాడు. పాయింట్ల పరంగా 148-121తో అదరగొట్టాడు. జకోవిచ్‌కు సర్వ్‌ను అంత సులువుగా కోల్పోని టేలర్ ఫ్రిట్జ్ విమర్శల మెప్పు పొందాడు. విన్నర్లు కొట్టడంలో జకోవిచ్‌పై టేలర్ పైచేయి సాధించాడు. జకోవిచ్ 52 విన్నర్లు సాధించగా, టేలర్ ఫ్రిట్జ్ 63 విన్నర్లతో రాణించాడు. జకోవిచ్ 26 అనవసర తప్పిదాలు చేయగా.. టేలర్ 39 అనవసర తప్పిదాలు చేశాడు. మెన్స్ సింగిల్స్‌లో మరో క్వార్టర్‌ఫైనల్లో నాల్గో సీడ్ జానిక్ సిన్నర్ (ఇటలీ) వరుస సెట్లలో ఆండ్రీ రూబ్లెవ్ (రష్యా)పై గెలుపొందాడు. 2 గంటల 39 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో రష్యా ఆటగాడు రూబ్లెవ్ నిరాశపరిచాడు. 4-6, 6-7(5-7), 3-6తో ఒక్క సెట్‌నూ సొంతం చేసుకోలేదు. సిన్నర్, రూబ్లెవ్ చెరో 34 విన్నర్లు, 10 ఏస్‌లు సంధించినా.. బ్రేక్ పాయింట్లలో ఇటలీ ఆటగాడు పైచేయి సాధించాడు. సిన్నర్ రెండు సార్లు రూబ్లెవ్ సర్వ్‌ను బ్రేక్ చేయగా.. రష్యా స్టార్ ఒక్కసారీ ఆ పని చేయలేదు. పాయింట్ల పరంగా 115-103తో సిన్నర్ మెరిశాడు. ఓవరాల్‌గా సిన్నర్ 19 గేములు నెగ్గగా, రూబ్లెవ్ 13 గేములతో సరిపెట్టుకున్నాడు. రెండో సెట్ టైబ్రేకర్‌కు దారితీయగా.. అక్కడా రూబ్లెవ్ ఒత్తిడిలో చిత్తయ్యాడు. మెన్స్ సింగిల్స్ తొలి సెమీఫైనల్లో టాప్ సీడ్ నొవాక్ జకోవిచ్‌తో జానిక్ సిన్నర్ తలపడనున్నాడు.

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ అరినా సబలెంక (బెలారస్) సెమీస్‌కు చేరుకుంది. క్వార్టర్‌ఫైనల్లో చెక్ రిపబ్లిక్ అమ్మాయి బార్బర క్రజికోవపై బెలారస్ భామ వరుస సెట్లలో గెలుపొందింది. 6-2, 6-2తో సబలెంక అలవోక విజయం సాధించింది. నాలుగు ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో సబలెంక సూపర్ ప్రదర్శన చేసింది. పాయింట్ల పరంగా 55-34తో ఆధిపత్యం చూపించింది. నాల్గో సీడ్ అమెరికా స్టార్ కొకొ గాఫ్‌కు క్వార్టర్‌ఫైనల్లో కాస్త పోటీ ఎదురైంది. టైబ్రేకర్‌కు దారితీసిన మ్యాచ్‌లో గాఫ్ పైచేయి సాధించింది. 7-6(8-6), 6-7(3-7), 6-2తో ఉక్రెయిన్ అమ్మాయి మార్టాను మట్టికరిపించింది. గాఫ్ 9 బ్రేక్ పాయింట్లు సాధించగా, ఏడు బ్రేక్ పాయింట్లతో మార్టా ప్రతిఘటించింది. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో గాఫ్ గెల్చుకోగా.. రెండో సెట్‌ను టైబ్రేకర్‌లో మార్టా సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో గాఫ్ దూకుడు పెంచింది. అలవోకగా 6-2తో సెట్‌తో పాటు సెమీఫైనల్ బెర్త్ దక్కించుకుంది. మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో కొకొ గాఫ్‌తో సబలెంక పోటీపడనుంది. ఇదిలా ఉండగా, పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత ఆటగాడు రోహన్ బోపన్న నేడు బరిలోకి దిగనున్నాడు. ఆసీస్ భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి ఆరో సీడ్ అర్జెంటీనా జోడీని ఢీకొట్టనున్నాడు.



ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ రేసులో ఓ రేసర్ విన్యాసం

అదే మా లక్ష్యం

- మోటార్‌రేసింగ్‌లో ఇప్పుడు మనకూ ఓ జట్టు
- తెలంగాణలో స్పోర్ట్స్ కల్చర్‌కు కృషి
- కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ చీఫ్ అభిషేక్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్



భారత్‌లో క్రికెట్ క్రేజ్ గురించి చర్చ అవసరం ఉండదు. క్రికెట్ తప్ప ఇతర క్రీడలను అభిమానులు ఆదరించరు అంటే.. కచ్చితంగా చర్చ అవసరమే. బ్యాడ్మింటన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ సహా పలు క్రీడలు ఫ్రాంఛైజీ లీగ్‌లతో విజయవంతం అయ్యాయి. ఇదే కోవలోకి ఇప్పుడు మోటార్‌సైకిల్ రేసింగ్ వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రేసింగ్‌కు ఉన్న పాపులారిటీ అసమానం. భారత్‌లోనూ రేసింగ్‌కు విపరీతమైన అభిమాన గణం ఉంది. కానీ మనదంటూ చెప్పుకునేందుకు ఓ రేసర్, ఓ రేసింగ్ జట్టు లేదు. ఈ లోటు భర్తీ చేసేందుకు కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ ముందుకొచ్చింది. ఎఫ్ఐఎం (ప్రపంచ మోటార్‌సైకిల్ సమాఖ్య) ఈ ఎక్స్‌ప్లోరర్ ప్రపంచకప్‌లో భారత్ నుంచి పోటీపడుతున్న తొలి జట్టుగా ఇండీ రేసింగ్ నిలిచింది. ఫిబ్రవరి 16-17న జపాన్‌లోని ఒసాక నగరం వేదికగా జరుగుతున్న సీజన్ తొలి రేసులో భారత జట్టు ఇండీ రేసింగ్ బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ చీఫ్ అభిషేక్ రెడ్డితో మాటామంతీ..

అదే మా లక్ష్యం

భారత్‌కు మోటార్‌సైకిల్ రేసింగ్‌లో ప్రాతినిథ్యం లేదు. కానీ మన దగ్గర మోటార్‌సైకిల్ రేసర్లకు కొదవ లేదు. అధికారిక గణాంకాల ప్రకారం సుమారు 30 కోట్ల బైక్ రేసర్లు మన దగ్గర ఉన్నారు. ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ ప్రపంచకప్‌లో ఈ 30 కోట్ల బైక్ రేసర్లు ఇండీ రేసింగ్‌ను మన జట్టుగా భావించి అక్కున చేర్చుకోవటమే మా ప్రథమ లక్ష్యం. ప్రపంచ మోటార్‌సైకిల్ రేసింగ్‌లో తొలి ప్రయత్నంలోనే ఇండీ రేసింగ్ జట్టును విజేతగా నిలిపేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాం. భారత్‌లోని మోటార్‌సైకిల్ రేసర్ల కోసం త్వరలోనే వినూత్న కార్యక్రమంతో ముందుకొస్తాం.

ఆ రెండూ బలం

ఏ లీగ్‌కు అయినా రెండు సవాళ్లు కీలకం. సస్టైనబిలిటీ, ఈక్వాలిటీ. ఈ రెండూ ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్‌లో ఉన్నాయి. మోటార్‌సైకిల్ రేసులో పూర్తిగా ఎలక్ట్రిక్ బైక్‌లను మాత్రమే వాడతాం. పర్యావరణానికి జీరో నష్టం. ఇక ప్రపంచంలో ఏ క్రీడలో లేనివిధంగా లింగ సమానత్వం ఇక్కడ ఉంది. ఎఫ్ఐఎం రేసులో ప్రతి జట్టు నుంచి ఒకే రేసులో ఓ మెన్ రైడర్‌తో పాటు ఉమెన్ రైడర్ సైతం బరిలోకి దిగుతుంది. ఏ క్రీడలోనూ మహిళలు, పురుషులు కలిసి పోటీపడిందే లేదు. ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ ఈ లింగ సమానత్వం సైతం పాటిస్తుంది. ఈ రెండు లక్షణాలు ఇండీ రేసింగ్ జట్టుకు మరింత ఆదరణ తీసుకొస్తాయని నమ్ముతున్నాను.

9 సీజన్లు, 9 నగరాలు!

ఎఫ్ఐఎంతో కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ తొమ్మిదేండ్లకు ఒప్పందం కుదుర్చుకుంది. పది జట్లు పోటీపడుతున్న ఈ సీజన్లో ఐదు రేసులు ఉంటాయి. వచ్చే సీజన్ నుంచి ఇవి పెరుగనున్నాయి. రానున్న మూడేండ్లలో 12 రేసులకు పెంచే ప్రణాళిక ఉంది. ఈ ఏడాది సహా రానున్న తొమ్మిది సీజన్లకు భారత్ వేదిక కానుంది. తొమ్మిది సీజన్లలో రేసును ఒకే నగరంలో కాకుండా.. మోటార్‌సైకిల్ రేసింగ్‌ను అభిమానుల్లోకి తీసుకెళ్లేందుకు తొమ్మిది భిన్న నగరాల్లో నిర్వహించాలనే ఆలోచన ఉంది. దీంతో దేశవ్యాప్తంగా మోటార్‌సైకిల్ రేసింగ్‌కు మంచి ఆదరణ లభించనుంది.

స్పోర్ట్స్ కల్చర్‌కు కృషి

కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ మోటార్‌సైకిల్ రేసింగ్‌తో పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్ లీగ్‌ల్లోనూ జట్లను కలిగి ఉంది. తెలంగాణలో స్పోర్ట్స్ కల్చర్ సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో పాఠశాల స్థాయి నుంచి పనిచేసేందుకు సిద్ధమవుతున్నాం. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే వాలీబాల్, హ్యాండ్‌బాల్ టోర్నీలతో గ్రామీణ ప్రతిభకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నాం. చిన్నారులు, యువత సహజ ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ కెరీర్‌ను ఎంచుకునే రోజులు రావాలని కోరుకుంటున్నాం. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సుముఖంగా ఉన్నాం.

స్పిన్ పిచ్ సిద్ధం!

భారత్, ఇంగ్లాండ్ క్రికెటర్ల ముమ్మర ప్రాక్టీస్



హైదరాబాద్ : భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టుకు ఉప్పల్‌లో స్పిన్ సిద్ధమైంది!. రెండో రోజు నుంచే పిచ్ స్పిన్‌కు సహకరించే అవకాశం కనిపిస్తోంది. ఇటు భారత్, అటు ఇంగ్లాండ్‌లు స్పిన్ సవాల్ కోసం ముమ్మర సాధన చేశాయి. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో ఇరు జట్లు సుదీర్ఘ సెషన్ల పాటు ప్రాక్టీస్ చేశాయి. పిచ్ స్పిన్‌కు అనుకూలించేలా ఉంది. పరిస్థితులు, పిచ్‌ను పరిగణనలోకి తీసుకుని స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌ను తీసుకుంటున్నాం. కెఎల్ రాహుల్ బ్యాటర్‌గానే జట్టులో ఉంటాడు. భరత్, జురెల్‌లో ఒకరు వికెట్ కీపింగ్ గ్లౌవ్స్ అందుకుంటారు' అని భారత చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. ' జట్టులో పిచ్ గురించి చర్చ జరిగింది. కానీ పెద్దగా ఆందోళన ఏమీ లేదు. స్పిన్ సవాల్‌కు సిద్ధపడే ఇక్కడికి వచ్చామని' ఇంగ్లాండ్ పేసర్ మార్క్‌వుడ్ అన్నాడు.



సాత్విక్ జోడీ వరల్డ్ నం.1

కౌలాలంపూర్ : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానం కైవసం చేసుకుంది. వరుసగా మలేషియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్‌లు పురుషుల డబుల్స్ విభాగంలో వరల్డ్ నం.1గా నిలిచారు. మెన్స్ సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 8వ స్థానంలో నిలువగా.. లక్ష్యసేన్, శ్రీకాంత్, ప్రియాన్షులు వరుసగా 19, 25, 39వ స్థానాల్లో కొనసాగుతున్నారు.

రవిశాస్త్రికి జీవనసాఫల్య పురస్కారం

ఉత్తమ క్రికెటర్లుగా గిల్, దీప్తి, అశ్విన్, బుమ్రా, మంధాన

హైదరాబాద్ : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల్లో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, మాజీ కోచ్ రవిశాస్త్రి జీవనసాఫల్య పురస్కారం అందుకున్నాడు. నాలుగేండ్ల తర్వాత తొలిసారి జరిగిన అవార్డుల వేడుకలో గత సీజన్ల పురస్కారాలను సైతం అందజేశారు. ఉత్తమ క్రికెటర్‌గా పాలీ ఉమ్రీగర్ అవార్డును శుభ్‌మన్ గిల్ (2022-23), జస్‌ప్రీత్ బుమ్రా (2021-22), రవిచంద్రన్ అశ్విన్ (2020-21), మహ్మద్ షమి (2019-20), జస్‌ప్రీత్ బుమ్రా (2018-19) అందుకున్నారు. మహిళల విభాగంలో దీప్తి శర్మ (2022-23, 2019-20), పూనమ్ యాదవ్ (2018-19), స్మృతి మంధాన (2021-22) ఉత్తమ క్రికెటర్లుగా నిలిచారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. భారత, ఇంగ్లాండ్ క్రికెటర్లు సహా బీసీసీఐ కార్యదర్శి జై షా, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు హాజరయ్యారు.

ఇలాంటి కథ ఏ భాషలోనూ రాలేదు

పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్'తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమౌతున్నారు. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ అండ్ విహిన్ క్రియేషన్స్ బ్యానర్‌లపై జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ , దర్శకులు సాయి రాజేష్, వీరశంకర్, లక్ష్మీ భూపాల ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



తన్వీ నేగి, దీపిక్ సరోజ్

హీరో దీపిక్ సరోజ్ మాట్లాడుతూ, 'టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ట్రైలర్‌పై కూడా అదే ప్రేమ చూపిస్తారనే నమ్మకం ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. నా క్యారెక్టర్‌ని అద్భుతంగా మలిచి ఈ ప్రయాణంలో ప్రతి క్షణం సపోర్ట్ చేసిన మా డైరెక్టర్‌కి థ్యాంక్స్. ఫణి కంటెంట్‌ని నమ్మే నిర్మాత. మా సహ నిర్మాతలకు ధన్యవాదాలు. తన్వి చాలా అద్భుతంగా నటించింది. ఇందులో ఫిమేల్ క్యారెక్టరైజేషన్ ఆర్క్ చాలా గొప్పగా ఉంటుంది. ఫిబ్రవరిలో థియేటర్స్‌లో కలుద్దాం' అని అన్నారు. 'ప్రేక్షకులు మా టీజర్‌కి ఎంతో సపోర్ట్ చూపించారు. ట్రైలర్ కూడా మిమ్మల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తుంది' అని హీరోయిన్ తన్వీ నేగి చెప్పారు.

దర్శకుడు వి యశస్వీ మాట్లాడుతూ, 'హీరో దీపక్ అద్భుతంగా నటించాడు. తెలుగు సినిమా చరిత్రలో ఒక బెస్ట్ డెబ్యు పెర్ఫార్మెన్స్‌గా తన నటన నిలిచిపోతుంది. దర్శకుడు సుకుమార్‌కి ఈ కథ చెప్పాలని అనుకున్నాను. కానీ ఆయన వరకు చేరలేకపోయాను. టీజర్ ఆయనకి పెట్టాను. వెంటనే రిప్లై ఇచ్చారు. 'పుష్ప 2' షూటింగ్‌లో ఆయన్ని కలిశాను. అప్పుడు టీజర్ గురించి దాదాపు 20 నిముషాలు చర్చించారు. సినిమా చూస్తాను అన్నారు. రెండు నెలలు తర్వాత ఆయనకు సినిమా చూపించాను. ఫస్ట్ హాఫ్ అవ్వగానే లేచి హగ్ చేసుకొని 'అదిరిపోయింది సినిమా.. నీ నెక్స్ట్ సినిమా నా బ్యానర్‌లో చేయాలి' అన్నారు. దాని ఫలితమే ఈనెల 8న వచ్చిన అనౌన్స్‌మెంట్. యండమూరి రచనలకు నేను అభిమానిని. ఈ సినిమా కోసం ఆయనతో జర్నీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు.

'కథని నమ్మి ఈ చిత్రాన్ని నిర్మించాం. ఈ కథకు కావాల్సిన ప్రతి దాన్ని ఉత్తమంగా సమకూర్చాం. ఈ సినిమా విడుదలకు ముందే దర్శకుడు వి యశస్వీకి సుకుమార్ అవకాశం ఇవ్వడం విజయంగా భావిస్తున్నాం' అని నిర్మాత ఫణి చెప్పారు.



మెప్పించే మిస్ పర్ఫెక్ట్

డిస్నీ ఫ్లస్ హాట్ స్టార్ లేటెస్ట్‌గా 'మిస్ పర్ఫెక్ట్' అనే మరో సరికొత్త సిరీస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ వెబ్ సిరీస్‌లో లావణ్య త్రిపాఠీ, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో నటించారు. ఈ వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ ఫ్లస్ హాట్ స్టార్‌లో ఇది స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ సిరీస్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ విశ్వక్ ఖండేరావ్ మాట్లాడుతూ, 'ఇదొక మంచి ఎంటర్ టైనర్. హాట్ స్టార్‌లో చూడండి' అని అన్నారు. 'అభిజ్ఞ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ చాలా బాగా పర్ ఫార్మ్ చేశారు. 'మిస్ పర్ఫెక్ట్'కు లావణ్య త్రిపాఠి పర్ఫెక్ట్ అనిపించింది. ఒక చిన్న కథలో బలమైన క్యారెక్టర్స్ ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి' అని నిర్మాత సుప్రియ యార్లగడ్డ చెప్పారు. హీరోయిన్ లావణ్య త్రిపాఠీ మాట్లాడుతూ, 'ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. సిరీస్ కంప్లీట్ అయ్యేలోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యాను. సుప్రియతో 'సోగ్గాడే చిన్ని నాయన' మూవీకి వర్క్ చేశాను. ఆ సినిమా హిట్టయ్యింది. ఈ సిరీస్ కూడా అలాగే బిగ్ సక్సెస్ కావాలి' అని తెలిపారు.

నవచిత్రం





అత్యధిక నామినేషన్లతో

ఒప్పెన్ హైమర్

ఈ కొత్త ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. 96వ ఆస్కార్ పురస్కారాల కోసం వివిధ కేటగిరిల్లో పోటీ పడే చిత్రాల జాబితాతోపాటు నామినేషన్లకు అర్హులైన నటీనటులు, సాంకేతిక నిపుణులు, డాక్యుమెంటరీ చిత్రాలను ఆకాడమీ మంగళవారం ప్రకటించింది.

'అమెరికన్ ఫిక్షన్', 'అటానమీ ఆఫ్ ఎ ఫాల్', 'బార్బీ', 'ది హోల్డోవర్స్', 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్', 'మేస్ట్రో', 'ఒపెన్ హైమర్', 'పాస్ట్ లైవ్స్', 'పూర్ థింగ్స్',' దిజోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' చిత్రాలు ఉత్తమ చిత్రం విభాగంలో పడుతున్నాయి. 13 విభాగాల్లో 'ఒపెన్ హైమర్' అత్యధిక నామినేషన్లతో ఆస్కార్ బరిలో ముందంజలో ఉండగా, 6 నామినేషన్లతో 'బార్బీ' సినిమా రెండో స్థానంలో గట్టి పోటీ ఇస్తోంది.

ఇదిలా ఉంటే, ఉత్తమ విదేశీ చిత్రం విభాగం కోసం మన దేశం నుంచి ఎంపికైన '2018' చిత్రం ప్రాథమిక దశలోనే వెనుదిరిగింది. అయితే మనదేశానికి చెందిన 'టు కిల్ ఏ టైగర్' బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్‌ని సొంతం చేసుకుంది. 96వ ఆస్కార్ పుస్కారాల ప్రదానం మార్చి 10వ తేదీన లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో అత్యంత వైభవంగా జరుగనుంది.

మూడో కన్ను

రిపబ్లిక్ డే కానుకగా రిలీజ్



శ్రీనివాసరెడ్డి, సాయికుమార్

సెవెన్ స్టార్ క్రియేషన్స్, ఆడియన్స్ పల్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ద్వారా 'ప్లాన్ బి' డైరెక్టర్ కె.వి రాజమహి, సునీత రాజేందర్ దేవులపల్లి నిర్మిస్తున్న చిత్రం 'మూడో కన్ను'.

అమెరికాలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న నాలుగు కథల ఈ ఆంథాలజీ చిత్రం ద్వారా నలుగురు కొత్త దర్శకులు సూరత్ రాంబాబు, కె బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయి సురేంద్రబాబు పరిచయం చేస్తున్నారు. హీరో శ్రీకాంత్ ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా మీద ఒక మంచి కాన్ఫిడెన్స్ ఉంది. ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుంది. చిన్న సినిమాలే మంచి సక్సెస్ సాధిస్తాయి. ఈ ట్రైలర్ చాలా బాగుంది. నలుగురు డైరెక్టర్స్‌కి అల్ ది బెస్ట్' అని అన్నారు. దర్శకుడు నటుడు, వీరశంకర్, మాధవి లత ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర నిర్మాతలు కె.వి రాజమహి, సునీత రాజేందర్ మాట్లాడుతూ,'ఈ చిత్రంలో నటించిన సాయికుమార్, శ్రీనివాసరెడ్డి, కాశీ విశ్వనాథ్, ఇతర నటీనటులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాం. ఈచిత్రాన్ని ఈనెల 26వ తేదీన విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.

కథ, కథనం, మాటలను కె.వి రాజమహి అందించిన ఈ చిత్రంలో సూర్య, మహేష్ వడ్డి, నిరోష, కౌశిక్ రెడ్డి, ప్రదీప్ రుద్ర, దయానంద రెడ్డి, శశిధర్ కౌసరి, దేవి ప్రసాద్, చిత్రం శ్రీను, సత్య శ్రీ, మధు, దివ్య, రూప తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.

హనీమూన్ ఎక్స్‌ప్రెస్

పాటల సందడి షురూ



హెబ్బా పటేల్, చైతన్యరావు

ఎన్ ఆర్ ఐ ఎంటర్టైన్మెంట్స్ (యుఎస్ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకం పై చైతన్య రావు, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్‌గా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'.

తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి బాల రాజశేఖరుని రచయిత, దర్శకుడు. ఈ చిత్రానికి కళ్యాణి మాలిక్ సంగీతం అందిస్తుంగా, కెకెఆర్, బాల రాజ్ సంయుక్తంగా ఈ రొమాంటిక్ కామెడీని నిర్మిస్తున్నారు. కళ్యాణి మాలిక్ స్వరపరిచి, సింగర్‌సునీత తో కలిసి పాడిన అందమైన ప్రేమ గీతం 'నిజమా' పాటను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నిజమా' పాట చాలా మెలోడియస్‌గా ఉంది. చాలా బాగా చిత్రీకరించారు. కెమెరామాన్ పనితీరు, లొకేషన్స్ చాలా బాగున్నాయి. ఈ పాటను నేను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. కథ విన్నాను, కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలి' అని అన్నారు. 'రామ్ గోపాల్ వర్మతో రెండు హాలీవుడ్ చిత్రాలకు పని చేశాను. ఇదొక మంచి రొమాంటిక్ కామెడీ చిత్రం. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని దర్శకుడు బాల రాజశేఖరుని చెప్పారు. ఈచిత్రానికి సంగీతం : కళ్యాణి మాలిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ : ఆర్ పి పట్నాయక్, లిరిక్స్ : కిట్టు విస్సప్రగడ, ఆర్ట్, సినిమాటోగ్రఫీ : శిష్టా విఎమ్‌కె, ఎడిటింగ్ : ఉమా శంకర్ జి (యుఎస్ఎ), శ్రీ కృష్ణ అత్తలూరి, ఆడియో : టి సిరీస్.

ఆ తప్పు.. వెంటాడుతుంది



నవీన రెడ్డి

తెలుగు తెరపైకి మరో యూత్ ఫుల్ ఎంటర్టైనర్ వచ్చేస్తోంది. యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కథతో పాటు మెసెజ్ ఇస్తూ తెరకెక్కిన చిత్రం 'బీఫోర్ మ్యారేజ్'. సుజన ఆర్ట్స్ బ్యానర్‌పై 'టార్జాన్ సుందరి, ప్రేమ ఘర్షణ, సంసార వీణా' వంటి సినిమాలు నిర్మించిన వై నాగేశ్వర్ రెడ్డి తనయుడు ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి నిర్మాతగా పరిచయమవుతూ హనుమ క్రియేషన్స్ పై నిర్మిస్తున్న చిత్రమిది. భరత్, నవీన రెడ్డి హీరో హీరోయిన్లు. శ్రీధర్ రెడ్డి ఆటాకుల దర్శకుడు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈనెల 26న ఎస్.కె.యమ్.ఎల్ మోషన్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా ఆది నారాయణ ఈ చిత్రాన్ని సుమారు 100 థియేటర్‌లలో విడుదల చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నిర్మాతలు ప్రసన్నకుమార్, రామసత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకుడు శ్రీధర్ రెడ్డి ఆటాకుల మాట్లాడుతూ,'పెళ్లికి ముందు తప్పు అనిపించని పొరపాటుతో లైఫ్‌లో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయని, అదే విషయాన్ని వాస్తవానికి దగ్గరగా సినిమాను తెరకెక్కించాం' అని తెలిపారు. 'చిన్న విషయమే కదా అని యువత పెడదోవ పడితే ఏం జరుగుతుందో కళ్లకు కట్టినట్టు చూపించిన సినిమా ఇది. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను నిర్మించాం. సినిమాలో సింగర్ మంగ్లీ పాడిన పాట భారీ హిట్టవుతుంది. యువతకు మంచి మెసేజ్ ఉంది' అని నిర్మాత ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.